గురువారం
19•3•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 264
• పేజీలు : 12 + 12

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

WWW.NTNEWS.COM
/NTDAILYONLINE




# జర పదిలం

## స్వీయ ఆరోగ్య పరిరక్షణ చర్యలు తప్పనిసరి

- విదేశాల నుంచి వచ్చినవారు పరీక్షల తర్వాతే ఇండ్లకు
- ఎక్కువసంఖ్యలో గుమిగూడే కార్యక్రమాలు వద్దేవద్దు
- పండుగలు, ఉత్సవాలకు దూరంగా ఉండాలి
- రాష్ట్ర ప్రజలకు సీఎం కే చంద్రశేఖర్‌రావు పిలుపు
- కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణకు మరిన్ని చర్యలు
- నేడు ప్రగతిభవన్‌లో సీఎం అత్యున్నతస్థాయి సమావేశం

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

కరోనా వైరస్ వ్యాప్తి కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని కోణాల్లో ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరిస్తున్నది. మరిన్ని కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధమైంది. ఈ వైరస్‌ను ఎదుర్కోవడానికి కఠిన చర్యలు తప్పవని, ప్రజలు మరిన్ని స్వీయ ఆరోగ్య పరిరక్షణ చర్యలు తీసుకొని అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కోరారు. కరోనా నుంచి మనల్ని మనం కాపాడుకుందామని బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. విదేశాల నుంచి వచ్చినవారిలోనే కరోనా వైరస్ బయటపడుతున్నందువల్ల ఇతరదేశాల నుంచి వచ్చినవారిని ఎవరినైనా తప్పనిసరిగా సంపూర్ణ పరీక్షలు నిర్వహించిన తర్వాతే ఇండ్లకు పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ప్రజలు కూడా అప్రమత్తమై ప్రభుత్వానికి సమాచారమందించాలన్నారు. ప్రజలు ఎక్కువగా గుమిగూడే కార్యక్రమాలన్నింటినీ రద్దుచేసుకోవాలని సూచించారు. సామూహికంగా జరిగే పండుగలు, ఉత్సవాలకు కూడా ప్రజలు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తీసుకొనే చర్యలను ప్రజలు అర్థం చేసుకొని రాష్ట్రాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ క్రమంలో కరోనా వైరస్ వ్యాప్తిని కట్టడిచేయడానికి తీసుకోవాల్సిన కట్టుదిట్టమైన చర్యలపై సీఎం కేసీఆర్ గురువారం అత్యున్నతస్థాయి అత్యవసర



మిగతా 4వ పేజీలో



కరోనా వైరస్ అనుమానితులను కరీంనగర్ నుంచి హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలిస్తున్న 108 సిబ్బంది

## కరీంనగర్‌లో హై అలర్ట్


ఏడుగురికి కరోనా పాజిటివ్.. అంతా ఇండోనేషియా దేశస్థులే

పట్టణంలో ఇంటింటికీ వైద్య పరీక్షలు.. రంగంలోకి వంద వైద్య బృందాలు

భయపడాల్సిన అవసరం లేదన్న మంత్రి గంగుల కమలాకర్ 4

### సైన్యంలో తొలి కేసు

- లడఖ్‌లో ఒక జవాన్‌కు కరోనా పాజిటివ్
- వార్‌గేమ్స్, శిక్షణ రద్దుచేసిన సైన్యం
- దేశంలో 158కి చేరిన బాధితులు
- మహారాష్ట్రలో విజృంభిస్తున్న వైరస్
- ఆ రాష్ట్రంలో కేసుల సంఖ్య 42



### 2 లక్షల మందికి వైరస్

- ప్రపంచవ్యాప్తంగా సుమారు 9వేల మరణాలు
- వైరస్ ప్రభావం నుంచి కోలుకున్నవారు 82 వేలు

### 4 దశల కరోనా



1. విదేశాలకు వెళ్లి వైరస్ ప్రభావానికి గురవడం.
2. విదేశాల నుంచి వచ్చిన వ్యక్తి ద్వారా అతని సన్నిహితులకు వైరస్ సోకడం.
3. వైరస్ సోకిన ఈ వ్యక్తుల నుంచి ఒక సమూహానికి వ్యాపించడం.
4. వైరస్ సోకిన జనసమూహాల నుంచి అనేకమందికి విస్తృతమవడం.

### జిల్లాల్లోనూ క్వారంటైన్ సెంటర్లు

మంత్రి ఈటల

రాష్ట్రంలో తాజాగా ఎనిమిది కేసులు

అందరూ విదేశాల నుంచి వచ్చినవారే 4



బుధవారం నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ టీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు కలెక్టరేట్‌కు వెళ్తున్న కల్వకుంట్ల కవిత. చిత్రంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, జాజల సురేందర్ తదితరులు ఉన్నారు.

## టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కవిత నామినేషన్

ఎంపీ సంతోష్ సహా పలువురు నేతల అభినందనలు 2



బుధవారం రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవమైన టీఆర్‌ఎస్ నేతలు కే కేశవరావు, కేఆర్ సురేశ్‌రెడ్డికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు. చిత్రంలో మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

## కేకే, సురేశ్‌రెడ్డి ఏకగ్రీవం

ధ్రువీకరణ పత్రాలు అందుకున్న టీఆర్‌ఎస్ నేతలు

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు

అంచనాలకు తగ్గట్టుగా పనిచేస్తామని వెల్లడి 2

రాజ్యసభలో ఏడుకు పెరిగిన టీఆర్‌ఎస్ బలం




బుధవారం వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన సింగిల్‌పట్టి మిర్చి

## ఎర్రబంగారం @ రూ.26 వేలు

### సింగిల్‌పట్టి మిర్చికి రికార్డు ధర

**కాశీబుగ్గ:** వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో మిర్చి ధరలు రికార్డు సృష్టిస్తున్నాయి. ఈ సీజన్‌లో అత్యధికంగా బుధవారం సింగిల్‌పట్టి రకం మిర్చికి క్వింటాల్‌కు రూ.26 వేల ధర లభించింది. గత నెలలో సింగిల్‌పట్టి రకం మిర్చి క్వింటాల్‌కు రూ.21,500 ధర పలుకగా, సోమవారం రూ.24,500, మంగళవారం రూ.25,500 ధర పలికింది. బుధవారం రూ.26 వేలకు చేరుకున్నది. తేజ, యుఎస్-341 రకం మిర్చికి సైతం ఈ సీజన్‌లో అత్యధికంగా క్వింటాల్‌కు రూ.23,500 ధర దక్కింది. ములుగు జిల్లా దేవగిరిపట్నం గ్రామానికి చెందిన రైతు వీ వెంకట్‌రెడ్డి ఐదు బస్తాల సింగిల్‌పట్టి మిర్చిని మార్కెట్‌కు తీసుకురాగా, క్వింటాల్‌కు రూ.26 వేల ధరతో ట్రేడర్లు కొనుగోలు చేశారు. ఈ సీజన్ డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు మార్కెట్‌కు 3.35 లక్షల క్వింటాళ్ల మిర్చి రాగా అందులో సింగిల్‌పట్టి రకం మిర్చి 300 క్వింటాళ్లు వచ్చినట్టు మార్కెట్ అధికారులు తెలిపారు. మిర్చికి పెద్దఎత్తున ధర పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రైతు వీ వెంకట్‌రెడ్డి

## రుణమాఫీకి 1,210 కోట్లు విడుదల

పరిపాలన అనుమతులిస్తూ వ్యవసాయశాఖ కార్యదర్శి ఉత్తర్వులు

రూ.25 వేలలోపు పంటరుణ రైతులకు గ్రామసభల్లో చెక్కుల అందజేత 2

## పాతబస్తీకి కొత్తందాలు



మూసీకి ఇరువైపులా నాలుగులేన్ల రోడ్డు

హైదరాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్లు

పాతబస్తీ అభివృద్ధిపై సమీక్షలో మంత్రి కేటీఆర్ 2

## పది పరీక్షలకు అంతా సిద్ధం

నేటినుంచి వచ్చే నెల ఆరు వరకు

రాష్ట్రవ్యాప్తంగా 2,530 కేంద్రాలు

5,34,903 మంది అభ్యర్థులు 2




## చమురు వదులుతున్నది

18 ఏండ్ల కనిష్ఠానికి క్రూడ్

25 డాలర్లకు బ్యారెల్ ధర 8

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | |
|---|---|
| ఫారం ధర | 23.00 |
| రిటైల్ లైవ్ | 45.00 |
| డ్రెస్డ్ | 65.00 |
| స్కిన్‌లెస్ | 74.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | |
|---|---|
| హైదరాబాద్ | 210.00 |
| రంగారెడ్డి | 210.00 |
| మెదక్ | 210.00 |
| కరీంనగర్ | 213.00 |
| వరంగల్ | 213.00 |
| డజన్ ధర | 40.00 |



# రుణమాఫీకి 1,210 కోట్లు విడుదల

- పరిపాలన అనుమతులిస్తూ వ్యవసాయశాఖ కార్యదర్శి ఉత్తర్వులు
- రూ.25 వేలలోపు పంటరుణ రైతులకు గ్రామసభల్లో చెక్కుల అందజేత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వ్యవసాయ పంట రుణమాఫీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,210 కోట్ల నిధులు విడుదలచేసింది. ఈ నిధులతో రూ.25 వేలలోపున్న పంటరుణాలను ఒకేసారి మాఫీచేయనున్నది. ఈ మేరకు బుధవారం వ్యవసాయ కార్యదర్శి డాక్టర్ బీ జనార్దన్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. రూ.25 వేలలోపు పంటరుణాలున్న రైతులు రాష్ట్రంలో 5.83 లక్షల మంది వరకున్నారు. గ్రామసభల్లో వారికి నేరుగా చెక్కులు అందించనున్నారు. 2019-20 వార్షిక బడ్జెట్‌లో పంట రుణమాఫీ కోసం ప్రభుత్వం రూ.6 వేల కోట్లు కేటాయించింది. తాజాగా రుణమాఫీ సంబంధించిన మార్గదర్శకాలను వ్యవసాయశాఖ విడుదలచేసింది. రాష్ట్రంలో రూ.25 వేల వరకు రుణాలున్న రైతులకు ఒకేవిడుతలో, రూ.లక్షలోపు ఉన్నవారికి నాలుగువిడుతల్లో రుణమాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సీఎం కేసీఆర్ కూడా ప్రకటించారు. గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.6 వేల కోట్ల నుంచే తాజాగా రూ.1,210 కోట్లు విడుదలచేశారు.

# ముగిసిన ఇంటర్ పరీక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివరిరోజైన బుధవారం పరీక్షలకు మొత్తం 9.65 లక్షల (95.72 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలు సమర్థంగా నిర్వహించేందుకు సహకరించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, కలెక్టర్లు, రెవెన్యూ, పోలీస్, పోస్టల్, టీఎస్ ఆర్టీసీ, ట్రాన్స్‌కో, మెడికల్ అండ్ హెల్త్, బీఎస్‌ఎన్‌ఎల్ శాఖలకు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఒమర్ జలీల్ ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1,339 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా.. 26,964 మంది ఇన్విజిలేటర్లు, 225 స్క్వాడ్లు విధులు నిర్వర్తించినట్టు పేర్కొన్నారు. మొత్తం 436 మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని తెలిపారు.

# పది పరీక్షలకు సిద్ధం

- నేటినుంచి వచ్చే నెల ఆరు వరకు
- రాష్ట్రవ్యాప్తంగా 2,530 కేంద్రాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో గురువారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వచ్చేనెల ఆరు వరకు జరుగనున్నాయి. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు ఏ సత్యనారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2,530 కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు 5,34,903 మంది విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. హాల్‌టికెట్లను పాఠశాలలకు పంపడంతోపాటు www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లోనూ పొందుపరిచామని తెలిపారు. నాలుగు ప్రత్యేక ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 144 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించినట్టు పేర్కొన్నారు.





టీఆర్‌ఎస్‌ఎల్పీలో మీడియాతో మాట్లాడుతున్న కేకే, కేఆర్ సురేశ్‌రెడ్డి

# కేకే, కేఆర్ ఏకగ్రీవం

- ధ్రువీకరణ పత్రాలు అందుకున్న టీఆర్‌ఎస్ అభ్యర్థులు
- ముఖ్యమంత్రి కేచంద్రశేఖర్‌రావుకు కృతజ్ఞతలు
- సీఎం అంచనాలకు తగ్గట్టుగా పనిచేస్తామని వెల్లడి
- రాజ్యసభలో ఏడుకు పెరిగిన టీఆర్‌ఎస్ బలం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రం నుంచి రెండు రాజ్యసభ స్థానాలకు టీఆర్‌ఎస్ అభ్యర్థులు కే కేశవరావు, కేఆర్ సురేశ్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం అసెంబ్లీలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ వీ నరసింహాచార్యులు వీరిద్దరికీ రాజ్యసభకు ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రాలను అందించారు. వీరివెంట మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఉన్నారు. అనంతరం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో ఇద్దరు ఎంపీలు మీడియాతో మాట్లాడారు. రాజ్యసభకు అవకాశమిచ్చిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. సహకరించిన పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ ఆశయాలు, సీఎం కేసీఆర్ అంచనాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. దేశంలో టీఆర్‌ఎస్ పార్టీ కీలకపాత్రను పోషించాల్సి ఉన్నదని చెప్పారు. రాజ్యసభకు తనను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నందుకు సురేశ్‌రెడ్డి.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

**16కు చేరిన ఎంపీల సంఖ్య**

రెండు స్థానాల్లో టీఆర్‌ఎస్ ఎంపీలు గెలుపొందడంతో పార్లమెంట్‌లో టీఆర్‌ఎస్ ఎంపీల సంఖ్య 16కు చేరింది. లోక్‌సభలో 9 మంది, రాజ్యసభలో ఏడుగురు ఉన్నారు. పార్లమెంట్ సభ్యుల ఎంపికలోనూ ముఖ్యమంత్రి కేసీఆర్ సామాజిక సమతూకానికి ప్రాధాన్యమిచ్చారు.

# పాతబస్తీకి కొత్తందాలు

- మూసీకి ఇరువైపులా నాలుగులేన్ల రోడ్డు
- హైదరాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్లు
- పాతబస్తీ అభివృద్ధిపై సమీక్షలో మంత్రి కేటీఆర్



హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో జీహెచ్‌ఎంసీ చేపట్టిన పనుల ప్రగతిని సమీక్షిస్తున్న ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు. చిత్రంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ, మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**

ఈస్ట్-వెస్ట్ కారిడార్‌లో భాగంగా మూసీనదికి ఇరువైపులా నాలుగులేన్ల రోడ్డు నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తున్నదని పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు చెప్పారు. స్థలాల అందుబాటునుబట్టి హైదరాబాద్‌లో గజ్వేల్ తరహాలో ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్లు, వాక్యూమ్ డీవాటర్డ్ సిమెంట్ కాంక్రీట్ (వీడీసీసీ) రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంచేయాలని సూచించారు. పాతబస్తీలో చేపట్టిన అభివృద్ధి పనులపై మంత్రి కేటీఆర్ బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో స్థానిక ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో కలిసి అధికారులతో సమీక్షించారు. హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి ప్రణాళిక (ఎస్సార్డీపీ) కింద చేపట్టిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, పాదచారుల వంతెనలు, రోడ్ల విస్తరణ తదితర పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. మంచినీటి సరఫరా పైప్‌లైన్ల నిర్వహణ, క్రీడా మైదానాలు, మెట్రోలైను నిర్మాణం, నాలాల విస్తరణ, ఎస్సార్డీపీ ప్రాజెక్టులు తదితరవాటికి అవసరమైన భూసేకరణ వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో వేగం పెంచేందుకు ఓ అధికారిని నియమించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు సూచించారు. రోడ్ల విస్తరణ కోసం ఆస్తులిచ్చేందుకు ముందుకొచ్చేవారికి వెంటనే నష్టపరిహారం చెల్లించి స్థలాలు స్వాధీనం చేసుకోవాలని చెప్పారు. ఇందుకు స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు.

**మురుగు వ్యవస్థ ఆధునీకరణకు రూ.200 కోట్లు**

తాగునీటి సరఫరాలో పైప్‌లైన్ల లీకేజీతో ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని మంత్రి కేటీఆర్ ఆదేశించారు. పాడైన పైప్‌లైన్ల స్థానంలో, చివరి ప్రాంతాలకు తాగునీటి సరఫరా కోసం కొత్త పైప్‌లైన్లు వేయాలని చెప్పారు. మురుగునీటిపారుదల వ్యవస్థ ఆధునీకరణలో భాగంగా నాలాల విస్తరణకు ప్రభుత్వం రూ.200 కోట్లు మంజూరుచేసిందని ఆయన తెలిపారు. ప్రజకు ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతున్న నేపథ్యంలో పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటుచేయాలని సూచించారు. లేఔట్ ఓపెన్ స్పేస్‌లు, పార్కుల్లో పబ్లిక్, షీ టాయిలెట్లు నిర్మించాలని ఆదేశించారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో మజ్లిస్ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ, మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్, వాటర్‌బోర్డు ఎండీ దానకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

**కేటీఆర్‌తో మంత్రుల భేటీ**

మంత్రులు ఈటల, సబితారెడ్డి, సత్యవతి రాథోడ్.. జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో మంత్రి కేటీఆర్‌తో భేటీ అయ్యారు. అనంతరం టీఎస్‌పీఎస్సీ అధికారులు, సిరిసిల్లకు చెందిన పార్టీ కార్యకర్తలు కేటీఆర్‌ను కలిశారు.

## వేగంగా మాస్టర్ ప్లాన్ల రూపకల్పన

**తుదిదశలో 20 పట్టణాల ప్రణాళికలు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పట్టణాల్లో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని సాధించేందుకు డీటీసీపీ (డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) మాస్టర్‌ప్లాన్లను సిద్ధంచేసే పనిలో నిమగ్నమైంది. రాష్ట్రంలో 142 పట్టణాలు ఉండగా.. వీటిలో 101 పట్టణ స్థానిక సంస్థలు తెలంగాణ రాష్ట్ర టౌన్‌ప్లానింగ్ చట్టం-1920 పరిధి కిందకొస్తాయి. మిగిలిన 41 పట్టణాభివృద్ధి ఆథారిటీల నిబంధనల పరిధిలోకి వస్తాయి. 101 పట్టణ స్థానిక సంస్థల్లో.. 32 పట్టణాల మాస్టర్ ప్లాన్లను రూపొందించడానికి ప్రభుత్వం అంగీకరించింది. మరో 23 పట్టణాల మాస్టర్ ప్లాన్లను డీటీసీపీ అధికారులు సిద్ధం చేస్తుండగా.. 27 పట్టణాల ల్యాండ్ యూజ్ ప్లాన్లను రూపొందిస్తున్నారు. ఇప్పటికే యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వైటీడీఏ) తుది మాస్టర్‌ప్లాన్‌ను డీటీసీపీ ప్రభుత్వానికి సమర్పించింది. నిజామాబాద్ కార్పొరేషన్ కోసం రూపొందించిన డ్రాఫ్ట్ మాస్టర్‌ప్లాన్‌ను ప్రభుత్వం ఆమోదించింది. 20పట్టణ స్థానిక సంస్థల బృహత్ ప్రణాళికలను రూపొందించడానికి టీఎండీపీ (తెలంగాణ మున్సిపల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు) కింద డీటీసీపీ ఒక కన్సల్టెంట్‌ని నియమించింది. అమృత్ పథకం కింద దాదాపు పది పట్టణాలకు మాస్టర్ ప్లాన్ సవరణలను చేపట్టింది. ఇందులోభాగంగా మొదటి ప్యాకేజీ కింద ఆదిలాబాద్, రామగుండం, కరీంనగర్ పట్టణాభివృద్ధి సంస్థ పరిధి మాస్టర్‌ప్లాన్ తయారీకి ఢిల్లీకి చెందిన డీడీఎఫ్ కన్సల్టెంట్స్‌తో డీటీసీపీ ఒప్పందం కుదుర్చుకున్నది.

# తెలంగాణపై కేంద్రం వివక్ష

**లోక్‌సభలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శ**



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై తీవ్ర వివక్షను చూపుతున్నదని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల్లో కేంద్రం కోతలు విధిస్తున్నదని పేర్కొన్నారు. ఇప్పటికైనా నిధు లు కేటాయించి, విడుదల చేయాలని కోరారు. బుధవారం లోక్‌సభలో జమ్ముకశ్మీర్ రాష్ట్ర పద్దులపై జరిగిన చర్చలో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రం ప్రగతిశీల రాష్ట్రాలను ప్రోత్సహించాల్సిందిపోయి వివక్ష చూపుతున్నదని విమర్శించారు. రాష్ట్రాల ఆర్థిక అవసరాలు, ఆర్థిక మాంద్యం నేపథ్యంలో కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటా 42 నుంచి 48 శాతానికి పెరుగుతాయని రాష్ట్రాలు అంచనా వేశాయని తెలిపారు. కానీ 15వ ఆర్థిక సంఘం మధ్యంతర నివేదికలో దాన్ని 42 నుంచి 41 శాతానికి తగ్గించారని, ఇది మంచి విధానం కాదన్నారు. జమ్ముకశ్మీర్ అభివృద్ధికి టీఆర్‌ఎస్ పార్టీ పూర్తి మద్దతు తెలుపుతుందని, అయితే రాష్ట్రాల పన్నుల వాటాను తగ్గించి దానికి కేటాయించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు.

# అనాథల కోసం ప్రత్యేక విధానం

**రాజ్యసభలో బండా ప్రకాశ్ వినతి**



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అనాథల సంక్షేమం కోసం విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉన్నదని టీఆర్‌ఎస్ ఎంపీ బండా ప్రకాశ్ అన్నారు. అనాథల కోసం ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తామని గతంలోనే సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపిందని, అయితే దీనిని ఇంతవరకు అమలుచేయలేదని విచారం వ్యక్తంచేశారు. బుధవారం రాజ్యసభలో అనాథలపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు.

**హోమియోపతి బిల్లుకు మద్దతు**

నేషనల్ కమిషన్ ఫర్ హోమియోపతి బిల్లు, నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టం ఆఫ్ మెడిసిన్ బిల్లుకు మద్దతు తెలుపుతున్నట్టు ఎంపీ బండా ప్రకాశ్ చెప్పారు. ఈ బిల్లుల్లో అనేక పరిమితులు, షరతులు ఉన్నాయని, స్టాండింగ్ కమిటీ ఇచ్చిన సిఫారసులను విస్మరించారని అన్నారు.

# ఎమ్మెల్సీకి కవిత నామినేషన్

## నిజామాబాద్ కలెక్టరేట్‌లో దాఖలు

## పలువురు నాయకుల అభినందనలు



నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీస్థానానికి నామినేషన్ పత్రాలను కలెక్టర్ నారాయణరెడ్డికి అందజేస్తున్న కవిత. చిత్రంలో ఎమ్మెల్యేలు జాజుల సురేందర్, గంప గోవర్ధన్, మహ్మద్ షకీల్, బిగాల గణేశ్‌గుప్తా ఉన్నారు.



నామినేషన్‌కు ముందు మినిస్టర్స్ క్వార్టర్స్‌లో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కవిత. చిత్రంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు ఉన్నారు.

**నిజామాబాద్/నమస్తే తెలంగాణ ప్రతినిధి:**

నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి మాజీ ఎంపీ, తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత టీఆర్‌ఎస్ అభ్యర్థిగా బుధవారం నామినేషన్ దాఖలుచేశారు. మంగళవారం రాత్రి అనూహ్యంగా కవిత పేరును పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఖరారుచేశారు. బుధవారం ఉదయం మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డితోపాటు, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఆమె నామినేషన్ సమర్పించారు.

**అడుగడుగునా ఘనస్వాగతం**

ఎమ్మెల్సీ అభ్యర్థిగా తన పేరును అధిష్ఠానం ఖరారుచేయడంతో కవిత.. బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితోపాటు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అక్కడి నుంచి మంత్రి ప్రశాంత్‌రెడ్డితో కలిసి ఒకే వాహనంలో నిజామాబాద్ బయలుదేరారు. వీరివెంబడి ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, గంప గోవర్ధన్, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, జాజుల సురేందర్, హన్మంత్‌షిండే, మహ్మద్ షకీల్, ఎమ్మెల్సీలు వీజీ గౌడ్, రాజేశ్వర్, ఆకుల లలిత భారీ కాన్వాయ్‌తో అనుసరించారు. కామారెడ్డి జిల్లా కేంద్రం మొదలుకొని ఇందల్వాయి, డిచ్‌పల్లి, నిజామాబాద్ జిల్లా కేంద్రం శివారు వరకు కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఆమెకు ఘనస్వాగతం పలికారు. అడుగడుగునా అభిమానుల ప్రేమాభిమానాలు ఆమెను ముంచెత్తాయి. నేరుగా తన నివాసానికి చేరుకొన్న కవిత అక్కడ తన భర్తతో కలిసి అత్తామామల ఆశీర్వాదం తీసుకున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత కలెక్టరేట్‌కు చేరుకొన్నారు. కలెక్టర్ సీ నారాయణరెడ్డికి ఒక సెట్టు నామినేషన్ పత్రాలు దాఖలుచేశారు. అక్కడినుంచి వాహనంలో నేరుగా కంఠేశ్వర్‌లోని తన నివాసానికి వెళ్లిపోయారు. నామినేషన్ల దాఖలుకు చివరిరోజైన గురువారం ఆమె మరో రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేయనున్నట్లు పార్టీశ్రేణులు తెలిపాయి.

**సర్వత్రా హర్షం**

నిజామాబాద్ స్థానికసంస్థల నియోజకవర్గానికి జరుగుతున్న ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా కల్వకుంట్ల కవితను ఎంపిక చేయడంపట్ల పార్టీ వర్గాల్లో సర్వత్రా హర్షం వ్యక్తమైంది. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, టీఆర్‌ఎస్ ఎన్నారై శాఖలు అభినందనలు తెలియజేశాయి. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో నిజామాబాద్ జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. వేదపండితులు ఆశీర్వదించారు. మాజీ ఎంపీ కవితను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికచేయడం పట్ల ఆర్థికశాఖ మంత్రి టీ హరీశ్‌రావు ట్విట్టర్ ద్వారా మనఃస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కవితకు ట్విట్టర్ ద్వారా శుభాకాంక్షలు చెప్పారు. రాజ్యసభ సభ్యుడు జే సంతోష్‌కుమార్ ట్విట్టర్ ద్వారా శుభాకాంక్షలు తెలుపుతూ, ఎక్కడున్నా ఆ ప్రాంతానికి గుర్తింపు తెస్తారంటూ అభినందించారు. కవితకు శుభాకాంక్షలు తెలిపినవారిలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వీ శ్రీనివాస్‌గౌడ్, సత్యవతిరాథోడ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. కవితకు ఎమ్మెల్సీ సీటు ఇవ్వడం పట్ల మండలిలో ప్రభుత్వ విప్ కర్నె ప్రభాకర్ హర్షం వ్యక్తంచేశారు. బుధవారం అసెంబ్లీ ఆవరణలోని తన కార్యాలయంలో టీఎస్‌ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, రాష్ట్ర పౌరసరఫరాలసంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ జాగృతి స్థాపించి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమసాధనలో ఎంపీ కవిత కీలకపాత్ర పోషించారన్నారు.

**ఎన్నారై శాఖల హర్షం**

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ టీఆర్‌ఎస్ అభ్యర్థిగా మాజీ ఎంపీ కవితను ఎంపిక చేయడంపట్ల టీఆర్‌ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల హర్షం వ్యక్తంచేశారు. టీఆర్‌ఎస్ ఎన్నారై సలహాదారు, టీఆర్‌ఎస్ దక్షిణాఫ్రికాశాఖ అధ్యక్షుడు గుర్రాల నాగరాజు, ఆస్ట్రేలియా శాఖ అధ్యక్షుడు కాసర్ల నాగేందర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ ఎన్నారై యూకే సలహామండలి వైస్‌చైర్మన్ సిక్కా చంద్రశేఖర్, టీఆర్‌ఎస్ ఎన్నారై బహ్రెయిన్ శాఖ అధ్యక్షుడు రాధారపు సతీశ్‌కుమార్, టీఆర్‌ఎస్ ఖతార్ శాఖ అధ్యక్షుడు శ్రీధర్ అబ్బగౌని తదితరులు హర్షం వ్యక్తం చేసినవారిలో ఉన్నారు.

**ఆర్మూర్ ఎమ్మెల్యేకు తప్పిన ప్రమాదం**

**ఆర్మూర్, నమస్తే తెలంగాణ:** ఎమ్మెల్సీ అభ్యర్థిగా కవిత నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆమె కాన్వాయ్‌లో వస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కారుకు ప్రమాదం జరిగింది. మెదక్‌జిల్లా తూప్రాన్ వద్ద జీవన్‌రెడ్డి కారును మరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జీవన్‌రెడ్డికి, ఆయన గన్‌మెన్, డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. ఎమ్మెల్యే మరో వాహనంలో నిజామాబాద్ చేరుకొన్నారు.



భర్త అనిల్‌కు పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకొంటున్న కవిత


'మీరు ఎక్కడున్నారన్నది విషయం కాదు. ఎక్కడ ఉన్నప్పటికీ ఆ పదవికి వన్నె తీసుకొస్తారు. నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నా ప్రియమైన సోదరి కవిత ఎంపిక అయినందుకు హృదయపూర్వక అభినందనలు. సీఎం కేసీఆర్ గారు సముచిత స్థానం కల్పించారు.

- ట్విట్టర్‌లో ఎంపీ సంతోష్




## కవిత రాష్ట్రవ్యాప్తంగా సేవలందించాలి

- ఎమ్మెల్సీగా అభ్యర్థిత్వాన్ని స్వాగతిస్తున్నా
- మీడియాతో కాంగ్రెస్ ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి



**జగిత్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా నామినేషన్ దాఖలుచేయడాన్ని వ్యక్తిగతంగా స్వాగతిస్తున్నానని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం జగిత్యాలలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గతేడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కవితకు ఆశించిన ఫలితం రాలేదని చెప్పారు. ఓటమి రాజకీయ జీవితానికి ముగింపు కాదని, అది మరింత బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా తీర్చిదిద్దుతుందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యురాలైనంత మాత్రాన కవిత ఎమ్మెల్సీ కారాదన్న నిబంధన ఏదీ లేదని చెప్పారు. పార్టీకి ఆమె సేవలు అవసరం ఉన్నందునే అవకాశం కల్పించి ఉండవచ్చునని అభిప్రాయపడ్డారు. వాస్తవంగా రాజ్యసభకే అవకాశం కల్పిస్తారని తాము ఊహించామన్నారు. కవిత ఎమ్మెల్సీగా నిజామాబాద్ జిల్లాకే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా సేవలు విస్తరించాలని ఆకాంక్షించారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి బండశంకర్, నాయకులు కొత్త మోహన్, గాజంగి నందయ్య, జగదీశ్వర్, కండ్లపెల్లి దుర్గయ్య, రఘువీర్, గుండ మధు పాల్గొన్నారు.

## లోకం పోకడ





'వర్క్ ఫ్రం హోమ్' లాగ 'ఎగ్జామ్ ఫ్రం హోం' కావాలట సార్!

**ముహూర్తం**

సూర్యోదయం: 6.20 గంటలకు

సూర్యాస్తమయం: 6.22 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, కృష్ణపక్షం ఏకాదశి శుక్రవారం ఉదయం 6.00 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: ఉత్తరాషాఢ మధ్యాహ్నం 2.50 వరకు, తదుపరి శ్రవణం, అమృతఘడియలు: ఉదయం 7.57 నుంచి 9.41 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.50 నుంచి 3.20 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.09 నుంచి సాయంత్రం 4.45 వరకు, వర్జ్యం: రాత్రి 7.12 నుంచి 8.57 వరకు.

# కరోనా కట్టడికి శాయశక్తులా కృషి

■ ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి: ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్ సూచన




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ వ్యాపించకుండా రాష్ట్ర ప్రభుత్వం శాయశక్తులా కృషిచేస్తున్నదని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారక రామారావు చెప్పారు. ప్రజలు కూడా సహకరించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ట్విట్టర్‌లో సూచించారు. 'ప్రజలు సామాజిక దూరం పాటించాలి. స్వీయ పరిరక్షణ చర్యలు తీసుకోవాలి. ఏవైనా సందేహాలుంటే వైద్యసాయం కోసం 104కు ఫోన్ చేయాలి. అనవసర ప్రయాణాలను దూరం పెట్టాలి. సామాజిక మాధ్యమాల్లో వదంతులు నమ్మవద్దు' అని కేటీఆర్ సూచించారు. మన దేశంలో కరోనా మహమ్మారిని నివారించడంలో కీలక దశకు చేరుకొన్నామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తిచేశారు. ప్రజల ఆరోగ్యం కోసం కృషిచేస్తున్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారామెడిక్స్, ఆరోగ్య సంరక్షణ సిబ్బందిని అభినందించారు.

# జలంపై సౌరఫలకం

■ ప్రాజెక్టులకు ముందుకొచ్చిన ఎన్‌హెచ్‌పీసీ

■ సర్వేచేయాలని సూచించిన ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'తెలంగాణలో అపారమైన జలవనరులున్నాయి. దీనిపై సౌరఫలకాలను ఏర్పాటుచేసి సౌర విద్యుత్‌ను ఒడిసిపట్టుకోవచ్చు. ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నాం' అని నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) సీఎండీ ఏకే సింగ్ చెప్పారు. ఈ నెల 15, 16 తేదీల్లో రాష్ట్రంలో పర్యటించిన ఎన్‌హెచ్‌పీసీ ఉన్నతాధికారుల బృందం తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు, విద్యుత్ ఉన్నతాధికారులతో సమావేశమైంది. రాష్ట్రంలో జలవనరులపై సౌరవిద్యుత్ (ఫ్లోటింగ్ సోలార్ ఎనర్జీ) ఉత్పత్తికి ఉన్న అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించింది. ముందుగా జలవనరులు, అందులో సోలార్ ఎనర్జీ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని ప్రభాకర్‌రావు ఆ బృందానికి సూచించారు. అధ్యయన నివేదికలు అందిస్తే వాటిని ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. కేంద్రం తాజాగా ఫ్లోటింగ్ సోలార్ ఎనర్జీ ఉత్పత్తికి ఆయా రాష్ట్రాల్లో ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఎన్‌హెచ్‌పీసీని ఆదేశించింది. తెలంగాణలో అందుకు పుష్కలంగా అవకాశం ఉన్నట్టు కేంద్రం సమాచారమిచ్చినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఏకే సింగ్ నేతృత్వంలో డైరెక్టర్ (టెక్నికల్) జనార్దన్‌చౌదరి ఉన్నతాధికారుల బృందం రాష్ట్రంలో పర్యటించింది.



### విద్యుత్‌రంగంలో తెలంగాణ ప్రగతి భేష్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొద్దికాలంలోనే విద్యుత్ రంగంలో అత్యుత్తమ ప్రగతి సాధించిందని ఎన్‌హెచ్‌పీసీ సీఎండీ ఏకే సింగ్ ప్రశంసించారు. రాష్ట్రాన్ని చీకట్ల నుంచి వెలుగులోకి తీసుకురావడంలో ట్రాన్స్‌కో తదితర విద్యుత్ సంస్థల ఇంజినీర్ల కృషిని అభినందించారు. రెండ్రోజుల పర్యటనలో ఎన్‌హెచ్‌పీసీ బృందం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రాతోనూ సమావేశమైంది. టీఎస్ రెడ్కో వీసీఎండీ ఎన్ జానయ్య, జీఎం ప్రసాద్, పీడీ రామకృష్ణ తదితరుల బృందంతో పునరుత్పాదక ఇంధన వనరులకు సంబంధించిన ప్రాజెక్టులపై చర్చించారు.





పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో శానిటైజర్‌తో చేతులు శుభ్రం చేసుకుంటున్న ఫిర్యాదుదారులు

# నగరం చుట్టూ క్వారంటైన్

■ 5 వేల మందికి సరిపడా కేంద్రాలు

■ 2,300 పడకలతో 28 ఐసొలేషన్ కేంద్రాలు

■ ఐదుచోట్ల కరోనా నిర్ధారణ ల్యాబ్‌లు

■ విదేశాల నుంచి వచ్చిన 750 మందిపై నజర్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నది. హైదరాబాద్ నలుమూలల క్వారంటైన్ కేంద్రాలను ఏర్పాటుచేసింది. గచ్చిబౌలి స్టేడియం, మేడ్చల్ జిల్లాలోని దూలపల్లి, వికారాబాద్ జిల్లాలోని టూరిజం ప్లాజాతోపాటు నగరం చుట్టూ ఐదువేల మందికి సరిపడా క్వారంటైన్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్టు వైద్యారోగ్యశాఖ తెలిపింది. అనుమానితులకు చికిత్స అందించేందుకు ఉస్మానియా, గాంధీ, నల్లకుంటలోని ఫీవర్, ఎర్రగడ్డ ఛాతి, కింగ్‌కోఠి దవాఖానలతోపాటు మరో 28 ప్రైవేటు దవాఖానల్లో సైతం 2,300 పడకలతో ఐసొలేషన్ వార్డులను ఏర్పాటుచేశారు. కొవిడ్-19 నిర్ధారణ పరీక్షల కోసం గ్రేటర్‌లో ఐదు చోట్ల ల్యాబ్‌లు ఏర్పాటుచేశారు. చైనా, ఇటలీ, ఇరాన్, మలేషియా, అమెరికా తదితర 14 కరోనా ప్రభావిత దేశాలనుంచి నగరానికి వచ్చినవారిపై జీహెచ్‌ఎంసీ అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. మంగళవారానికి ఈ తరహా వ్యక్తులు 750 మందిని గుర్తించిన అధికారులు వారి ఇండ్లపై ప్రత్యేక నిఘాను ఏర్పాటుచేశారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్‌లో కొత్త స్ట్రాలు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో బ్రీత్ ఎనలైజర్‌కు ప్రతి వాహనదారుడికి కొత్త స్ట్రా బిగించే తనిఖీ చేస్తామని పోలీసుశాఖ ప్రకటించింది. ఈ చర్య వల్ల కరోనా సోకుతుందనే భయం లేదని ట్రాఫిక్ డీసీపీ దివ్యచరణ్‌రావు అన్నారు.

### ఆలస్యమైతే ఇబ్బంది అయ్యేది

నేను ఢిల్లీలో ఫ్లైట్ దిగగా థర్మల్ స్క్రీనింగ్ చేశారు. కరోనా వైరస్ తీవ్రంగా ఉన్న 14 దేశాల నుంచి ఎవరొచ్చినా క్వారంటైన్ చేస్తున్నారు. నేను ఢిల్లీలోనే వారంరోజులున్నా. ఆ తర్వాత హైదరాబాద్‌కు వచ్చా. అంతకుముందున్న దగ్గు కొంచెం ఎక్కువైంది. దాంతో నేనే స్వచ్ఛందంగా గాంధీదవాఖానకు వెళ్లి జాయిన్ అయ్యా. బ్లడ్ శాంపిల్, ముక్కులో నుంచి నమూనాను సేకరించారు. 24 గంటల్లోనే రిపోర్టు నెగెటివ్‌గా వచ్చింది. వెంటనే నన్ను డిశ్చార్జ్ చేశారు. కాల్‌సెంటర్ కూడా బాగా పనిచేస్తున్నది. వైరస్ మూడో దశకు చేరకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నది. ప్రభుత్వ చర్యల్లో ఏ మాత్రం ఆలస్యమైనా ఇబ్బంది అయ్యేది.

– ఓ వైద్యుడి స్వీయ అనుభవం

# ఎండాకాలంలోనూ ఎత్తిపోత

■ లక్ష్మీబరాజ్‌కు నేటికీ 2వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

■ ఏప్రిల్ చివరిదాకా ప్రవాహం

■ ఎస్సారార్‌కు మొదలైన కాళేశ్వరం జలాల ఇన్‌ఫ్లో

■ ఎల్‌ఎండీలో వచ్చే ఆగస్టు అవసరాలదాకా నిల్వ

■ వానకాలానికి ముందే తుపాకులగూడెం సాంకేతికసర్వే



కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్స్‌నుంచి బయటకు వస్తున్న నీళ్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మండువేసవిలోనూ ప్రాణహిత నుంచి ఇన్‌ఫ్లోలు కొనసాగుతుండగా.. వచ్చిన నీటిని వచ్చినట్టే లక్ష్మీబరాజ్ ఒడిసిపడుతున్నది. అవసరాలకు అనుగుణంగా అధికారులు దూరదృష్టితో ఎత్తిపోతలు నిర్వహిస్తున్నారు. ఎస్సారార్‌లో నీటి నిల్వలను అలాగే ఉంచుతూ ఎల్‌ఎండీ పరిధిలో వచ్చే ఆగస్టు దాకా అవసరాలకు నిల్వలను సిద్ధం చేస్తున్నారు. మరోవైపు లక్ష్మీబరాజ్ గేట్ల ద్వారా దిగువకు పంపేనీటితో వానకాలానికి ముందే సమ్మక్కబరాజ్ సాంకేతిక సర్వే నిర్వహణకు యోచిస్తున్నారు. ఎండాకాలం ప్రారంభమై 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నా కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో ప్రధానమైన లక్ష్మీబరాజ్‌కు ప్రాణహిత నుంచి ఇన్‌ఫ్లోలు కొనసాగుతూనే ఉన్నాయి. మొన్నటిదాకా 1500 క్యూసెక్కుల వరకు రాగా.. నాలుగైదు రోజుల క్రితం కురిసిన వర్షంతో 2 వేల క్యూసెక్కులు వస్తున్నదని అధికారులు చెప్తున్నారు. ఏప్రిల్ చివరిదాకా 1500 క్యూసెక్కుల వరకు వరద వస్తుందని పేర్కొంటున్నారు. ఈ కాస్త వరదను కూడా ఒడిసిపట్టి తాగు, సాగునీటి అవసరాలకు వినియోగించుకునేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ప్రస్తుతం లక్ష్మీబరాజ్‌లో 3.460 టీఎంసీల నీటినిల్వ ఉన్నది. బరాజ్‌కు వస్తున్న స్వల్ప వరదను అంతమేరలో ఎత్తిపోసేందుకు లక్ష్మీ పంపుహౌజ్‌లో ఒక మోటరును నడుపుతున్నారు. అక్కడినుంచి ఎల్లంపల్లిదాకా జలాల ఎత్తిపోత కొనసాగుతున్నది. మరోవైపు ఎల్‌ఎండీ ద్వారా కాకతీయకాల్వలో నిరవధికంగా నీటి సరఫరా కొనసాగిస్తున్నారు. దీంతో లోయర్ మానేరులో నిల్వలు తగ్గుతున్నాయి. ప్రస్తుతం 7.873 టీఎంసీ నీటినిల్వ ఉన్నది. దీంతోపాటు వచ్చే ఆగస్టు వరకు మిషన్ భగీరథ అవసరాలకు కూడా డ్యాంలో నీటినిల్వలు ఉంచాల్సిన అవసరం ఉండటంతో ప్రాణహితలో వచ్చే స్వల్పవరదను మళ్లించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు.

### లింక్-2లో ఎత్తిపోతలు ప్రారంభం

**ధర్మారం/ రామడుగు/ బోయినపల్లి/ తిమ్మాపూర్, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకం లింక్-2లో బుధవారం నుంచి నీటి ఎత్తిపోతలను తిరిగి ప్రారంభించారు. ఆరోప్యాకేజీలో నందిపంప్‌హౌజ్‌లో 2,3 నంబర్ల మోటర్లు ఆన్‌చేసి 6,300 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్యాకేజీ-8లో భాగంగా లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంపుహౌజ్‌లో 2, 4వ బాహుబలి మోటర్లను అధికారులు ఆన్‌చేశారు. ఎస్సారార్ నుంచి 14,15,16 నంబర్ల గేట్లతోపాటు రివర్స్ స్లూయిస్ ద్వారా ఆరువేల క్యూసెక్కుల నీటిని కిందకు వదులుతున్నారు. ఇక్కడకు ఆరువేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా వస్తుండగా అంతే మొత్తంలో దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం ఎస్సారార్‌లో 24.68 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. ఎల్‌ఎండీకి 6 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 5300 క్యూసెక్కులు బయటకు పోతున్నది. ఎల్‌ఎండీలో 7.873 టీఎంసీల నిల్వ కొనసాగుతున్నది.

### తొలి దఫాలో 11 టీఎంసీలు

రానున్న ఆగస్టు వరకు తాగునీటి అవసరాలతో పాటు యాసంగి అవసరాల కోసం ఎల్‌ఎండీ అధికారులు గతంలోనే 21 టీఎంసీల కాళేశ్వరజలాలు కావాలని కోరారు. మొదటి దఫాలో 11 టీఎంసీల వరకు నీటిని వదిలారు. దీంతో ఇప్పటిదాకా అవసరాలు తీరడంతో పాటు ఎల్‌ఎండీలో 8 టీఎంసీల వరకు నిల్వలు ఉన్నాయి. అయితే ఇకముందు కాకతీయకాల్వకు నీటిని వదలడంతోపాటు మిషన్ భగీరథకు నిల్వలు సిద్ధంగా ఉంచాల్సి ఉన్నందున మిగిలిన 10 టీఎంసీలు కావాలని అధికారులు మరోసారి కోరారు. దీంతో కాళేశ్వరంలో భాగంగా నంది, గాయత్రీ పంపుహౌజ్‌ల్లో రెండుమోటర్ల చొప్పున నడుపుతూ నీటిని శ్రీరాజరాజేశ్వర జలాశయానికి తరలిస్తున్నారు. ఈ ప్రక్రియ బుధవారం మొదలైంది. రెండుమోటర్ల ద్వారా వస్తున్న 6,300 క్యూసెక్కుల నీటిని వచ్చింది వచ్చినట్టుగా ఎల్‌ఎండీకి వదులుతున్నారు. ఇప్పటికీ కాకతీయకాల్వలో ఐదువేల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతుందని సంబంధిత అధికారులు తెలిపారు.

### చివరి ప్రవాహందాకా సద్వినియోగం

ప్రాణహితకు వరద కొనసాగే ఏప్రిల్ చివరి వరకు నీటిని సద్వినియోగం చేసుకోవాలని సీఎం కేసీఆర్ గతంలోనే అధికారులకు దిశానిర్దేశం చేశారు. అప్పటివరకు దిగువనఉన్న సమ్మక్క (తుపాకులగూడెం) బరాజ్‌లో నీటి నిల్వకు గేట్ల బిగింపును పూర్తిచేయాలని ఆదేశించారు. లక్ష్మీబరాజ్‌లో ఎత్తిపోసేందుకు వీలుకాని నీటిని గేట్లద్వారా దిగువకు వదిలి.. సమ్మక్కబరాజ్‌లో నిల్వ చేయాలని ప్రణాళిక రూపొందించారు. దీంతో ఎగువన లక్ష్మీబరాజ్‌లో సాంకేతికంగా పరిశీలన ప్రక్రియ జరుపుతూనే.. సమ్మక్క బరాజ్‌లో కొంతమేర నీటిని నిల్వచేయడం ద్వారా అక్కడ ఏవైనా చిన్నచిన్న లోపాలు ఉన్నాయా? అనేది గుర్తించే అవకాశం ఉంటుంది. వానకాలంలో వరదలు వచ్చేవరకు ఆగకుండా మే నెలలోనే సాంకేతిక సర్వే ప్రక్రియ పూర్తిచేయవచ్చు అనేది ప్రభుత్వం యోచిస్తున్నది.

## ధర్మసాగర్‌లో 39.6 డిగ్రీలు

■ క్రమంగా పెరుగుతున్న ఎండలు

■ మూడ్రోజులు ఓ మోస్తరు వానలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతున్నది. బుధవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని ధర్మసాగర్‌లో అత్యధికంగా 39.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఆ తర్వాత మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో 39 డిగ్రీలకు పైగా రికార్డయింది. నాగర్‌కర్నూలు జిల్లా కిష్టంపల్లె, వికారాబాద్ జిల్లా చౌడాపూర్, ఖమ్మం అర్బన్, నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, రెడ్డిపల్లె, భద్రాచలంలోని పలు ప్రాంతాల్లో 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయినట్టు టీఎస్‌పీడీఎస్ అధికారులు తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో ఉపరితల ద్రోణులు, ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో కొన్ని రోజులుగా తేలికపాటి వానలు కురుస్తున్నాయని తెలిపారు. తెలంగాణలో వచ్చే మూడురోజులు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడుతాయన్నారు.

## దివ్యాంగుల ఉపకరణాల కొనుగోలుకు కమిటీ

■ రూ.10.44 కోట్లతో 15 రకాల పరికరాల కొనుగోలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దివ్యాంగుల ఉపకరణాల కొనుగోలు కోసం రాష్ట్ర ప్రభుత్వం 11 మంది అధికారులతో కమిటీని నియమించింది. ఈ కమిటీకి దివ్యాంగుల సంక్షేమశాఖ జేఎండీ చైర్మన్‌గా, వికలాంగుల కార్పొరేషన్ జీఎం మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, ఫైనాన్స్ సెక్రటరీ, పరిశ్రమలశాఖ డైరెక్టర్, ఎన్ఐవీహెచ్, ఎన్ఐఎంహెచ్, ఎన్ఐహెచ్‌హెచ్, ఎన్ఐవోహెచ్ ప్రతినిధులు, ఐటీఐ మల్లేపల్లి ట్రైనింగ్ ఆఫీసర్, ప్రిన్సిపాల్ సభ్యులుగా వ్యవహరిస్తారు. ఈ మేరకు మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమశాఖ కమిషనర్ దివ్య బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. రూ.10.44 కోట్లతో దివ్యాంగుల కోసం 15 రకాల ఉపకరణాలను కొనుగోలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## దర్యాప్తులో జోక్యం వద్దు!

■ డ్రోన్ కెమెరా కేసులో ఎంపీ రేవంత్‌రెడ్డికి హైకోర్టు బెయిల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దర్యాప్తు అధికారులకు సహకరించాలని, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా దర్యాప్తులో జోక్యం చేసుకోరాదని ఎంపీ రేవంత్‌రెడ్డిని హైకోర్టు బుధవారం ఆదేశించింది. డ్రోన్ కెమెరాను అక్రమంగా వినియోగించిన కేసులో రేవంత్‌రెడ్డి ఏ1 నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే. ఆయన పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనాల్సి ఉన్నందున బెయిల్ మంజూరుచేస్తున్నట్టు హైకోర్టు తెలిపింది. రూ.10 వేల వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని, రాజేంద్రనగర్ కోర్టు నిర్ణయించిన మొత్తానికి మరో ఇద్దరి పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది.

# పల్లె ప్రదాతలు

■ ఊరి రుణం తీర్చుకోవాలని పిలుపు

■ విరాళాల సేకరణకు ఐక్య ఉద్యమం

■ నెలలో ఒకరోజు దాతలతో భేటీ

■ 'పల్లె ప్రగతి' విరాళాలు 25 కోట్లు



గ్రామాభివృద్ధికి మంత్రి ఎర్రబెల్లికి రూ. లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో అందిస్తున్న వరంగల్ రూరల్ జిల్లా సంగెం మండలం కాపులకనపర్తి గ్రామవాసి అన్నమనేని దేవేందర్‌రావు (ఫైల్)

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పుట్టినగడ్డ రుణం తీర్చుకొనే సమయం ఆసన్నమైంది. ఊరి ప్రగతికి చేయూతనిచ్చి కలలను సాకారం చేసుకొనే అవకాశం దక్కింది. పల్లె ప్రగతితో మొదలైన విరాళాల సేకరణ కార్యక్రమం ఉద్యమంగా మారి అప్రతిహతంగా కొనసాగుతున్నది. 'మీ సొంతూళ్లను అభివృద్ధి చేసుకోండి' అంటూ సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపు ఎంతో మందిని ప్రపంచానికి పరిచయం చేస్తున్నది. 'సంపాదించిన మొత్తంలో కొంతైనా దానం చేయకపోతే లావైపోతాం' అని ఆలోచించేలా చేస్తున్నది. ప్రస్తుతం ప్రణాళికాసైన్యం సైతం ఐక్యంగా నెలలో కనీసం ఒకరోజు దాతలను కలిసేందుకు సిద్ధమవుతున్నది. స్ఫూర్తి ప్రదాతలను చూపుతూ విరాళాలు సేకరించనున్నది. ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్నవారు పుట్టిన ఊరికి ఎంతో కొంత సాయపడాలని సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపు భారీ మార్పునకు శ్రీకారం చుట్టింది. పల్లె ప్రగతికి ముందే ఉన్నతాధికారులు, కొందరు సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులతో సమావేశమైన సీఎం కేసీఆర్.. పల్లెల అభివృద్ధి కోసం దాతల నుంచి విరాళాలు సేకరించాలని సూచించారు. దేశ, విదేశాల్లో ఆర్థికంగా మంచిస్థితిలో ఉన్నవారిలో పుట్టిన ఊరి బాగుకు ఏదో ఒకటి చేయాలనే స్ఫూర్తిని నింపేందుకు స్వచ్ఛంద సంస్థలు, వార్డు సభ్యులు, సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ప్రణాళికా సైన్యం రంగంలోకి దిగుతున్నది.

### దాతృత్వంతో స్ఫూర్తి

దాతృత్వంలో వరంగల్ అర్బన్ జిల్లా వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటకు చెందిన కే నర్సింహారెడ్డి ముందున్నారు. పుట్టిన ఊరు అభివృద్ధికి ఆయన రూ.25 కోట్ల విరాళాన్ని ఇవ్వడం స్ఫూర్తినింపింది. అదే జిల్లాలోని భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్‌కు చెందిన భాస్కర్‌రావు రూ.2 కోట్ల విరాళం ఇచ్చి దాతృత్వాన్ని చాటుకున్నారు. ప్రభుత్వం నిర్వహించిన పల్లెప్రగతిలో భాగంగా చాలా మంది తమ ఊరి అభివృద్ధి కోసం విరాళాలు ఇచ్చారు. రూ.5 వేలు మొదలు రూ.2 కోట్ల వరకు విరాళాలు ప్రకటించారు. పల్లె ప్రగతి ప్రణాళిక తొలివిడుతలో 11,032 మంది దాతలు రూ.25 కోట్లను విరాళంగా ఇచ్చారు. 12.6 ఎకరాల భూమిని దానంచేశారు. స్థానికంగా ఉండేవారు ఎక్కువగా భూదానం చేసేందుకు ముందుకొచ్చారు. డంపింగ్ యార్డులు, శ్మశానవాటికల కోసం భూమిని విరాళంగా ఇచ్చారు. కొన్నిచోట్ల విలువైన భూములు కూడా పంచాయతీలకు రాసిచ్చారు. 14 పంచాయతీల పరిధిలో పరిశుభ్రత కోసం 14 ట్రాక్టర్లను విరాళంగా అందజేశారు. మరో 10 ట్రాలీలు, 6,300 డస్ట్‌బిన్‌లు, హరితహారం మొక్కల సంరక్షణకు లక్ష ట్రీ గార్డులు కూడా విరాళంగా పంచాయతీలకు వచ్చాయి.

### దానం చేయండి.. పేర్లు పెట్టుకోండి

గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇచ్చే నిధులకు తోడుగా గ్రామస్థుల నుంచి, వ్యాపారులు, ఆర్థికంగా ఎదిగిన వారి నుంచి విరాళాలు సేకరించేందుకు గ్రామాల్లో సర్పంచ్‌లు ప్రణాళికలు సిద్ధంచేసుకున్నారు. ఇటీవల భారీగా విరాళాలు ఇచ్చిన నర్సింహారెడ్డి, భాస్కర్‌రావుతోపాటు పెద్ద హోదాల్లో ఉన్నవారిని స్ఫూర్తిగా చూపిస్తూ విరాళాలను సేకరించాలని భావిస్తున్నారు. గ్రామం నుంచి ప్రజాప్రతినిధులు, స్వచ్ఛందసంస్థలు, ప్రణాళికా సైన్యం.. స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలను కలుపుకొని అభివృద్ధి ప్రదాతల నుంచి విరాళాలు కోరనున్నారు. భారీగా విరాళాలు వచ్చే అవకాశాలు ఉంటే మంత్రులను సైతం తోడుగా రావాలని కోరుతున్నారు. గ్రామాభివృద్ధిని కాంక్షించే వారంతా కలిసి దాతల దగ్గరకు వెళ్లనున్నారు. ఈ ప్రక్రియతో గ్రామానికి నిధులొస్తాయని భావిస్తున్నారు. వారిచ్చే సహకారంతో చేసే పనులకు దాతలు చెప్పిన పేర్లను పెట్టనున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలకు దాతల పేర్లు పెట్టారు. కొన్ని రోడ్లను కూడా దాతల పేర్లతో పిలుస్తున్నారు. ఇది మరికొందరిలో స్ఫూర్తి నింపుతున్నది.

## వాణిజ్యశాఖ పదోన్నతుల్లో
# రూల్ ఆఫ్ రిజర్వేషన్

■ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వాణిజ్య పన్నుశాఖ అధికారుల వినతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వాణిజ్య పన్నులశాఖ పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని రాష్ట్ర అసిస్టెంట్ కమిషనర్లు ఎం ధనంజయ్ నాయక్, పీ బీమ్లా.. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేశారు. తమకు డీసీటీవోలుగా పదోన్నతులివ్వడంలో అన్యాయం జరుగుతున్నదని బుధవారం కమిషన్ కార్యాలయంలో ఆయనను కలిసి వారు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్.. విచారణ జరిపి, పదోన్నతుల్లో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## హైబ్రీడ్ రకాలతో అధిక దిగుబడి

■ రాష్ట్రంలో పెరుగని హైబ్రీడ్ వరిసాగు విస్తీర్ణం

■ హైబ్రీడ్ సన్నరకాలపై భారతీయ వరి పరిశోధన సంస్థ పరీక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వ్యవసాయంలో పంటల దిగుబడులు పెంచడానికి దేశవ్యాప్తంగా హైబ్రీడ్ వంగడాల వినియోగాన్ని ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. ఏటికేడు పప్పుధాన్యాలు, మక్కజొన్న, నూనెగింజల పంటల్లో హైబ్రీడ్ రకాలసాగు అధికమవుతున్నది. కానీ, వరిలో ఆశించినస్థాయిలో పెరుగడం లేదు. ప్రస్తుతం దేశంలో 4.30 కోట్ల ఎకరాల్లో, తెలంగాణలో 58 లక్షల ఎకరాల్లో వరి సాగవుతున్నది. అందులో దేశవ్యాప్తంగా హైబ్రీడ్ రకాలు 30 లక్షల ఎకరాల్లో, తెలంగాణలో 1.74 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగవుతున్నాయి. దేశంలో ప్రధానంగా సన్న బియ్యానికి డిమాండ్, ధర ఎక్కువ. సన్నరకాల పంటకాలం 150-155 రోజులు ఉండటంతో వానకాలంలోనే ఎక్కువగా సాగు చేస్తున్నారు. యాసంగిలో చలి ముదిరినప్పుడు సన్న రకాల గింజలు తాలుపోతాయి. అందువల్ల యాసంగిలో చలిని తట్టుకొనే స్వల్పపంటకాల వంగడాలైన ముతక, దొడ్డు రకాలను రైతులు ఎక్కువగా సాగుచేస్తున్నారు. ప్రతి సంవత్సరం హైబ్రీడ్ సాగులో కొంత మెరుగు కనిపిస్తున్నా మూడేండ్లలో సగటు పెరుగుదల 10 శాతం మాత్రమే. హైబ్రీడ్‌లో దొడ్డువరి రకాలు అధికం. సన్నరకాలతో పోలిస్తే హైబ్రీడ్ దొడ్డు వరిరకాలు అధిక దిగుబడి ఇస్తున్నాయి. కానీ, వినియోగదారుల నుంచి డిమాండ్ పెరుగాలంటే హైబ్రీడ్‌లో మరిన్ని సన్నరకాలు రూపొందించాల్సి ఉన్నది. ఈ దిశగా రాజేంద్రనగర్‌లోని భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్) పదేండ్లుగా పరిశోధనలు సాగిస్తున్నది. రాష్ట్రంలో జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కూడా నూతనంగా అభివృద్ధిచేసిన రకాలను వివిధ ప్రాంతాల్లో పరీక్షిస్తున్నది. ఇవి విజయవంతమైతే వరి దిగుబడులు గణనీయంగా పెరుగనున్నాయి. దొడ్డు రకాలను మిల్లర్లు ఖచ్చితంగా కొనేలా చర్యలు తీసుకోవడంతోపాటు, సన్నబియ్యంతో సమానంగా ధర చెల్లించినప్పుడు హైబ్రీడ్ సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నాయని రైతు సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

# డ్రెస్‌కోడ్ దొంగ

**తాళంవేసిన ఇండ్లపై అనాసక్తి.. కుటుంబసభ్యులున్న ఇంట్లోనే చోరీ**

**కండ్లు మాత్రమే కనిపించేలా వస్త్రధారణ.. మరణ ధ్రువీకరణపత్రంతో పోలీసులకు బురిడీ**

**22 ఏండ్లుగా దొంగతనాలు.. ఘరానా దొంగను అరెస్ట్‌చేసిన పోలీసులు**



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఈ దొంగ చాలా విచిత్రమైనోడు. తాళం వేసిన ఇంట్లో చోరీచేయడు. కుటుంబసభ్యులు ఉన్న ఆ ఇంటినే దొంగతనానికి ఎంచుకొంటాడు. నలుపురంగు దుస్తులు ధరించి చోరీలు చేయడం ఇతడి అలవాటు. ఇలా 22 ఏండ్లుగా చోరీలుచేస్తూ కోట్ల రూపాయలు దోచుకొన్నాడు. పోలీసుల దృష్టి మరల్చేందుకు మరణ ధ్రువీకరణ పత్రాలను సృష్టించి మరీ తొమ్మిదేండ్లపాటు దొంగతనాలు చేశాడు. దొంగతనం చేసిన డబ్బుతో జల్సాలకుచేస్తూ నాలుగు రాష్ర్టాల పోలీసులకు మోస్ట్‌వాంటెడ్‌గా నిలిచాడు. తెలంగాణ పోలీసులు మాత్రం ఈ ఘరానాదొంగను వెంటాడి పట్టుకున్నారు. ప్రస్తుతం చర్లపల్లి జైలులో ఉన్నాడు. ఇతడే మహారాష్ట్రకు చెందిన సంతోష్‌షిండే. 1998 నుంచి చోరీలు చేస్తున్నాడు. ఆ సమయంలో నలుపురంగు డ్రెస్ ధరించి కండ్లు మాత్రమే కనిపించేలా ముఖానికి నలుపు వస్త్రాన్ని నిండుగా చుట్టుకొంటాడు. చోరీకి వెళ్లే ముందు తానొక్కడే కాకుండా ముఠాలోని సభ్యులందరికీ ఈ డ్రెస్‌కోడ్ తప్పనిసరి చేస్తాడు. రాత్రి పూటచోరీలకు నలుపురంగు డ్రెస్‌కోడ్‌తో వెళితే సీసీ కెమెరాల్లో రికార్డింగ్‌లో క్లారిటీ ఉండదని, బయటివ్యక్తులు ఈజీగా గుర్తుపట్టరని ఇతడి నమ్మకం. ఇతడి నుంచి సొత్తు రికవరీ పోలీసులకు సవాల్‌గా మారింది. ఇక్కడంటే.. అక్కడనీ.. అక్కడ కాదు మరెక్కడో గుర్తుకు రావడం లేదని పోలీసులకు చుక్కలు చూపిస్తాడు. ఇటీవల మహారాష్ట్ర నాందేడ్‌లో చోరీ సొత్తు అమ్మానని చెప్పడంతో.. తెలంగాణ పోలీసులు రికవరీ కోసం వెళ్లగా రిసీవర్ భవనం పైనుంచి దూకి మృతిచెందాడు. ఈ సంఘటనలో తెలంగాణ సైబరాబాద్ పోలీసులపై మహారాష్ట్రలో కస్టోడియల్ డెత్ కేసు నమోదయింది.

### ఇంట్లో ఉంటేనే చొరబడుతా

తాళంవేసిన ఇండ్లను సంతోష్‌షిండే టార్గెట్ చేయడు. తాళం వేసిన ఇండ్లలో ఖరీదైన వస్తువులు, నగలు ఉండవని ఇతడి నమ్మకం. అందరూ ఉన్న ఇండ్లలోనే చోరీలు చేయడం మహా సరదా. ఈ ఇండ్లలోనే ఎక్కువ ఖరీదైన వస్తువులు ఉంటాయని, అప్పుడే గిట్టుబాటు అవుతుందని భావిస్తుంటాడు. టార్గెట్ చేసుకొన్న ఇంటి పరిసరాలకు చేరుకొని ఇతడి ముఠా సభ్యులు చెట్ల పొదల్లో దాక్కుంటారు. అర్ధరాత్రి నుంచి నాలుగు గంటల మధ్య చోరీలు చేసి దగ్గర్లోని రైల్వేస్టేషన్‌కు పారిపోయి అక్కడి నుంచి మహారాష్ట్రకు వెళ్లిపోతారు. ఇందుకు రైల్వేస్టేషన్‌కు సమీప ఇండ్లనే చోరీకి ఎంచుకొంటారు. కిటికి గ్రిల్స్‌గానీ, బాల్కనీ గ్రిల్స్‌గానీ తొలగించి ఇంట్లోకి ప్రవేశిస్తారు. సంతోష్ వెనుకాలే వెళ్లే మరో వ్యక్తి.. పారిపోయేందుకు వీలుగా ఇంటి తలుపులు అన్నింటినీ తెరిచి పెడుతాడు. నేరుగా బెడ్‌రూంలోని కప్‌బోర్డులు, అల్మారాల వద్దకు వెళ్లి అందినకాడికి నగదు, నగలు దోచుకొని చెక్కేస్తారు. ఒకవేళ ఎవరైనా కుటుంబసభ్యులు నిద్ర లేచి అరిచేందుకు ప్రయత్నిస్తే కర్రలు, రాడ్లతో కొట్టేందుకు కూడా వెనుకాడరు. ఇలా దాదాపు 24 దొంగతనాలు చేసినట్టు పోలీసుల విచారణలో తేలింది.

### పట్టించిన వేలిముద్రలు

సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని అల్వాల్‌లో 2015లో జరిగిన ఒక చోరీ కేసులో వేలుముద్రల పరిశీలనలో కొన్ని అనుమానాలు తలెత్తాయి. అవి 1998 నాటి మాదాపూర్ దోపిడీ కేసులో దొరికిన నిందితుడి వేలిముద్రలతో సరిపోయాయి. సంతోష్‌షిండే 2005లోనే చనిపోయాడని అతడి కుటుంబసభ్యులు ధ్రువపత్రాలు చూపి మాదాపూర్ పోలీసులను బోల్తాకొట్టించారు. సంతోష్‌షిండేను పట్టుకొని తీరాలన్న కసితో సైబరాబాద్ పోలీసులు శ్రమించి చివరకు గత నెలలో అదుపులోకి తీసుకొన్నారు.


APPOINTMENTS

WALK-IN-INTERVIEWS @ GRANULES INDIA LTD.

A Leading Pharmaceutical Company in India looking for below qualified professionals immediately having experience in Oral Solid Dosages.

- **Production (Technicians / Executives):** ITI / B.Sc ./ D.Pharmacy / Diploma / B.Pharmacy with 1-5years of experience in operating PLC based Compression, Coating, Capsule filling, Pharma pack, Blister Packing Machines (BQS), Cartonators (Hi-cart), FBD, FBP, RMG, Sifter, wurster coating etc.
- **Quality Control (Chemist / Executive / Sr.Executive):** M.Sc / B.Pharmacy / B.Sc., with 2-5years of experience in GLP, Stability, IP, FP, RM ,PM, Micro, AMV, Ion chromatography ,Method Transfers.
- **IPQA (Executive):** B.Pharmacy / M.Sc with 1-5 years of experience in Solid Dosages.
- **Engineering (Technicians):** Diploma/ITI with 1-5 years of experience in Electrical, calibration, HVAC, Mechanical.
- **Operational Excellence (Executive / Sr.Executive):** M.Pharmacy / B.Pharmacy / B.Tech / M.Tech with 1-5 years of experience.
- **SDT:** Intermediate (MPC/BiPC) with 60% of marks in each qualification.

**Age:18-20 years**

● Date: 21-03-2020 & 22-03-2020 ● Timings: 10:00 AM to 2.00 PM

**Granules India Limited**

Sy No.160/A,161/E,162 &174/A, Gagillapur Village, Dundigal-Gandimaisamma Mandal, Medchal-Malkajgiri District.

Contact: 08418 306400 / 08418 306401

Email: mahesh.m@granulesindia.com / Shilpa.Nookaraju@granulesindia.com

Route-1: Secunderabad-Balanagar-Jeedimetla-Gandimaisamma-Gagillapur.

Route-2: Miyapur-Bachupally-Gandimaisamma-Gagillapur

Note: Candidates willing to operate in shifts can attend / apply.

## ఆర్టీసీ బస్సుల్లో శానిటైజర్లు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ వ్యాప్తి నివారణలో భాగంగా ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో శానిటైజర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రతి ప్రయాణికుడికి కండక్టర్ టికెట్‌తో పాటు శానిటైజర్ ఇవ్వనున్నా రు. మంత్రి పువ్వాడ అజయ్ ఖమ్మంతోపాటు పలుచోట్ల ఆర్టీసీ బస్సుల్లో శానిటైజర్లను పంపిణీచేశారు. ఆర్టీఏ కార్యాలయాల్లో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. అత్యవసర సేవలతోపాటు ఈ నెలాఖరులోపు గడువు ముగిసే లెర్నర్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్, రిజిస్ట్రేషన్ సేవలు మాత్రం యథావిధిగా కొనసాగించాలని నిర్ణయించారు.

### ఐఐటీ హైదరాబాద్ శానిటైజర్లు

ఐఐటీ హైదరాబాద్ మెటీరియల్ సైన్స్ డిపార్టుమెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ముద్రిక ఖండేల్‌వాల్ నేతృత్వంలో కొత్త శానిటైజర్ తయారుచేశారు. డాక్టర్ శివకల్యాణి ఆధ్వర్యంలో ఈ పరిశోధనలను విజయవంతంచేశారు.

## వర్కింగ్ ఎగ్జిక్యూటివ్ హాస్టళ్లు మూసేయొద్దు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పరిధిలోని వర్కింగ్ ఎగ్జిక్యూటివ్ హాస్టళ్లను మూసివేయాల్సిన అవసరంలేదని 'కోఆర్డినేషన్ కమిటీ ఆన్ కోవిడ్-19' వెల్లడించింది. సైబరాబాద్ సీపీ సజ్జనార్ ఆధ్వర్యంలోని ఈ కమిటీలో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్, హైసియా, నాస్కామ్, జీహెచ్‌ఎంసీ, టీఎస్ ఐఐసీ, ఐటీ, ఆరోగ్య విభాగాల ప్రతినిధులు సభ్యులుగా ఉన్నారు. అధిక శాతం ఐటీ ఉద్యోగులు వర్కింగ్ హాస్టళ్లలో నివసిస్తున్నారు. రాత్రికి రాత్రే ఖాళీ చేయాలని యజమానులు ఒత్తిడి చేయడంతో వీరంతా ఆందోళన చెం దారు. ఈ క్రమంలో కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్‌తో కలిసి డీజీపీతో బుధవారం సమావేశమయ్యారు. అనంతరం, డీజీపీ మహేందర్‌రెడ్డి వర్కింగ్ ఎగ్జిక్యూటివ్ హాస్టళ్లను మూసివేయకూడదని ఆదేశించారు. వైరస్ వ్యాప్తి చెందకుండా యజమానులు తగిన శ్రద్ధ తీసుకొనేలా చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్లకు ఆదేశాలిచ్చారు. బలవంతంగా హాస్టళ్లనుంచి పంపిస్తే 100కు డయల్ చేయాలని లేదా వాట్సప్ చేయాలని సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి కృష్ణ ఏదులా తెలిపారు.

**● ఫంక్షన్ హాల్ మూసివేత**



ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి ఖమ్మం టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో బుధవారం శుభకార్యానికి 500మందికిపైగా హాజరయ్యారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌టీం ఫంక్షన్‌హాల్‌ను సీజ్‌చేసింది.
-రఘునాథపాలెం



# అన్నింటికీ సన్నద్ధం

**కరోనా కట్టడిలో రాజీలేదు ■ జిల్లాల్లోనూ క్వారంటైన్ సెంటర్లు**
**సెలవులిచ్చింది విహారాల కోసం కాదు ■ ఉన్నతాధికారులతో మంత్రి ఈటల సమీక్ష**
**రాష్ట్రంలో తాజాగా ఎనిమిది కేసులు ■ అందరూ విదేశాల నుంచి వచ్చినవారే**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొవిడ్-19 వ్యాప్తిని నియంత్రించేందుకు తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో కృషిచేస్తున్నదని, ఇప్పటివరకు విదేశాల నుంచి వచ్చినవారికి తప్ప.. తెలంగాణ గడ్డమీద ఏ ఒక్కరికీ వైరస్ సోకలేదని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టంచేశారు. కరోనాను ఎదుర్కోవడానికి ప్రభుత్వం అన్నివిధాలా సన్నద్ధంగా ఉన్నదని పేర్కొన్నారు. తాజాగా స్కాట్లాం డ్ నుంచి వచ్చిన ఒక వ్యక్తికి పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని.. ఇతను ఈ నెల 16న స్కాట్లాండ్ నుంచి వచ్చాడని తెలిపారు. కాగా, ఇండోనేషియా నుంచి కరీంనగర్‌కు చేరుకొన్న ఏడుగురు ఇండోనేషియా దేశస్థులకు కొవిడ్-19 పాజిటివ్ నిర్ధారణ అయినట్టు ఆరోగ్యశాఖ బుధవారం రాత్రి బులెటిన్ విడుదలచేసింది. వీరు భారత్‌కు చెందినవారు కాదని.. మత కార్యక్రమం కోసం ఇండోనేషియా నుంచి తెలంగాణకు వచ్చినట్టు స్పష్టంచేసింది. వీరిని ఐసొలేషన్ వార్డులో ఉంచి చికిత్స నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నది. అంతకుముందు కుటుంబ సంక్షేమశాఖ సమావేశమందిరంలో మంత్రి ఈటల మీడియాతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు కరోనాకు సంబంధించి ఎక్కడా రాజీపడకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. వివిధ పాజిటివ్ కేసులు నమోదైన నేపథ్యంలో వారితో సన్నిహితంగా ఉన్నవారిని ట్రాకింగ్‌చేసి నిర్ధారణ పరీక్షలుచేయగా అందరికీ నెగెటివ్ వచ్చిందనిపేర్కొన్నారు. కర్ణాటకలో కరోనా కారణంగా మరణించిన వృద్ధుడి అంత్యక్రియలకు వెళ్లివచ్చిన టోలీచౌకి ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులకు కూడా నెగెటివ్ వచ్చిందన్నారు. భారత్‌లో ఎక్కడా నేరుగా కరోనా రాలేదని ఐసీఎమ్మార్ నివేదికలో విడుదల చేసిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సూచనలమేరకు కరోనా ప్రభావం ఎక్కువగా ఉన్న దేశాల



నుంచి వస్తున్నవారికి తప్పకుండా స్క్రీనింగ్‌చేస్తూ.. వారిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన క్వారంటైన్ సెంటర్లలో పర్యవేక్షణలో ఉంచుతున్నట్లు తెలిపారు. జిల్లాల్లోనూ కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాట్లుచేశామని చెప్పారు. విదేశాల నుంచి 20 వేలమంది వచ్చినా క్వారంటైన్‌లో ఉంచేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. నిమ్స్, ఫీవర్, ఐపీఎం, ఉస్మానియా దవాఖానల్లో వ్యాధి నిర్ధారణ పరీక్ష ల్యాబ్‌ల ఏర్పాటు పూర్తయిందన్నారు.

### విహారం కోసం కాదు

కరోనా వ్యాప్తి నియంత్రణ చర్యల్లో భాగంగానే ప్రభుత్వం విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించిందన్న విషయాన్ని అందరూ గుర్తించాలని, ఈ పేరుతో విహారయాత్రలు పోవడం మంచిదికాదని మంత్రి ఈటల సూచించారు. భద్రాచలంలో శ్రీరామనవమి ఉత్సవాలను రద్దుచేసినట్లు వెల్లడించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల కార్యాలయాలకు అత్యవసర పనిఉంటే తప్ప.. ప్రజలు రావద్దన్నారు. అప్రమత్త చర్యల్లో భాగంగా వైద్య, ఆరోగ్యశాఖలోని వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది సెలవులను రద్దుచేసినట్లు వివరించారు. సమావేశంలో ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ జీ శ్రీనివాసరావు, డీఎంఈ రమేశ్‌రెడ్డి, ఐపీఎం డైరెక్టర్ శంకర్ పాల్గొన్నారు.

### అధికారులతో సమీక్ష

రాష్ట్రంలో నివసించే వ్యక్తులకు కొవిడ్-19 వైరస్ వ్యాప్తి చెందకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు సీఎస్ సోమేశ్‌కుమార్ తెలిపారు. కరోనా వైరస్ వ్యాప్తి నివారణ, చికిత్సపై బుధవారం బీఆర్కే భవన్‌లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్, సీఎస్ కలిసి సమీక్షాసమావేశం నిర్వహించారు. ఇందులో డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### విమానాలు రద్దుచేయండి

విదేశాల నుంచి వచ్చినవారిలోనే వైరస్ ఉన్నదని, ఇక్కడ ఉన్నవారికి సోకకుండా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌కు మంత్రి ఈటల తెలిపారు. బుధవారం కేంద్రమంత్రితో రాష్ట్ర పరిస్థితులు, కొవిడ్-19 నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆయన చర్చించారు. ఇది కొనసాగించాలంటే విదేశీ విమానాలను పూర్తిగా రద్దుచేయాలని కోరారు.

### వైద్యఆరోగ్యశాఖ బులెటిన్ వివరాలు

| వివరాలు | మంగళవారం ఒక్కరోజు | ఇప్పటివరకు మొత్తం |
|---|---|---|
| విమానాశ్రయంలో థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు | 1683 | 70,545 |
| పర్యవేక్షణలో 28రోజులు పూర్తయిన వారు | 03 | 306 |
| ఇండ్లలో, ఇతరచోట్ల క్వారంటైన్‌లో ఉన్నవారు | 1683 | 70,545 |
| వ్యాధినిర్ధారణ పరీక్షలు | 31 | 447 |
| పాజిటివ్‌గా నిర్ధారణ | 8 | 13 |
| కోలుకుని డిశ్చార్జ్ | 0 | 1 |
| నెగెటివ్‌గా నిర్ధారణ | 2 | 412 |
| పాజిటివ్ వ్యక్తుల కాంటాక్ట్ ట్రాకింగ్ | 4 | 331 |

## నలుగురిపై కేసు నమోదు

కరోనా వైరస్‌పై సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారంచేసిన ముగ్గురిపై సంగారెడ్డి జిల్లాలో కేసు నమోదైంది. అందోల్ మండలం తాలెల్మకు చెందిన ఎండీ ఖలీల్, బీ సురేశ్, ఎర్పుల లింగంపై కేసు నమోదు చేసినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. వైరస్‌పై వాట్సప్ గ్రూపులో తప్పుడు సమాచారం పోస్టుచేయడంతో ఆ గ్రూపు అడ్మిన్, 38వ వార్డు కౌన్సిలర్ గూడూరి భాస్కర్‌పై సిరిసిల్ల పోలీసులు కేసు నమోదుచేశారు.

**మంథని మున్సిపల్ కమిషనర్‌పై వేటు**

రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ఉన్నా ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే సెలవుపై వెళ్లిన పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జునస్వామి సస్పెన్షన్‌కు గురయ్యారు.

## సీడ్ ఆఫీసర్స్ రాతపరీక్ష వాయిదా

తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థలో ఒప్పంద ప్రాతిపదికన సీడ్ ఆఫీసర్స్ నియామక రాతపరీక్ష వాయిదా పడింది. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను అనుసరించి ఈ నెల 29న నిర్వహించాల్సిన పరీక్షను వాయిదా వేసినట్టు విత్తనాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కేశవులు తెలిపారు. రాతపరీక్ష నిర్వహణ తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

## ఈశా యోగా నిలిపివేత



ప్రపంచవ్యాప్తంగా ఈశా యోగా సెంటర్లలో జరిగే కార్యక్రమాలను నిలిపివేస్తున్నట్టు ఆ సంస్థ ప్రకటించింది. ఈశా యోగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురుతో సహా అందరూ వెంటనే ప్రయాణాలు నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు.

## బృందాలుగా భోజనాలు వద్దు

పురపాలకశాఖ అధికారులు, సిబ్బంది వ్యక్తి గత శుభ్రత పాటించాలని ఆ శాఖ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. సదస్సులు, సమావేశాల్లో పాల్గొనకూడదని, బృందాలుగా భోజనాలు చేయకూడదని కోరారు.

## చిలుకూరు ఆలయం మూసివేత



రంగారెడ్డి జిల్లా చిలుకూరు బాలాజీ ఆలయాన్ని మూసివేస్తున్నట్టు ఆలయ అర్చకుడు సీఎల్ రంగరాజన్ ప్రకటించారు. ఆలయాన్ని గురువారం నుంచి 25వ తేదీవరకు మూసి వేస్తున్నట్టు చెప్పారు. స్వామివారికి నిత్యం ఆరాదన, అర్చన, పూజా కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

**తిరుమలలో ఆర్జిత సేవలు బంద్**

తిరుమల శ్రీవారి ఆలయంలో పలు సేవలు తాత్కాలికంగా రద్దు చేశారు. ఉత్సవ మూర్తులకు నిర్వహించే అన్నిరకాల ఆర్జిత సేవలను తాత్కాలికంగా నిలిపివేసినట్టు టీటీడీ ప్రకటించింది. కల్యాణోత్సవాన్ని మాత్రం స్వామివారికి ఏకాంతంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఆర్జిన సేవా టికెట్లు ఉన్న భక్తులు తమ తిరుమల ప్రయాణాలను రద్దు చేసుకోవాలని లేదా వాయిదా వేసుకోవాలని, తప్పనిసరిగా వచ్చే భక్తులకు మాత్రం వీఐపీ బ్రేక్‌లో అనుమతిస్తామని టీటీడీ ప్రకటించింది. శ్రీవారి పుష్కరిణిని మూసివేశారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో అర్చనలు బంద్‌చేశారు.

## లోకాయుక్తలో కేసులు వాయిదా

తమ పరిధిలోని కేసులను వాయిదా వేస్తున్నట్టు రాష్ట్ర లోకాయుక్త కార్యాలయం తెలిపింది. లోకాయుక్త, ఉపలోకాయుక్త వద్ద పెండింగ్‌లో ఉన్న కేసుల్లో అధికారులెవరూ ఈ నెల 31వ తేదీవరకు హాజరుకానవసరం లేదని పేర్కొన్నది. లోకాయుక్త రిజిస్ట్రార్ ఫిర్యాదులను స్వీకరిస్తారు. అత్యవసర కేసులను సోమ, శుక్రవారాల్లో విచారణకు స్వీకరిస్తారు.

**హెచ్చార్సీలో అత్యవసర కేసులే..**

మానవహక్కుల కమిషన్‌లో అత్యవసర కేసులను మాత్రమే చేపట్టనున్నట్టు కమిషన్ సెక్రెటరీ పేర్కొన్నారు. మంగళ, గురువారాల్లో ఛాంబర్లలో విచారణ చేపట్టనున్నట్టు తెలిపారు. సాధారణ కేసులను ఏప్రిల్ 9వ తేదీవరకు వాయిదా వేస్తున్నామని చెప్పారు.

## ఎయిమ్స్‌లో ఐసొలేషన్ కేంద్రం

యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లోని ఎయిమ్స్‌లో ఐసోలేషన్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు రోజుల్లో 200 బెడ్లతో ఐసొలేషన్ కేంద్రాన్ని ప్రారంభించేలా పనులను ముమ్మరంచేశారు.

## ఎస్సీ విద్యార్థులకు 35.97 లక్షలు

కొవిడ్-19 వ్యాప్తి నేపథ్యంలో ఎస్సీ విద్యార్థుల సంక్షేమ హాస్టళ్లలో జాగ్రత్త చర్యలకు ఎస్సీ అభివృద్ధిశాఖ ప్రత్యేకంగా నిధులను విడుదల చేసింది. 2019-20 ఆర్థిక సంవత్సరం క్రూషియల్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.35.97 లక్షలు విడుదలచేసినట్టు ఆ శాఖ కమిషనర్ తెలిపారు. నిధుల నుంచి పదో తరగతి, ఇతర పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ప్రత్యేకంగా కిట్లను అందజేస్తామని చెప్పారు.



కరోనాపై అవగాహన కల్పిస్తూ వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరి గ్రామంలో పర్యటిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

## జాగ్రత్తలు పాటించాలి: మంత్రి ఎర్రబెల్లి

**పర్వతగిరి:** రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాప్తి చెందదని, అనవసరంగా భయపడవద్దని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ వైరస్ వ్యాప్తిచెందకుండా అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరిలో సుమారు రూ.4 కోట్లతో నిర్మించిన రోడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఎండ వేడికి కరోనా వైరస్ వ్యాప్తి చెందదని, ప్రజలు భయం వీడి, గుంపులుగా ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇతర దేశాల నుంచి వచ్చినవారిలో మాత్రమే కరోనా లక్షణాలు ఎక్కువగా కనిపించాయని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అరూరి రమేశ్ పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్

## గిరిజనులకు అవగాహన: మంత్రి సత్యవతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గిరిజనులకు కరోనా వైరస్ సోకకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని, అవగాహన కల్పించాలని గిరిజన, మహిళా శిశు సంక్షేమశాఖల మంత్రి సత్యవతి రాథోడ్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు పరీక్షల నేపథ్యంలో కరోనా వైరస్ పట్ల అప్రమత్తతపై బుధవారం సంక్షేమభవన్‌లో గిరిజన సంక్షేమశాఖ, గురుకుల విద్యాలయాల, ఐటీడీఏల ప్రాజెక్టు అధికారులతో సమీక్ష నిర్వహించారు. పరీక్షలకు హాజరయ్యే పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత, స్కోర్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పదో తరగతి మినహా మిగిలిన వారందరికీ సెలవులిచ్చినందున ఎక్కువ గదుల్లో తక్కువ మంది ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గిరిజన విద్యా సంస్థల్లో కరోనావైరస్‌పై పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు.

# కరీంనగర్‌లో హైఅలర్ట్

■ **ఏడుగురు ఇండోనేషియావాసులకు కరోనా**
■ **హైదరాబాద్ గాంధీ దవాఖానలో చికిత్స**
■ **కలెక్టరేట్‌కు 3 కిలోమీటర్లమేర దిగ్బంధం**
■ **ఇంటింటికీ వంద వైద్య బృందాలతో పరీక్షలు**
■ **భయం అవసరం లేదు: మంత్రి గంగుల**

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కరీంనగర్‌లో కరోనా కలకలం సృష్టించింది. ఇండోనేషియా నుంచి జిల్లాకేంద్రానికి వచ్చినవారిలో ఏకంగా ఏడుగురికి కొవిడ్-19 పాజిటివ్ రావడంతో ఆందోళన వ్యక్తమైంది. ఈ పరిణామంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తంచేసింది. ఇండోనేషియా దేశస్థులు కరీంనగర్‌లో ఎక్కడెక్కడ సంచరించారో గుర్తించి ఆయా ప్రాంతాల్లో కట్టడికి చర్యలు చేపట్టింది. కరీంనగర్‌లో పూర్తిగా శానిటైజేషన్ చర్యలను చేపట్టింది. ప్రభుత్వం చర్యలకు, అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని మంత్రి గంగుల కమలాకర్ విజ్ఞప్తిచేశారు.

### అసలేం జరిగింది?

ఈ నెల 14న ఇండోనేషియాకు చెందిన పదిమంది మత ప్రచారకులు కరీంనగర్‌కు వచ్చారు. రైలులో ఢిల్లీ నుంచి రామగుండం వచ్చిన వీరు ఆటోలో కరీంనగర్ చేరుకొన్నారు. అనంతరం స్థానికంగా మత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 16న వీరిని గుర్తించిన అధికారులు కరీంనగర్ జిల్లా కేంద్ర దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ దవాఖానకు పంపించారు. గాంధీ దవాఖానలో పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. వారి నమూనాలను పుణె వైరాలజీ కేంద్రానికి పంపించారు. బుధవారం పుణె నుంచి వచ్చిన నివేదికలో ఏడుగురికి కొవిడ్-19 పాజిటివ్‌గా తేలింది.



అవసరమైతేనే బయటికి రండి: మంత్రి గంగుల

ఇండోనేషియా దేశస్థులకు పాజిటివ్ రావడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. బుధవారం కలెక్టరేట్‌లో పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్.. కలెక్టర్, శశాంక, సీపీ కమలాసన్‌రెడ్డి, ఇతర అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇండోనేషియా వ్యక్తులు కరీంనగర్‌లో 48 గంటలపాటు ఉన్నట్టు గుర్తించామని.. ఆ సమయంలో సంచరించిన ప్రాంతాలను, కలిసిన వ్యక్తులను గుర్తించామని సమావేశం తర్వాత మంత్రి గంగుల మీడియాకు వెల్లడించారు. కలెక్టరేట్ పరిధిలోని ఓ ప్రార్థనామందిరంలో గడిపినట్టు గుర్తించామని, కలెక్టరేట్ కేంద్రంగా మూడు కిలోమీటర్ల పరిధిలోని ప్రతి ఇంట్లో వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. గురువారం నుంచి వంద వైద్య బృందాలను రంగంలోకి దింపుతున్నట్టు తెలిపారు. ప్రజలు నాలుగురోజుల పాటు అత్యవసరమైతే తప్ప ఇండ్లనుంచి బయటకు రావద్దని కోరారు. జిల్లాకేంద్రంలో 20 ఐసొలేషన్, 10 ఐసీయూ బెడ్లను ఏర్పాటుచేశామని, రెండు ప్రైవేటు దవాఖానలు ప్రతిమ, చల్మెడ వైద్యశాలల్లో 50 చొప్పున బెడ్స్‌ను సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు. కరీంనగర్ నగరమంతటా శానిటైజేషన్ చేస్తున్నామని, జనసమూహాలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి.. ప్రజలను గుమికూడవద్దని ప్రచారంచేస్తున్నామన్నారు. అత్యవసరంగా చికిత్స అందజేసేందుకు ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను రంగంలోకి దింపాలని వెల్లడించారు. కరోనా విషయంలో ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రస్తుతం చేపట్టే అన్ని రకాల చర్యలు కేవలం ముందస్తులో భాగమేనని మంత్రి గంగుల పేర్కొన్నారు. కొన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ప్రజలను కోరారు.

# కౌలాలంపూర్ టు భారత్

■ **వైజాగ్ చేరిన తెలుగు విద్యార్థులు**
■ **ఇటలీలో చిక్కుకొన్న తెలుగువారు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ మూలంగా వివిధ దేశాల్లో చిక్కుకుపోయిన తెలుగు విద్యార్థులను స్వదేశానికి రప్పించే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. మలేషియా రాజధాని కౌలాలంపూర్ విమానాశ్రయంలో చిక్కుకొన్న సుమారు 150 మంది తెలుగు విద్యార్థులు బుధవారం స్వదేశానికి చేరుకున్నారు. కరోనా కారణంగా పలుదేశాల నుంచి భారత్‌కు వచ్చే విమానాలను నిలిపివేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో.. దాదాపు 350 మంది భారతీయులు కౌలాలంపూర్‌తోపాటు ఫిలిప్పీన్స్ రాజధాని మనీలా విమానాశ్రయాల్లో మంగళవారం నుంచి చిక్కుకుపోయారు. వీరిలో ఏపీతోపాటు మన రాష్ట్రంలోని హైదరాబాద్, వరంగల్ జిల్లాలకు చెందిన 200 మంది విద్యార్థులున్నారు. కౌలాలంపూర్ విమానాశ్రయం నుంచి ఢిల్లీ, విశాఖపట్నానికి ఎయిర్ ఆసియా విమానాలను అనుమతిస్తున్నట్టు విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రకటించడంతో కౌలాలంపూర్ నుంచి రావడానికి మార్గం ఏర్పడింది. ఫిలిప్పీన్స్‌లో మన విద్యార్థుల పరిస్థితి చిత్రంగా మారింది. 72 గంటల్లో దేశాన్ని విడిచిపెట్టాలని మార్చి 16ను ఫిలిప్పీన్స్ ప్రభుత్వం ఆదేశించడంతో తెలుగు విద్యార్థులు టిక్కెట్లు కొనుగోలు చేశారు. ఇండియాకు వచ్చేయాలని నిర్ణయించుకొన్నారు. భారత్‌కు వయా సింగపూర్ వెళ్దామంటే బోర్డింగ్‌పాస్‌ను కూడా ఇవ్వడంలేదని వాపోయారు. తమను ఎలాగైనా ఇండియాకు రప్పించాలని 'నమస్తే తెలంగాణ'ను ఫిలిప్పీన్స్‌లోని వైద్యవిద్యార్థులు కోరారు.



కౌలాలంపూర్ నుంచి వైజాగ్ చేరుకున్న తెలుగు విద్యార్థులు

### చొరవతీసుకోండి

■ **విదేశాంగమంత్రికి మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి**

భారతీయులు చాలామంది మనీలా, కౌలాలంపూర్, రోమ్ విమానాశ్రయాల్లో చిక్కుకున్నట్టు సోషల్‌మీడియా ద్వారా నాకు ఎంతో మంది సమాచారమిస్తున్నారు. దయచేసి స్పందించి, వారందరినీ సురక్షితంగా ఇండ్లకు చేర్చేందుకు చర్యలు తీసుకోండి' అని కేంద్ర విదేశాంగశాఖ మంత్రి ఎస్ జైశంకర్, పౌరవిమానయానశాఖ మంత్రి హర్దీప్‌సింగ్‌పూరిని మంత్రి కేటీఆర్ బుధవారం ట్విట్టర్ ద్వారా కోరారు.

# జర పదిలం


మొదటిపేజీ తరువాయి...


సమావేశం నిర్వహించనున్నారు. వైరస్ వ్యాప్తి చెందకుండా పూర్తిస్థాయిలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై విస్తృతంగా చర్చించనున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రగతిభవన్‌లో జరిగే ఈ సమావేశానికి వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్, మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, హైదరాబాద్‌కు చెందిన మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితారెడ్డి, మల్లారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, వైద్యారోగ్యశాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్‌శాఖల ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లు, అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలను ఆహ్వానించారు. ఇండోనేషియా నుంచి కరీంనగర్‌కు వచ్చిన కొంతమంది విదేశీయులకు కరోనా లక్షణాలు ఉన్నట్టు తేలడంతో రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తంగా ఉండాలని సీఎం కేసీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో తలెత్తిన పరిస్థితిని, తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పాటించాల్సిన నియంత్రణ పద్ధతులను సమావేశంలో చర్చించనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం కొన్ని అంశాల్లో 15 రోజుల కార్యాచరణ, మరికొన్ని అంశాల్లో వారం రోజుల కార్యాచరణలను అమలు చేస్తున్నది. ఈ అత్యున్నతస్థాయి సమావేశంలో మరిన్ని నియంత్రణ చర్యలు తీసుకొనే అవకాశం ఉన్నది. రహదారుల వెంట ప్రజలు గుమిగూడకుండా ఆదేశాలు జారీచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# మా బిడ్డలెట్లున్నరో..

**చైనా తర్వాత కరోనా విపరీతంగా వ్యాపించిన ఇటలీలో తెలుగు విద్యార్థుల పరిస్థితి దారుణంగా మారింది. అక్కడ చిక్కుకొన్న తమ బిడ్డల గురించి స్వదేశంలోని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పెద్ద చదువులకోసం ఇటలీ వెళ్లిన తమ బిడ్డలను సురక్షితంగా భారత్‌కు రప్పించాలంటూ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియావేదికగా తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు.**

### తిండి దొరకడంలేదు డాడీ

ఇటలీ ఎయిర్‌పోర్టులో రోజూ పాస్తాలు, నూడుల్స్ తప్ప సరిగా తిండి దొరకడంలేదు. ఇక్కడ ఎవరూ సరిగా పట్టించుకోవడంలేదు. మొన్న ఎయిర్‌పోర్టులో నా రక్త నమూనాలు తీసుకున్నారు. దాని రిపోర్టులు చెప్పడం లేదు. నేను ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నా. ఎలాంటి సమస్య లేదు.

**- నేరెళ్ల సుష్మా, తెలుగు విద్యార్థిని, ఇటలీ**


### నా బిడ్డకు ఆస్తమా ఉన్నది



నా కుమార్తె సౌమ్యారెడ్డి 2018లో ఇటలీకి వెళ్లింది. ఈ నెల 11న నా బిడ్డ తిరిగి స్వదేశానికి రావాల్సి ఉన్నది. ఎయిర్‌పోర్టులోనే అధికారులు నిలిపివేశారు. వారం రోజులు కావస్తున్నది. నా బిడ్డ నుంచి ఎలాంటి సమాచారం లేదు. చిన్నప్పటినుంచి ఆస్తమాతో బాధపడుతున్నది. భయంగా ఉన్నది. ప్రభుత్వం స్పందించి సౌమ్యను స్వదేశానికి రప్పించాలి.

**- పిన్నంరెడ్డి శ్రీదేవి, బాధితురాలి తల్లి**

### మంగళవారం రాత్రి నుంచి కాంటాక్ట్ లేదు



నా బిడ్డ దాసరి దీపక్ ఉన్నత చదువుల కోసం ఇటలీవెళ్లాడు. వెంటనే హైదరాబాద్ వచ్చేయమన్నాను. ఈ నెల 11న ఫ్లయిట్ బుక్‌చేసుకొన్నప్పటికీ, ఫ్లయిట్లు నడవడం లేదు. మంగళవారం రాత్రి ఫోన్‌చేసి ఎవరూ పట్టించుకోవడంలేదన్నాడు. ఆ తర్వాత ఫోన్ స్విచాఫ్ వచ్చింది. విషయాన్ని మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా తెలిపాం. తప్పకుండా సహాయం అందిస్తామన్నారు.

**- దాసరి రాజేందర్, బోడుప్పల్**

### నా బిడ్డను స్వదేశానికి రప్పించండి



నా బిడ్డ శిరీష ఈ నెల 11న ఇటలీ నుంచి స్వదేశానికి రావడానికి టికెట్ బుక్‌చేసుకున్నది. ఎయిరిండియా ఫ్లైట్‌లో తీసుకొచ్చేందుకు సిబ్బంది నిరాకరించారు. అక్కడ ఇండియన్ ఎంబసీ కేటాయించిన హోటల్ గదిలో ఉన్నది. సోమవారం రాత్రి ఎంబసీ అధికారులు గదిని ఖాళీచేయాలనడంతో ఎక్కడికిపోవాలో అర్థంకావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని నా బిడ్డను స్వదేశానికి రప్పించాలి.

**- గాండ్ల ఉపేందర్, బేగంపేట**

# ఆరు నెలల రేషన్ ఒకేసారి!

- ఆహారధాన్యాలకు లోటు రాకుండా..
- కరోనా నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ, మార్చి 18:** కరోనా వైరస్ నియంత్రణకు పలు ఆంక్షలు అమలవుతున్న నేపథ్యంలో పేదలకు ఆహారధాన్యాలకు లోటు రాకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా రేషన్ పొందే లబ్ధిదారులు తమ ఆరు నెలల కోటాను ఒకేసారి తీసుకోవచ్చని కేంద్ర మంత్రి రాంవిలాస్ పాశ్వాన్ బుధవారం వెల్లడించారు. ప్రస్తుతం లబ్ధిదారులు గరిష్ఠంగా రెండు నెలలు అడ్వాన్స్‌గా ఆహార ధాన్యాలు తీసుకుంటున్నారని, దీన్ని ఆరు నెలలకు పెంచుతున్నామన్నారు. పంజాబ్ ఇప్పటికే ఆరు నెలల రేషన్ ఒకేసారి అందిస్తున్నదని చెప్పారు. 'మన వద్ద గోదాముల్లో తగినన్ని ఆహార ధాన్యాల నిల్వలున్నాయి. పేదలకు ఆరు నెలల రేషన్ ఒకేసారి అందించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కోరాం' అని పాశ్వాన్ తెలిపారు. కరోనా నేపథ్యంలో రేషన్ షాపుల వద్ద రద్దీ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం ఇప్పటికే అడ్వైజరీని జారీ చేసిందని తెలిపారు.

**ధరలను పర్యవేక్షిస్తున్నాం**

కరోనా వ్యాప్తి కారణంగా సబ్బులు, ఫ్లోర్ క్లీనర్లు, థర్మల్ స్కానర్లకు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం వాటి ధరలను నిశితంగా పరిశీలిస్తున్నదని పాశ్వాన్ తెలిపారు. వీటి ధరలు పెరిగిన పక్షంలో వీటినీ నిత్యావసరాల చట్టం పరిధిలోకి తెస్తామని చెప్పారు. ప్రభుత్వం ఇటీవలే మాస్కులను, హ్యాండ్ శానిటైజర్లను ఈ చట్టం పరిధిలోకి తెచ్చిన విషయాన్ని గుర్తుచేశారు.

## నిరుద్యోగులుగా మారనున్న 2.5 కోట్ల మంది

**జెనీవా:** ప్రపంచ దేశాల్ని గడగడలాడిస్తున్న కరోనా మహమ్మారి నిరుద్యోగాన్ని పెంచనున్నది. వైరస్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా 2.5 కోట్ల మంది నిరుద్యోగులుగా మారనున్నారు. దీంతో 2020లో ఉద్యోగులు.. 860 బిలియన్ డాలర్ల(86 వేల కోట్ల డాలర్లు) నుంచి 3.4 ట్రిలియన్ డాలర్ల(3.4 లక్షల కోట్ల డాలర్లు) ఆదాయాన్ని కోల్పోనున్నారు. ఈ వివరాల్ని ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ కార్మిక సంస్థ బుధవారం విడుదల చేసిన తన తాజా అధ్యయనంలో వెల్లడించింది.

## ప్రపంచంలో సగం మంది విద్యార్థులు ఇండ్లలోనే: యునెస్కో

**పారిస్:** కరోనా ప్రభావంతో 85 కోట్ల మందికి పైగా యువకులు, బాలలు విద్యా సంస్థలకు దూరంగా ఉన్నారని యునెస్కో పేర్కొంది. ఈ వ్యాధి విద్యారంగానికి 'అసాధారణ సవాల్'గా మారిందని తెలిపింది. ఇప్పటికే 102 దేశాలు పూర్తిగా, 11 దేశాలు పాక్షికంగా స్కూళ్లు, యూనివర్సిటీలను మూసివేశాయని, మరికొన్ని దేశాలు ఆ దిశగా ప్రయాణిస్తున్నాయని మంగళవారం యునెస్కో ఒక ప్రకటనలో వెల్లడించింది. పాఠశాలలకు, యూనివర్సిటీలకు, కళాశాలలకు దూరమైన బాలలు, యువత.. ప్రపంచ విద్యార్థుల జనాభాలో దాదాపు సగం ఉంటారని తెలిపింది.



**కరోనా క్లాక్ 18-3-2020**

| | |
|---|---|
| ప్రపంచవ్యాప్తంగా ప్రభావిత కేసులు | 2.16 లక్షలు |
| మరణాలు | 8,908 |
| దేశవ్యాప్తంగా ప్రభావిత కేసులు | 158 |
| మరణాలు | 3 |

**మీకు తెలుసా?**

కరోనా వైరస్
గాలిలో.. **3** గంటల వరకు,
రాగి పాత్రలపై.. **4** గంటల వరకు
అట్టపెట్టెలపై.. **24** గంటల వరకు
ప్లాస్టిక్, స్టీల్ సామగ్రిపై..
**2-3** రోజులు జీవిస్తుందట.

### వైష్ణోదేవి యాత్ర నిలిపివేత

**జమ్ము:** వైష్ణోదేవి యాత్రను నిలిపివేస్తున్నట్లు జమ్ముకశ్మీర్ అధికారులు ప్రకటించారు. కరోనా వ్యాప్తిని అడ్డుకోవడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బుధవారం నుంచే ఈ నిర్ణయం అమల్లోకి వస్తున్నదని, కాబట్టి భక్తులు యాత్ర కోసం రావొద్దని సూచించారు. అలాగే రాష్ట్రంలో ఇంటర్‌స్టేట్ బస్సులపైనా నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించారు.

### విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఎలా?

**న్యూఢిల్లీ:** కరోనా నేపథ్యంలో పాఠశాలలను మూసివేయడంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందకపోవడాన్ని సుప్రీం కోర్టు తీవ్రంగా పరిగణించింది. ఈ విషయాన్ని సుమోటోగా స్వీకరించిన కోర్టు వివరణ ఇవ్వాలంటూ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది.



### ఐఐటీ-బాంబే బంద్

**ముంబై:** కరోనా నేపథ్యంలో క్యాంపస్‌ను మూసివేయాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-బాంబే నిర్ణయించింది. మహారాష్ట్రలోని పొవాయ్‌లో ఉన్న క్యాంపస్‌ను ఈ నెల 31 వరకు మూసివేయనున్నట్లు తెలిపింది. ఈ నెల 20లోపు విద్యార్థులు హాస్టళ్లను ఖాళీ చేయాలని సూచించింది. తక్షణమే స్వస్థలాలకు వెళ్లలేని విద్యార్థులు హాస్టళ్లలో ఉండొచ్చని తెలిపింది.

### చికిత్స చేస్తున్న వైద్యుడికే కరోనా

**లక్నో:** కరోనా బాధితుడికి చికిత్స అందిస్తున్న వైద్యుడు కూడా వైరస్ బారిన పడ్డారు. యూపీలోని కింగ్‌జార్జ్ మెడికల్ వర్సిటీలో ఏర్పాటుచేసిన ఐసొలేషన్ వార్డుకు వచ్చిన వారి శాంపిళ్లను సేకరించే జూనియర్ డాక్టర్‌కు అప్పగించారు. అయితే ఆయనకూ కరోనా సోకినట్లు తేలడంతో అదే వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు.



### మాస్కుల తయారీలో ఖైదీలు

**ముజఫర్‌పూర్:** బీహార్‌లోని ముజఫర్‌పూర్ సెంట్రల్ జైలు ఖైదీలు మాస్కుల తయారీలో బిజీ అయ్యారు. కోవిడ్-19 వ్యాప్తిని నిరోధించే ప్రక్రియలో ఓవర్‌టైం పనిచేస్తున్నారు. తోటిఖైదీలతోపాటు జైలు సిబ్బందికి కూడా మాస్కులు అందజేస్తున్నారు. ముజఫర్‌పూర్ కేంద్ర కారాగార పరిధిలోకి వచ్చే తొమ్మిది జిల్లా, సబ్‌జైళ్లలో కూడా ఖైదీలతో మాస్కుల తయారీ చేపట్టారు.

### స్వయం ప్రభ చానళ్లలో ఈ-తరగతులు

**న్యూఢిల్లీ:** కరోనా నేపథ్యంలో పాఠశాల విద్యార్థుల కోసం కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ త్వరలో స్వయం ప్రభ డీటీహెచ్ చానళ్లలో ఈ-తరగతులు ప్రారంభించనున్నట్లు ఆ శాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ నిషాంక్ తెలిపారు. విద్యార్థులకు సిలబస్ పూర్తిచేసేందుకు కోల్‌కతాలో పలు పాఠశాలలు ఈ-తరగతులను నిర్వహిస్తున్నాయి.

# నిర్లక్ష్యపు శాపమిది



ప్రజలకు భద్రత కల్పించడం ప్రభుత్వాల ప్రాథమిక విధి. కానీ.. కరోనా వైరస్ విషయంలో అనేక దేశాలు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించాయి. చైనాలో వైరస్ విజృంభించి కరాళ నృత్యం చేస్తున్నా.. ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయి. 'మన దగ్గరికి వచ్చినప్పుడు చూద్దాంలే!' అన్న వైఖరే ఇప్పుడు కొంపముంచుతున్నది. వైరస్ చొచ్చుకొచ్చి ప్రజల ప్రాణాలను హరించడం మొదలుపెట్టాక అధికార యంత్రాంగంలో కదలిక వచ్చినా.. 'ఆకులు కాలిన తర్వాత చేతులు పట్టుకున్న' చందంగా తయారైంది. ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నా.. మరణ మృదంగం ఆగడం లేదు. చైనా తర్వాత వైరస్ ప్రభావం అత్యధికంగా ఇటలీ, ఇరాన్, అమెరికా వంటి దేశాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. - నేషనల్ డెస్క్

### ప్రభుత్వం, ప్రజల సమిష్టి వైఫల్యం

**పరిస్థితి:** ఇటలీలో జనవరి 31న మొదటి కరోనా కేసు వెలుగుచూసింది. ఫిబ్రవరి 20 నాటికి నలుగురు బాధితులుండగా.. 21వ తేదీన ఐదురెట్లు (21కేసులు) పెరిగింది. ఆ తర్వాత వారంలోనే వెయ్యి దాటింది. ఫిబ్రవరి 20 నాటికి ఒక్కరూ మృతి చెందలేదు. కానీ 29నాటికి 21 మంది మరణించారు. ఇప్పుడు రోజుకు వందల సంఖ్యల్లో మృత్యువాత పడుతున్నారు.

**కారణాలు:** ప్రభుత్వంతోపాటు ప్రజల నిర్లక్ష్య ఫలితమే ఈ దుస్థితి. మొదటికేసు నమోదైన తర్వాత 22 రోజులకుగానీ ప్రభుత్వం మేల్కొనలేదు. ఫిబ్రవరి 22న ప్రజల కదలికలపై ఆంక్షలు విధించింది. వాటిని కఠినంగా అమలుచేయలేదు. వైద్య ఏర్పాట్లు చేయడంలోనూ నిర్లక్ష్యం ప్రదర్శించింది. ప్రజలు సైతం ప్రభుత్వ ఆంక్షలను పాటించలేదు. రెడ్‌జోన్లుగా ప్రకటించినా బయట తిరుగడం ఆపలేదు. దీంతో వైరస్ వేగంగా వ్యాపించింది. కేవలం ఐదు రోజుల్లోనే స్టేజ్-3 నుంచి స్టేజ్-6కు చేరిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

### 40 రోజుల తర్వాత మేల్కొన్న ఫ్రాన్స్

**పరిస్థితి:** ఫ్రాన్స్‌లో జనవరి 24న ఒకేరోజు ముగ్గురికి వైరస్ సోకినట్టు నిర్ధారణ అయ్యింది. గురువారం నాటికి ఫ్రాన్స్‌లో కరోనా కేసుల సంఖ్య 7,730 దాటింది. కేవలం 20 రోజుల్లోనే 7,700 మందికి వ్యాధి సోకింది.

**కారణాలు:** జనవరి 24న తొలికేసు వెలుగుచూసినా ప్రభుత్వం పెద్దగా స్పందించలేదు. ఫిబ్రవరి 26నాటికి 18 కేసులు నమోదుకాగా.. 27న ఏకంగా 38కి పెరిగింది. అక్కడి నుంచి రోజూ కేసుల సంఖ్య రెట్టింపు అవుతున్నది. దీంతో ప్రభుత్వం మార్చి 2వ తేదీన ప్రజల కదలికలపై ఆంక్షలు విధించింది. అంటే.. మొదటి కేసు నమోదైన 40 రోజుల తర్వాత ప్రభుత్వం మేల్కొన్నది. అయితే అప్పటికే నష్టం జరిగిపోయింది.

### శాపంగా మారిన చిన్న తప్పు

**పరిస్థితి:** దక్షిణ కొరియాలో తొలి కేసు జనవరి 20న నమోదైనా ప్రభుత్వం పట్టించుకోలేదు. మార్చి 18నాటికి కేసులు 8,500కు, మరణాలు 93కు పెరిగాయి.

**కారణాలు:** ఫిబ్రవరి 18న 'షించియోంజి' నగరానికి చెందిన మహిళకు కరోనా సోకినట్టు తేలింది. ఆమె టియాగూలోని ప్రఖ్యాత చర్చిలో బహిరంగ సభకు హాజరైందని, అక్కడి నుంచి మరో నాలుగు చర్చిలకు తిరిగిందని తేలింది. అప్పటి నుంచి బాధితుల సంఖ్య ప్రతిరోజు రెట్టింపయ్యింది. డియాగూ, షించియోంజి నగరాల్లో ఫిబ్రవరి 22 నాటికి చర్చిలకు హాజరైన 9,500 మందిని పరీక్షించగా.. 1261 మందిలో కరోనా లక్షణాలు కనిపించాయి.

### నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం.. ఇరాన్

**పరిస్థితి:** ఇరాన్‌లో ఫిబ్రవరి 19న మొదటి కేసు వెలుగుచూసింది. ప్రస్తుతం 17,300కుపైగా బాధితులుండగా, మృతుల సంఖ్య 11వందలు దాటింది.

**కారణాలు:** మొదటి కేసు వెలుగు చూసేనాటికి ప్రపంచవ్యాప్తంగా 75వేల కేసులు, రెండువేల మృతులు నమోదయ్యాయి. అయినా ఇరాన్ ప్రభుత్వం ఆంక్షలను కఠినంగా అమలుచేయలేదు. ప్రజలు, మతపెద్దలు సైతం సహకరించలేదు. ప్రార్థనా స్థలాలకు భక్తుల రాకను నియంత్రించాలని ఫిబ్రవరి 20న ప్రభుత్వం కోరగా.. మత పెద్దలు అంగీకరించలేదు. పైగా శుక్రవారం భారీ ఎత్తున ప్రార్థనలు నిర్వహించారు. ఫలితంగా వైరస్ పడగవిప్పింది. ఫిబ్రవరి 26 నుంచి బాధితులు, మృతుల సంఖ్య రెట్టింపు కావడం మొదలైంది.

### ఓడిపోయిన పెద్దన్న..

**పరిస్థితి:** అమెరికాలో జనవరి 20న మొదటి కేసు వెలుగు చూసింది. ప్రస్తుతం 7,538 కేసులున్నాయి. 117మంది మరణించారు.

**కారణాలు:** కరోనా పెనుముప్పుగా మారుతుందని అమెరికా ఊహించలేదు. వైద్యఏర్పాట్లు, బడ్జెట్ కేటాయింపులు వంటి చర్యలు తీసుకోలేదు. పైగా తీవ్రతను తగ్గించి చూపింది. ఫలితంగా గత 15 రోజుల్లోనే వందమందికి పైగా బలయ్యారు.

## 31 వరకు అన్ని పరీక్షలు వాయిదా వేయండి

**కేంద్ర విద్యా సంస్థలకు ప్రభుత్వం ఆదేశం**

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ నేపథ్యంలో దేశంలోని కేంద్ర విద్యా సంస్థల్లో వార్షిక పరీక్షలను ఈ నెల 31 వరకు వాయిదా వేయాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ (హెచ్చార్డీ) బుధవారం ఆదేశించింది. యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్ఐఓఎస్ పరిధిలోని సంస్థలకు ఈ ఆదేశాలు వర్తిస్తాయి. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ)ని, అన్ని కేంద్ర విద్యా సంస్థలను ఆదేశించింది. 12వ తరగతి/ ఇంటర్ తర్వాత ఐఐటీ, ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి వచ్చేనెల 5-11 మధ్య నిర్వహించే 'జేఈఈ' పరీక్షను వాయిదా వేస్తున్నట్లు జాతీయ పరీక్షల సంస్థ (ఎన్టీఏ) తెలిపింది.

## జీవాయుధం కాదు.. ప్రకృతి సృష్టి

**తేల్చి చెప్పిన అమెరికా శాస్త్రవేత్తలు**

**లాస్ ఏంజిల్స్:** చైనా ప్రభుత్వం జీవాయుధం (బయో వెపన్) తయారుచేస్తుండగా కరోనా వైరస్ పుట్టిందన్న అపోహలను అమెరికా పరిశోధకులు కొట్టిపారేస్తున్నారు. ఈ వైరస్ ల్యాబ్‌లో పుట్టలేదని.. ప్రకృతి సృష్టించిందని అమెరికాలోని 'స్క్రిప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' శాస్త్రవేత్తలు తెలిపారు. వారు కరోనా వైరస్ జన్యుక్రమాన్ని విశ్లేషించారు. వివిధ వైరస్ జాతుల జన్యుక్రమాలతో పోల్చి చూశారు. 'సార్స్ కొవిడ్-2' వైరస్ పరిణామం చెంది 'కొవిడ్-19'గా మారిందని తేల్చారు. ఇందుకు రెండు కారణాలను పేర్కొన్నారు. 'సార్స్ కొవిడ్-2'తో పోల్చితే మానవ కణాల్లోకి చొచ్చుకెళ్లి, వ్యాధిని వ్యాప్తి చేసే వేగం కొవిడ్-19లో ఎక్కువగా ఉన్నదన్నారు. వైరస్ పైపొరలోని ప్రొటీన్ల నిర్మాణంలోనూ వ్యత్యాసం ఉందని చెప్పారు. సాధారణంగా ఒక కొత్త వైరస్‌ను సృష్టించాలంటే.. మనకు తెలిసిన ఏదో ఒక వైరస్ డీఎన్ఏను మార్చాల్సి ఉంటుంది. అయితే ప్రయోగశాలలో వేరే వైరస్ జన్యుక్రమాన్ని మార్చడం ద్వారా కొవిడ్-19ను సృష్టించినట్టు ఎలాంటి ఆధారాలు దొరుకలేదన్నారు. దీనిని బట్టి కరోనా వైరస్‌ను ప్రకృతే సృష్టించిందని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. మరోవైపు కరోనా సోకినవారిని గుర్తించి, నిలువరించకపోవడమే వ్యాప్తికి ప్రధాన కారణమని మరో అధ్యయనం తేల్చింది. జనవరి 23న చైనాలోని వుహాన్ నగరాన్ని దిగ్బంధించారు. అయితే అంతకు ముందు నగరం నుంచి ఎంతమంది.. ఎక్కడెక్కడికి వెళ్లారు? వంటి విషయాలేమీ నమోదు కాలేదని, మహమ్మారి విజృంభనకు ఇదే ప్రధాన కారణమన్నారు.

## మానవజాతికే శత్రువు

**జెనీవా:** కరోనా వైరస్.. మానవజాతి మొత్తానికి శత్రువు అని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యక్షుడు టెడ్రోస్ అధనోమ్ గెబ్రెయేసస్ బుధవారం వ్యాఖ్యానించారు. 'ఈ వైరస్ మనల్ని భయంకరమైన విపత్తు దిశగా తీసుకెళ్తున్నది. ఈ శత్రువుకు ఎదుర్కొనే క్రమంలో మానవజాతి మొత్తం ఏకమయ్యే అరుదైన అవకాశం వచ్చింది' అని పేర్కొన్నారు.

## కరోనాపై డీపీఏ ప్రయోగిస్తాం: ట్రంప్

**వాషింగ్టన్:** కరోనాను ఎదుర్కొనేందుకు అవసరమైతే 'డిఫెన్స్ ప్రొడక్షన్ యాక్ట్' (డీపీఏ)ను ప్రయోగిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీనిని ప్రయోగిస్తే మాస్కులు, గ్లౌజులు, టెస్టింగ్ కిట్‌లు తదితర వస్తువులను, యంత్రాలను సైన్యం యుద్ధ ప్రాతిపదికన తయారుచేస్తుంది. ఇందుకోసం ముడిసరుకు, యంత్రాలు వంటివాటిని దేశవ్యాప్తంగా ఎక్కడి నుంచైనా తీసుకునే హక్కు సైన్యానికి సంక్రమిస్తుంది.

# సైన్యంలో తొలి కేసు

- లడఖ్‌లో ఒక జవాన్‌కు కరోనా పాజిటివ్
- దేశంలో 158కి చేరిన బాధితులు



అమృత్‌సర్‌లో ఓ జవాన్‌కు వైద్య పరీక్షలు

**న్యూఢిల్లీ:** భారత సైన్యంలో తొలి కరోనా కేసు నమోదైంది. లడఖ్ స్కౌట్ రెజిమెంట్‌కు చెందిన 34 ఏండ్ల జవాన్‌కు వైరస్ సోకినట్లు సైన్యం ధ్రువీకరించింది. ఇరాన్ నుంచి తిరిగి వచ్చిన తన తండ్రిని కలువడంతో ఆ సైనికుడికి వైరస్ సోకినట్లు అధికారులు తెలిపారు. జవాను తండ్రి ఎయిరిండియా విమానం ద్వారా గత నెల 20న భారత్‌కు తిరిగివచ్చినట్లు చెప్పారు. జవాన్ సోదరుడికీ కరోనా సోకినట్లు తేలిందన్నారు. జవానుకు కరోనా సోకిన నేపథ్యంలో సైన్యం అప్రమత్తమైంది. ఫ్లూ లక్షణాలు ఉన్నవారిపై నిఘా పెంచింది. వార్‌గేమ్స్, రిక్రూట్‌మెంట్, శిక్షణ కార్యక్రమాలను రద్దు చేసింది. పుణేలోని 'కాలేజ్ ఆఫ్ మిలిటరీ ఇంజనీరింగ్'కు చెందిన ఆర్మీ అధికారికి ఫ్లూ లక్షణాలు కనిపించడంతో ఆయనను సెల్ఫ్ క్వారంటైన్‌లో ఉండాలని అధికారులు సూచించారు. కరోనా నియంత్రణపై కేంద్ర వైద్య శాఖ మంత్రి హర్షవర్ధన్ బుధవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులు క్వారంటైన్‌లను సందర్శించి, అక్కడి వసతులను పర్యవేక్షించాలని ఆదేశించారు.

**మహారాష్ట్రలో విజృంభణ**

బుధవారం మరో 21 పాజిటివ్ కేసులు నమోదు కావడంతో దేశంలో బాధితుల సంఖ్య 158కి పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. వీరిలో 25 మంది విదేశీయులు ఉన్నట్లు చెప్పారు. బాధితులతో సన్నిహితంగా మెలిగిన దాదాపు 5,700 మందిని అబ్జర్వేషన్‌లో ఉంచినట్లు తెలిపారు. మహారాష్ట్రలో వైరస్ వేగంగా వ్యాపిస్తున్నది. దీంతో మరో ఏడు ల్యాబ్‌లు ఏర్పాటుచేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సౌదీ అరేబియా నుంచి ఇటీవల తిరిగి వచ్చిన మాజీ కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ సురేశ్ ప్రభు స్వీయ నిర్బంధంలోకి వెళ్లారు.

**రెస్టారెంట్లు మూసేయండి!**

వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు ఈ నెల 31 వరకు లేదా రెస్టారెంట్లను మూసివేయాలని 'నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్' తమ సభ్యులను కోరింది. కర్ణాటకలో విద్యాసంస్థలు, థియేటర్లు, మాల్స్‌పై ఆంక్షలను ఈ నెల 31 వరకు పొడిగించారు.

| | | |
|---|---|---|
| మహారాష్ట్ర 42 | కేరళ 27 | హర్యానా 17 |
| ఉత్తరప్రదేశ్ 16 | కర్ణాటక 11 | ఢిల్లీ 10 |
| లడఖ్ 8 | తెలంగాణ 13 | రాజస్థాన్ 4 |
| కశ్మీర్ 3 | ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పుదుచ్చేరి, పంజాబ్, తమిళ నాడు, ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్‌లలో ఒక్కొక్కటి చొప్పున | |



బుధవారం టెహ్రాన్‌లో నిర్వహించిన క్యాబినెట్ సమావేశానికి మాస్కులు ధరించి హాజరైన ఇరాన్ మంత్రులు

# 2 లక్షల మందికి వైరస్

- 8,908కు చేరిన కరోనా మృతులు
- ఇటలీలో ఒక్కరోజే 475 మంది మృతి

**టెహ్రాన్/మాడ్రిడ్:** కరోనా దెబ్బకు ప్రపంచం విలవిల్లాడుతున్నది. మహమ్మారి ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా 8,908 మంది మరణించగా, వైరస్ సోకిన వారి సంఖ్య 2,16,000 దాటింది. కోలుకున్న వారి సంఖ్య 84వేలకు చేరుకున్నది. ఇటలీలో బుధవారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 475 మంది మృత్యువాతపడ్డారు. దీంతో ఇప్పటివరకూ ఆ దేశంలో మృతుల సంఖ్య 2,978కు చేరింది. మరోవైపు, కరోనా బాధితులతో ఇటలీలోని దవాఖానల్లోని ఐసీయూలు నిండిపోతున్నాయి. కొత్త బాధితుల్ని చేర్చుకోవడం అధికారులకు తలకుమించిన భారంగా మారుతున్నది. దీంతో టురిన్ నగరంలో కరోనా బాధితులకు ప్రోటోకాల్ సిద్ధం చేశారు. దాని ప్రకారం 80 ఏండ్లు పైబడిన వారికి వైద్యసాయం నిలిపివేయాలని అనుకుంటున్నారు. ఇరాన్‌లో కరోనాతో బుధవారం 147 మంది చనిపోయారు. దీంతో ఆ దేశంలో మరణాల సంఖ్య 1,135కు చేరింది. శుక్రవారం నౌరజ్ (పర్షియన్ కొత్త సంవత్సరం) నేపథ్యంలో ప్రజలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి కొనుగోళ్లు జరుపుతున్నారు. ఇండ్లకే పరిమితం కావాలన్న ప్రభుత్వం హెచ్చరికల్ని ప్రజలు పాటించకపోవడంపై ఇరాన్ డిప్యూటీ ఆరోగ్య శాఖ మంత్రి అలిరిజా రైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా విషయంలో ఇరాన్ ఆలస్యంగా మేల్కొన్నదని వస్తున్న విమర్శలను ఆ దేశ అధ్యక్షుడు హసన్ రౌహానీ తోసిపుచ్చారు. కరోనా నేపథ్యంలో సౌదీ అరేబియా, కువైట్, యూఏఈ వంటి దేశాలు శుక్రవారం ప్రార్థనల్ని రద్దు చేశాయి. ప్రజలందరూ ఇండ్లకే పరిమితం కావాలని ఇజ్రాయెల్ ప్రభుత్వం హెచ్చరించింది.

**స్పెయిన్‌లో 24 గంటల్లో 107 మంది మృతి..**

కరోనాతో స్పెయిన్‌లో గత 24 గంటల్లో 107 మంది మరణించారు. దీంతో మరణాల సంఖ్య 598కు చేరుకున్నది. వైరస్ సోకిన వారి సంఖ్య 13,716కి పెరిగింది. దేశ రాజధాని మాడ్రిడ్‌లో అత్యధికంగా 390 మంది(66%) మరణించారని ప్రభుత్వం తెలిపింది. ఫ్రాన్స్‌లో కరోనాతో బుధవారం ఒక్కరోజే 89 మంది మరణించారు. దీంతో ఆ దేశంలో మృతుల సంఖ్య 264కు చేరింది. దక్షిణాఫ్రికాలో బుధవారం ఒక్కరోజే 31 మందికి వైరస్ సోకింది. దీంతో ఆ దేశంలో వైరస్ సోకినవారి ఈ సంఖ్య 116 చేరింది.

### ఏడీబీ 48 వేల కోట్ల సాయం

**న్యూఢిల్లీ:** కరోనాపై పోరుకు తమ సభ్య దేశాల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) దాదాపు రూ. 48,850 కోట్లు (650 కోట్ల డాలర్ల) సాయం ప్రకటించింది. కరోనాను ఎదుర్కొనేందుకు తక్షణావసరాలకు ఈ సాయం ప్రకటించినట్లు బ్యాంకు అధ్యక్షుడు మసాట్సుగు అసాకావ తెలిపారు. తదుపరి సాయానికీ సిద్ధమన్నారు. సభ్య దేశాల్లో అమలులో గల ప్రాజెక్టుల్లో రూ.7500 కోట్లు, సాంకేతిక సాయం కింద 40 మిలియన్ల డాలర్లు అందిస్తామన్నది.

**200 కోట్ల డాలర్లు పెంచిన ప్రపంచ బ్యాంకు**

ప్రపంచ బ్యాంకు సభ్య దేశాలకు చేయూతనిచ్చేందుకు తన సాయాన్ని రూ.1.03 లక్షల కోట్ల (14 బిలియన్ల డాలర్ల)కు పెంచుతున్నట్లు తెలిపింది. ఇందులో 800 కోట్ల డాలర్ల సాయం నేరుగా అందుబాటులో ఉంటుంది. ఇది తొలుత ప్రకటించిన సాయం కంటే 200 కోట్ల డాలర్లు ఎక్కువ. తొలుత ప్రపంచ బ్యాంకు 600 కోట్ల డాలర్ల ఆర్థిక సాయం ప్రకటించింది.



### మా వద్ద ఆధునిక వైద్య వసతుల్లేవు: కిమ్

**సియోల్:** తమదేశంలో అధునాతన వైద్య వసతులు అందుబాటులో లేవని ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ అంగీకరించారు. అత్యవసరంగా వైద్య వసతులను మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారని ఆ దేశ అధికార వార్తా సంస్థ కేసీఎన్ఏ బుధవారం వెల్లడించింది.

### ప్రైవేట్ సంస్థకు కరోనా పరీక్షల నిర్వహణకు అనుమతి

**న్యూఢిల్లీ:** ఉచితంగా కరోనా వైరస్ పరీక్షల నిర్వహణకు స్విట్జర్లాండ్‌కు చెందిన రోష్ డయాగ్నస్టిక్స్ ఇండియాకు కేంద్రం అనుమతించింది. కరోనా నిర్ధారణ పరీక్షల నిర్వహణకు అనుమతి పొందిన తొలి ప్రైవేట్ సంస్థ ఇది. మరో ప్రైవేట్ డయాగ్నస్టిక్స్ సంస్థ 'బయోమెరైయుక్స్'కూ కరోనా వైద్య పరీక్షల నిర్వహణకు అనుమతించే అంశాన్ని డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) పరిశీలిస్తున్నది.

## విదేశాల్లో 276 మంది భారతీయులకు కరోనా

**లోక్‌సభకు వెల్లడించిన కేంద్రం**

**న్యూఢిల్లీ:** విదేశాల్లో 276 మంది భారతీయులు కరోనా వైరస్ బారిన పడ్డారని, ఇరాన్‌లోనే ఈ బాధితుల సంఖ్య అధికంగా ఉన్నదని కేంద్రం బుధవారం లోక్‌సభకు వెల్లడించింది. విదేశాంగశాఖ సహాయ మంత్రి వీ మురళీధరన్ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఇరాన్‌లో 255 మంది, యూఏఈలో 12 మంది, ఇటలీలో ఐదుగురు, హాంగ్‌కాంగ్, కువైట్, రువాండ, శ్రీలంకలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 276 మందికి కరోనా పాజిటివ్ ఉన్నట్టు తేలిందని తెలిపారు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఇరాన్‌లో ఆరువేల మంది భారతీయులు ఉన్నారని తెలిపారు. మార్చి 16నాటికి మొత్తం 16,389 మంది భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చినట్టు వివరించారు. తాజాగా బుధవారం సాయంత్రం ఇరాన్ నుంచి 195 మందిని తీసుకొచ్చినట్టు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు, మలేషియాలోని కౌలాలంపూర్‌లో చిక్కుకున్న 405 మంది భారతీయుల్ని స్వదేశానికి తీసుకొచ్చినట్లు చెప్పారు.

## ఐఏఎస్ కుమారుడి అరాచకం

**మండిపడ్డ సీఎం మమత**



**కోల్‌కతా:** బ్రిటన్ నుంచి వచ్చిన ఒక మహిళా ఐఏఎస్ అధికారి కుమారుడి బాధ్యతారాహిత్యంపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆగ్రహం ప్రదర్శించారు. ఆ యువకుడికి కరోనా నిర్ధారణ అయింది. బెంగాల్‌లో ఇదే తొలి కేసు. అయితే కరోనా పరీక్షలకు ముందు అతడు చాలా మంది స్నేహితులు, బంధువులను కలిశాడని వార్తలు వచ్చాయి. దీనిపై మమత స్పందిస్తూ.. 'వైరస్‌తో విదేశాల నుంచి వచ్చి ఇలా యధేచ్ఛగా తిరుగుతామంటే ఊరుకొనేది లేదు. తప్పనిసరిగా గృహనిర్బంధంలో ఉండాల్సిందే' అని పేర్కొన్నారు. సచివాలయంలో సీఎం కార్యాలయం ఉన్న భవనంలోనే సదరు ఐఏఎస్ అధికారిణి కార్యాలయం ఉండటం, ఆమె కుమారుడికి కొవిడ్-19 పాజిటివ్‌గా తేలడంతో ప్రభుత్వ పెద్దలు భయపడిపోయారు. కరోనా పరీక్షలు చేయించుకొని.. తమకు వైరస్ సోకలేదని తేలడంతో ఊపిరి పీల్చుకొన్నారు.

## రాజ్యసభలో మాస్కుల చర్చ

**న్యూఢిల్లీ:** మాస్కుల చర్చ రాజ్యసభను విడువలేదు. కొవిడ్-19 వ్యాప్తి నేపథ్యంలో బడ్జెట్ సమావేశాలను కుదించాలని బుధవారం ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దీన్ని ప్రభుత్వం తోసిపుచ్చింది. కుదించడం వీలుకాదని స్పష్టంచేసింది. బుధవారం తొలిసారిగా నలుగురు తృణముల్ కాంగ్రెస్ (టీఎంసీ) సభ్యులు మాస్కులు ధరించి సభలోకి వచ్చారు. దీనికి సభ చైర్మన్ ఎం వెంకయ్యనాయుడు అభ్యంతరం వ్యక్తంచేశారు. మాస్కులను ధరించి సభలోకి రావడం నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. హాని జరగకుండా ముందు జాగ్రత్తల్లో భాగంగా మాస్కులు ధరించవచ్చని, దీనికి అనుమతించాలని సీనియర్ కాంగ్రెస్‌నేత చిదంబరం విజ్ఞప్తి చేయడంతో.. చైర్మన్ అంగీకరించారు. ఇంటి నుంచి బయటకు వచ్చినప్పుడు తగిన దూరాల్ని పాటించాలని ప్రభుత్వమే సూచిస్తుండగా.. దాన్ని పార్లమెంటే పట్టించుకోవడంలేదని కాంగ్రెస్ సభ్యులు ఆనంద్ శర్మ, ఎంవీ రాజీవ్ గౌడ విమర్శించారు. పార్లమెంటులో చాలామంది సీనియర్లు ఉన్నారని కరోనా నేపథ్యంలో సమావేశాలను కుదించాలని లేదా వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.



మధ్యప్రదేశ్‌లో కమల్‌నాథ్ ప్రభుత్వానికి సంఖ్యాబలం ఎంత ఉన్నదో స్పష్టమే. అందుకే ఆయన బలపరీక్ష వాయిదా వేస్తూ కాలం గడుపుతున్నారు. కాంగ్రెస్ తిరుగుబాటు ఎమ్మెల్యేలను బీజేపీ చెర పట్టిందనటం హాస్యాస్పదం. వారంతా తమ ఇష్టానుసారమే కర్ణాటక హోటల్‌లో ఉన్నారు.

**శివరాజ్‌సింగ్ చౌహాన్, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి**



రాజ్యసభకు పోటీ చేస్తున్న దిగ్విజయ్‌సింగ్ కర్ణాటక హోటల్‌లో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కలుస్తానంటే, రక్షణ సమస్య అంటున్నారు. ఐదు వందల మంది పోలీసుల రక్షణ సరిపోదా? కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ హైజాక్ చేస్తున్నది.

**కమల్‌నాథ్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి**

**చరిత్రలో నేడు**



1883

బూట్ల(షూ)ను తయారుచేసే యంత్రాన్ని కనుగొన్న జాన్ మాట్జెలిగర్.

1919



ఆండ్రీ బ్రెటన్, ఫిలిప్పీ సౌపాల్ట్, లూయిస్ అరగాన్ సంపాదకత్వంలో సాహిత్య పత్రిక 'లిటరేచర్' ప్రచురణ ప్రారంభం.



1932

సిడ్నీ హార్బర్ బ్రిడ్జి ప్రారంభం.

మధ్యప్రదేశ్‌లో పదిహేనేండ్ల తర్వాత అధికారం చేపట్టిన కాంగ్రెస్ అనతికాలంలోనే సంక్షోభంలో పడింది. అయితే బీజేపీ నైతికత ఎలా ఉన్నా కమల్‌నాథ్ ప్రభుత్వం శాసనసభలో బలం నిరూపించుకోవాలి. గవర్నర్ లాల్‌జీ టాండన్ బల నిరూపణకు ఈ నెల 26 దాకా గడువు ఇవ్వటంపై అనేక విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో చట్టపరమైన, నైతికపరమైన సవాళ్లు ఎన్ని ఉన్నా బల నిరూపణ ఎంత త్వరగా జరిగితే అంత మంచిది.

**ది హిందూ**

భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయటం వివాదాస్పదమవుతున్నది. పదవీ విరమణ చేసిన నాలుగు నెలలకే రాజ్యసభ అభ్యర్థిగా బరిలో దిగటం విమర్శలపాలవుతున్నది. న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక, చట్టసభ వ్యవస్థలు విడివిడిగా స్వయంప్రతిపత్తి కలవిగా ఉంటాయి. కానీ గొగోయ్ నియామకంలో అవన్నీ కలెగలిసిపోయిన తీరుకు అద్దం పడుతున్నది. ఈ పరిస్థితుల్లో గొగోయ్ తన అభ్యర్థిత్వంపై పునరాలోచించుకోవాలి.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**



# పదవీ వ్యాజ్యం

మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయిని రాజ్యసభ సభ్యునిగా రాష్ట్రపతి నియమించడంతో, మాజీ న్యాయమూర్తులకు పదవులు కట్టబెట్టవచ్చునా, వారు స్వీకరించడం సబబా అనే చర్చ మళ్లీ మొదలైంది. గొగోయి పదవీకాలం చివరి దశలో రాఫెల్, అయోధ్య వంటి కొన్ని కీలకమైన కేసులపై తీర్పు ఇచ్చారు. పదవీవిరమణ పొందిన నాలుగు నెలల్లోనే ఆయనకు మళ్లీ పదవీ భాగ్యం కలిగింది. రాఫెల్ వివాదం ఎన్నికల సమయంలో అధికారపక్షాన్ని ఇరుకున పెడుతున్న దశలో వెలువడిన తీర్పు ప్రధానికి ఊరట కలిగించిందని కొందరు ఎత్తి చూపుతున్నారు. బీజేపీని ఇబ్బంది పెట్టడానికి చేస్తున్న ఈ విమర్శలు గొగోయి నిబద్ధతను ప్రశ్నార్థకం చేయడంతోపాటు న్యాయవ్యవస్థ విశ్వసనీయతను కూడా బోనులో నిలబెట్టడం ఆందోళనకర విషయం. మాజీ న్యాయమూర్తులకు పదవులు కట్టబెట్టకూడదనే చట్టపరమైన అడ్డంకి ఏమీ లేదు. కానీ ఈ విధానం మంచిది కాదనే చర్చ 1950 దశకం నుంచే ఉన్నది. శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థల మధ్య రాజ్యాంగవేత్తలు స్పష్టమైన హద్దులు విధించారు. స్వతంత్ర న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్యానికి ప్రాణం. న్యాయవ్యవస్థ పరిధిలోకి కార్యనిర్వాహకశాఖ బహిరంగంగా చొరబడనప్పటికీ, ఇతరత్రా ప్రలోభపెట్టడం ద్వారా ప్రభావితం చేసే అవకాశం ఎప్పుడూ పొంచి ఉంటుంది. అందువల్ల పదవీవిరమణ పొందిన న్యాయమూర్తులకు పదవులు కట్టబెట్టడం మంచిది కాదనేది బలమైన వాదన.

**పదవీ విరమణ పొందిన న్యాయమూర్తులకు కాంగ్రెస్ పార్టీ పదవులు కట్టబెట్టినప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ తప్పుపట్టింది. ఇప్పుడు బీజేపీ అధికారంలో ఉండి మాజీ న్యాయమూర్తులకు పదవులు ఇస్తే, ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నది. కొందరు న్యాయమూర్తుల పాత తీర్పుల చిట్టాను తవ్వితీసి, ఫలానా తీర్పునకు ప్రతిఫలం అని ఆరోపణలు చేస్తున్నారు. మాజీ న్యాయమూర్తులకు పదవులు ఇవ్వకూడదనే సూత్రబద్ధ విధానానికి ఏ పార్టీ కూడా కట్టుబడి ఉండటం లేదు. కానీ నైతిక విలువలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే దిగజారుడుతనం రెండు పార్టీలలోనూ కనిపిస్తున్నది.**

మాజీ న్యాయమూర్తులకు పదవులు కట్టబెట్టడం సరైన విధానం కాదని పద్నాలుగవ లా కమిషన్ స్పష్టంచేసింది. పదవుల కోసం చూసే న్యాయమూర్తులు తమ విధిని సక్రమంగా నిర్వహించలేరని ప్రజలు భావించవచ్చునని కూడా అభిప్రాయపడ్డది. పలు కేసుల్లో ప్రభుత్వం కక్షిదారుగా ఉంటుంది. అందువల్ల మాజీ న్యాయమూర్తులు ప్రభుత్వ చలువతో పదవులు పొందడం భావ్యం కాదనే అభిప్రాయం కూడా ఉన్నది. నెహ్రూ హయాంలో కొందరు న్యాయమూర్తులు తమ పదవులకు రాజీనామా చేసి ఇతర పదవులు చేపట్టిన ఉదంతాలున్నాయి. 1958లో ప్రధాని నెహ్రూ కోరికపై జస్టిస్ ఎం.సి.చాగ్లా బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవికి రాజీనామా చేసి అమెరికాకు రాయబారిగా వెళ్ళారు. దేశవిదేశాల్లోని శాస్త్రవేత్తలు, ఆర్థికవేత్తలను, వివిధరంగాలలోని నిష్ణాతులను నెహ్రూ గుర్తించి ఉపయోగించుకునేవారు. అందువల్ల చాగ్లా నియామకం పట్ల రాద్ధాంతం చెలరేగలేదు. ఇందిరా గాంధీ పాలన మొదలైన తర్వాత వ్యవస్థల పతనం, నైతిక విలువలు పడిపోవడం ప్రధాన సమస్యగా మారింది. 1983లో జస్టిస్ బహరుల్ ఇస్లాం ఒక క్రిమినల్ కేసులో బీహార్ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రాకు అనుకూలంగా తీర్పు ఇచ్చి, అనతికాలంలోనే కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేయడం గమనార్హం. 'పదవీ విరమణ తర్వాత ఇచ్చే పదవులు, పదవీవిరమణకు ముందు ఇచ్చే తీర్పులను ప్రభావితం చేస్తాయ'ని బీజేపీ దివంగత ప్రముఖుడు అరుణ్ జైట్లీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసిన వ్యాఖ్య విస్తృత ప్రచారం పొందింది.

పదవీ విరమణ పొందిన న్యాయమూర్తులకు కాంగ్రెస్ పార్టీ పదవులు కట్టబెట్టినప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ తప్పుపట్టింది. ఇప్పుడు బీజేపీ అధికారంలో ఉండి మాజీ న్యాయమూర్తులకు పదవులు ఇస్తే, ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నది. కొందరు న్యాయమూర్తుల పాత తీర్పుల చిట్టాను తవ్వితీసి, ఫలానా తీర్పునకు ప్రతిఫలం అని ఆరోపణలు చేస్తున్నారు. మాజీ న్యాయమూర్తులకు పదవులు ఇవ్వకూడదనే సూత్రబద్ధ విధానానికి ఏ పార్టీ కూడా కట్టుబడి ఉండటం లేదు. కానీ నైతిక విలువలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే దిగజారుడుతనం రెండు పార్టీలలోనూ కనిపిస్తున్నది. పరస్పరం బురద జల్లుకునే క్రమంలో, ప్రజల్లో న్యాయవ్యవస్థను పలుచన చేస్తున్నామనే స్పృహ జాతీయపార్టీలుగా చెప్పుకునే ఈ రెండింటికీ లేకపోవడం బాధాకరం. నైతికవిలువల పరిరక్షణ పట్ల నిజంగా నిబద్ధత కనుక ఉంటే, రెండుపక్షాలకు చెందిన పెద్ద మనుషులు కూర్చొని ఈ అంశంపై ఏకాభిప్రాయానికి రావచ్చు. కొన్ని నియమాలు పాటించాలనే ఒప్పందానికి వస్తే, ఎటువంటి చట్టం లేకున్నా, భవిష్యత్తు లో మరెవరు అధికారంలోకి వచ్చినా, వీరు నెలకొల్పిన సంప్రదాయాన్ని అతిక్రమించడానికి సాహసించరు. న్యాయమూర్తుల శక్తియుక్తులను సమాజానికి వినియోగించుకోవడంలో తప్పేమీ లేదు. మాజీ న్యాయమూర్తులను నిజాయితీగా ఉన్నత పదవులకు ఎంపిక చేసిన ప్రతిసారీ ఇటువంటి విమర్శలు రాలేదనేది గమనార్హం. చాగ్లా, హిదాయతుల్లా వంటి ప్రముఖుల నియామకాలే ఇందుకు ఉదాహరణ. మాజీ న్యాయమూర్తులకు పదవులు కట్టబెట్టే విషయంలో రాజకీయపక్షాలు నిజాయితీగా వ్యవహరించాలి. కొన్నేండ్ల కాలపరిమితి తర్వాత మాత్రమే పదవులు చేపట్టే విధంగా ఒక నియమాన్ని ఏర్పాటుచేయడం కొంతవరకు మంచిది. న్యాయమూర్తులే తమలో తాము చర్చించుకొని కొన్ని నియమాలు విధించుకుంటే న్యాయవ్యవస్థ పట్ల ప్రజల్లో ఉన్న గౌరవం ఇనుమడిస్తుంది.

ఆలోకన



**టంకశాల అశోక్**

# కేసీఆర్ సూటి ప్రశ్నలు

సీఏఏ వ్యతిరేక తీర్మానంపై అసెంబ్లీ చర్చ సందర్భంగా సీఎం కేసీఆర్ లేవనెత్తిన సూటి ప్రశ్నలకు బీజేపీ నుంచి సమాధానాలు లేవు. ఆ ప్రశ్నలను బీజేపీ దాటవేస్తున్నది తప్ప సమాధానాలు ఇచ్చే ప్రయత్నమే చేయటం లేదు. ఈ అంశంపై గత కొద్ది నెలల చర్చ సమయంలో ప్రదర్శించిన ఈ దాటవేత వైఖరినే వారు ఇప్పటికీ చూపుతున్నారు. ఈ కపటధోరణి కారణంగానే వారి చర్యలలో రహస్య ఉద్దేశం ఉన్నదని స్పష్టమవుతున్నది. అందువల్ల బీజేపీ స్వప్రయోజనాలు ఎంత నెరవేరుతాయో గానీ దేశ రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, సమాజానికి మాత్రం ఎనలేని హాని కలుగుతున్నది.

కేసీఆర్ లేవనెత్తిన సూటి ప్రశ్నలు ఏమిటో చూద్దాం. పౌరసత్వ సవరణ చట్టంలో హిందూ, సిక్కు, క్రైస్తవ, బౌద్ధ, జైన, పార్శీ అనే ఆరు మతాలను పేర్కొన్న స్థితిలో ముస్లింలను ఎందుకు మినహాయించారన్నది ఒక ప్రశ్న. ఇందుకు మోదీ ప్రభుత్వం గాని, బీజేపీ గాని అధికారికంగా జవాబివ్వటం లేదు. అందుకు బదులుగా చతురమైన వాదన ఒకటి చేస్తున్నారు. సీఏఏ వల్ల దేశంలో ఇప్పటికే గల ముస్లిం పౌరులకు ఎటువంటి నష్టం కలుగదన్నది వారు చెప్తున్న మాట. కానీ పౌరసత్వ చట్టం దేశంలో ఇప్పటికే ఉన్నవారి గురించి కాదు. ప్రశ్నలు వస్తున్నది కూడా వారి గురించి కాదు. పొరుగుదేశాల్లో వేధింపులకు గురై ఇక్కడికి వచ్చేవారి గురించి మాత్రమే. వలస వచ్చేవారు ఎవరైనా ఎటువంటి వివక్ష లేకుండా చూడాలి తప్ప మతం ప్రాతిపదికపై వివక్ష ఎందుకన్నది సూటి ప్రశ్న. ఈ ప్రశ్న బయటినుంచి వచ్చే బాధితులకు సంబంధించినది కాగా బీజేపీ ఆ కోణాన్ని తెలివిగా దాటవేస్తూ, ఇప్పటికే ఇక్కడ ఉన్నవారి గురించి మాట్లాడి ప్రజలను ఏమార్చజూస్తున్నది.

బీజేపీ నాయకులు అనధికారంగా వ్యక్తిగత హోదాలో కొన్ని వాదనలు చేస్తున్నారు. ఒకవేళ ముస్లింలు వేధింపులకు గురైతే వారికి ముస్లిం దేశాలున్నాయి గదా ఇటురావటమెందుకని. ఇతర ముస్లిం దేశాలున్న మాట నిజం. ఒకవేళ అదేగనుక సూత్రమైతే క్రిస్టియన్ల కోసం క్రిస్టియన్ దేశాలు, బౌద్ధుల కోసం బౌద్ధ దేశాలు, పార్శీల కోసం ఇరాన్ లేవా అన్నది విమర్శకుల ప్రశ్న. అదేవిధంగా పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్‌లలో వేధింపులకు గురవుతున్నవారిలో షియా, హజారా వంటి మైనారిటీ తెగల మాటేమిటన్నది మరొక ప్రశ్న. మయన్మార్‌లో బౌద్ధ ప్రభుత్వం చేత దమనకాండకు గురయ్యే రోహింగ్యాలు, శ్రీలంకలో తమిళుల ప్రశ్నలూ ఉన్నాయి. ఈ చట్టం బాధితుల పట్ల మానవతా దృష్టికి సంబంధించినదే అయినప్పుడు అందులో ఒక మతాన్ని మినహాయించటం ఎందుకన్నది ప్రశ్న. ఇవి ఒక విధమైన ప్రశ్నలు కాగా, ఈ వివక్ష మన రాజ్యాంగ స్ఫూర్తికి, ప్రజాస్వామిక సంస్కృతికి, అంతర్జాతీయ నియమ నిబంధనలకు విరుద్ధమన్నది కేసీఆర్ వలెనే దేశ విదేశాలకు చెందిన విమర్శకులు వేస్తున్న ప్రశ్నలు. ఇందుకు సమాధానమివ్వని బీజేపీ ఇది మా అంతర్గత విషయమని, సార్వభౌమాధికారమని దబాయిస్తున్నది. అంతర్గత విషయాల్లో, సార్వభౌమాధికారంలో మత వివక్ష ఉండవచ్చునా అనే ప్రశ్నకు జవాబు లేదు. ఇదే సందర్భంలో బీజేపీ నాయకులు చూపుతున్న చతురత మరొకటి ఉన్నది. పాక్, ఆఫ్ఘన్, బంగ్లాదేశ్‌లలో బాధితులైన హిందువులకు మనం పౌరసత్వం ఇవ్వవద్దంటారా అని. ప్రతిపక్షాలు గాని, విమర్శకులు గాని ఆ మాట ఎవ్వరూ, ఎప్పుడూ అనలేదు. ఇవ్వాలనే అంటున్నారు. వారు అనని మాటను అన్నట్లు ప్రచారం చేస్తున్న బీజేపీ, ఆ వక్రీకరణ వెనుక తన వివక్షలను కప్పిపెట్టజూస్తున్నది.

సీఏఏలో ముస్లింల ప్రస్థావన ఎందుకు లేదంటూ ముఖ్యమంత్రి వేసిన ప్రశ్నలో ఈ అర్థాలు, అంతరార్థాలు అన్నీ ఉన్నాయి. ఇదే విధమైన మరొక సూటి ప్రశ్నను చూడండి. సీఏఏ, ఎన్పీఆర్‌లకు ఎన్నార్సీతో సంబంధం లేదన్నది మోదీ ప్రభుత్వం ప్రకటన. అదే సమయంలో వాటి మధ్య సంబంధం ఉందని కూడా అంతే అధికారికంగా చెప్తున్నారు. ప్రధాని, హోంమంత్రి, హోంశాఖ 2018-19 వార్షిక నివేదిక వేర్వేరు విధంగా పేర్కొంటుండటం ఒక విచిత్రమైన స్థితి. ఇదొక బహుముఖ వైరుధ్యం. దీనిని గతంలోనే ఎత్తిచూపిన కేసీఆర్ ఈ నెల 16 నాటి అసెంబ్లీ చర్చలో తిరిగి ప్రస్తావించారు. ఎన్పీఆర్ సర్వే అన్నది ఎన్నార్సీకి తొలి అడుగు అంటూ స్వయంగా హోంశాఖ నివేదిక పేర్కొన్నదానిని చదివి వినిపించారు. దీనంతటికి అర్థం ఏమిటి? ఇందువల్ల ప్రజల్లో భయాందోళనలు తలెత్తవా? ఇటువంటి పరస్పర విరుద్ధ స్థితి వల్లనే కదా విమర్శలు, దేశమంతటా ఆందోళనలు వస్తున్నది? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. కానీ ఈ తరహా ప్రశ్నలకు మోదీ ప్రభుత్వం గాని, బీజేపీ గానీ కనీసం కుంటి సమాధానాలైనా ఇవ్వలేకపోయాయి. ఎన్నార్సీ గురించి ఇంతవరకు అసలు చర్చించలేదంటూ మభ్యపెట్టజూస్తున్నారు గాని భవిష్యత్తులో చర్చించబోమంటూ ఇంతవరకు ప్రకటించలేదు. ఒక్కొక్క అడుగుగా ముందుకుపోవటమే వారి రహస్య పథకం.

కేసీఆర్ మూడవ సూటి ప్రశ్న-ప్రజలు తమ పౌరసత్వాన్ని నిరూపించుకునేందుకు సమర్పించవలసిన పత్రాల గురించి. ప్రభుత్వం చెప్పేదానిలో ఇందులోనూ పై తరహా వైరుధ్యాలే ఉన్నాయని ఆయన ఎత్తిచూపారు. ప్రజలు తమకు తెలిసిందే చెప్పవచ్చునని, ఉన్న పత్రాలే ఇవ్వవచ్చునని, లేని వాటిగురించి చింతించనక్కరలేదని,ఆ కారణంగా తర్వాత ఇబ్బందులుండబోవని ప్రభుత్వం నుంచి ఒకవైపు నోటిమాటగా నమ్మబలుకుతున్నారు. మరొకవైపు అవి తప్పనిసరి అంటున్నారు. లోగడ జరిగిన జనాభా లెక్కల్లో లేని కొత్త ప్రశ్నలను ఈసారి ఎన్పీఆర్‌లో చేర్చారు. ఈ ఎన్పీఆర్ డేటా తర్వాత జరిగే ఎన్నార్సీకి ఆధారమవుతుంది. ఒక్కొక్క అడుగు ముందుకు పోవడమంటే ఇదే. ఇది ప్రజలను వంచించే బుద్ధిపూర్వకమైన వైరుధ్యం కాదా? ఒక స్థాయి కుటుంబానికి చెందిన తనకే జన్మనామం తప్ప జన్మపత్రం లేదని, అటువంటప్పుడు దేశంలోని కోట్లాదిమంది పేదల పరిస్థితి ఏమిటని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఇది గత అనేక వారాల చర్చ సందర్భంగా జవాబు రాని ప్రశ్న. ఇప్పటికీ రావటం లేదు. ఏ దేశానికైనా ఒక పౌరసత్వం అంటూ ఉండాలన్నదే కేసీఆర్ ఉద్దేశం. కానీ ఆ ప్రక్రియ ప్రజాస్వామికంగా, రాజ్యాంగబద్ధంగా, పారదర్శకంగా, ఇండియా వంటి వైవిధ్య దేశంలో అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ వివక్ష లేనివిధంగా కాకుండా ముసుగు వ్యవహారంగా ఎందుకు సాగాలన్నది ఆయన అసెంబ్లీలో వేసిన ప్రశ్న. ఇది ఎవరి ప్రయోజనాల కోసమని కూడా ఆయన అంతే సూటిగా అడిగారు. అంతిమంగా ఇది ముస్లిం సమస్యో, హిందూ సమస్యో కాదని, యావద్దేశ సమస్య అని ప్రకటించారు.

చర్చ సమయంలో సీఎం కొన్ని విషయాలు స్పష్టం చేశారు. టీఆర్ఎస్ సెక్యులర్ పునాదులున్న పార్టీ అని, మన రాజ్యాంగంలోనే సెక్యులరిజం అనే మాట ఉన్నదంటూ, తమ విధానం ప్రకారమే ప్రస్తుత తీర్మానం చేస్తున్నామని, దానిని తెలంగాణ సమాజం హర్షిస్తుందో లేదో చూద్దామన్నారు. వందల ఏండ్ల మెట్రో పాలిటన్ సంస్కృతి గల తెలంగాణ ఇటువంటి ప్రశ్నలు వేయవలసి ఉంటుందన్నారు. ఎన్నికల్లో గెలిచినా ఓడినా సరే తమ వైఖరి ఇదని సాహసంతో ప్రకటించారు. కేసీఆర్ లౌకికవాద సిద్ధాంతంపై ఆయన గురించి మొదటి నుంచి తెలిసిన వారెవరికీ సందేహం ఉండదు. మజ్లిస్ పార్టీతో రాజకీయ మైత్రి అదేక్రమంలో ఏర్పడినటువంటిదే. ఆ మైత్రిని చూపుతూ ఆయనపై బీజేపీ నిరంతరం విషం కక్కటం కనిపిస్తున్నదే. సీఏఏను వ్యతిరేకిస్తే దేశ ద్రోహులని, పాకిస్థాన్ ఏజెంట్లని ముద్రవేయజూస్తున్నారని అసెంబ్లీ చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి నిరసించిన సాయంత్రమే తెలంగాణ బీజేపీ కొత్త అధ్యక్షుడు బండి సంజయ్, మరొక ఎంపీ అరవింద్‌లు, దీన్నొక అవకాశంగా తీసుకొని ఆయా ప్రశ్నలపై ప్రజలకు సావధానంగా వివరణ ఇవ్వటానికి బదులు కేసీఆర్‌పై దేశద్రోహం కేసు మోపాలంటూ డిమాండ్ చేయటం గమనించదగినది. సంజయ్‌కు గల ఘనమైన అవగాహన ప్రకారం పార్లమెంట్ చేసిన ఒక చట్టాన్ని వ్యతిరేకించటం, అసెంబ్లీలో తీర్మానించటం దేశద్రోహమవుతుంది!

సీఏఏ చట్టాన్ని విమర్శించినవారిని, ఆందోళనలు చేసినవారిని దేశద్రోహ నేరంపై మోదీ ప్రభుత్వం కేసులు మోపి అరెస్టులు చేస్తుండగా, ఇలాంటి విమర్శలు ఎంతమాత్రం దేశద్రోహం కాదని ఇప్పటికే పలువురు న్యాయమూర్తులు ప్రకటించటం ఆయన దృష్టికి వచ్చినట్లు లేదు.

> సీఏఏ చట్టాన్ని విమర్శించినవారిని, ఆందోళనలు చేసినవారిని దేశద్రోహ నేరంపై మోదీ ప్రభుత్వం కేసులు మోపి అరెస్టులు చేస్తుండగా, ఇలాంటి విమర్శలు ఎంతమాత్రం దేశద్రోహం కాదని ఇప్పటికే పలువురు న్యాయమూర్తులు ప్రకటించటం ఆయన దృష్టికి వచ్చినట్లు లేదు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి దీపక్ గుప్తా అయితే ప్రభుత్వ చర్యలు ప్రతిసారి ఒప్పుకాబోవని, చట్టాలను విమర్శించటం ద్వారానే సమాజం వికసిస్తుందని, చట్టాలనే గాక చట్టసభలను, ప్రభుత్వాలను, న్యాయవ్యవస్థను, సైనిక వ్యవస్థను విమర్శించినా సరే దానిని దేశ వ్యతిరేక చర్య అనలేమన్నారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తి దీపక్ గుప్తా అయితే ప్రభుత్వ చర్యలు ప్రతిసారి ఒప్పు కాబోవని, చట్టాలను విమర్శించటం ద్వారానే సమాజం వికసిస్తుందని, చట్టాలనే గాక చట్టసభలను, ప్రభుత్వాలను, న్యాయవ్యవస్థను, సైనిక వ్యవస్థను విమర్శించినా సరే దానిని దేశ వ్యతిరేక చర్య అనలేమన్నారు. ప్రభుత్వం వేరు, దేశం వేరని స్పష్టం చేశారు. బీజేపీ కొత్త అధ్యక్షునికి ఈ విషయం తెలిస్తే ఆ జడ్జిపై కూడా దేశద్రోహం కేసు పెట్టమంటారనే భయం కలుగుతున్నది. కొంతకాలంగా ఆయన మాటలు, చేతలను గమనిస్తున్నవారికి, అక్కరలేని దూకుడు తగ్గించి కొంత పరిణతి తెచ్చుకోవటం మంచిదనిపిస్తున్నది. ప్రస్తుతానికి మాత్రం ఆయన 'విషం కక్కటం ద్వారా రాజ్యాధికార సాధన' అని సిద్ధాంతీకరించుకున్నట్లు కనిపిస్తున్నారు. పదవులే కాదు, కొంత గౌరవనీయత కూడా అవసరమని ఆయన గ్రహించాలి. ఇంచుమించు ఇదే విధమైన తీర్మానాలు ఇప్పటికే అరడజను రాష్ట్రాలు చేశాయని, వాటిలో తమ ఎన్డీయేలో భాగస్వామి అయిన బీహార్ కూడా ఒకటని ఆయనకు తెలుసునో లేదో. ఈ ఇద్దరు బీజేపీ నేతలు అసెంబ్లీ తీర్మానాన్ని చిత్తు కాగితమని, దాన్ని చెత్త బుట్టలో పడేయాలని ఈసడిస్తూ మాట్లాడారు. తెలంగాణ సహా ఈ అసెంబ్లీ తీర్మానాలన్నీ చట్టపరంగా నిలువవచ్చు, నిలువకపోవచ్చుగాక. అయినా వాటికి గల ప్రజాస్వామిక అర్థాన్ని ప్రజాస్వామ్యవాదులు మాత్రమే గుర్తించగలరు. ఆయా రాష్ట్రాల ప్రజలకు ప్రాతినిధ్యం వహించే చట్టసభల అభిప్రాయం గురించి ఇంత తిరస్కారంగా మాట్లాడటమంటే వీరిద్దరికి ప్రజాస్వామ్యం పట్ల ఎంత అవగాహన, గౌరవం ఉన్నాయో అర్థమవుతున్నది.

# తెలంగాణ గడ్డ, లౌకికతత్వానికి అడ్డా

తెలంగాణం



**జూలూరు గౌరీశంకర్**

మనది సర్వమత సమానత్వాన్ని ప్రతిష్ఠించిన నేల. ఈ నేలపై ఎవరు ఎన్నెన్ని రకాలుగా మత ఘర్షణలను లేపి, మత రాజ్యాలను చెలాయించాలని చూసినా దాన్ని తిప్పికొట్టిన సర్వమత సమానత్వ సమ్మేళనాల భూమి నా భరత భూమి. చరిత్ర పాఠాలను తిరగేస్తే ప్రపంచంలోనే సర్వమత సమానత్వ లౌకికరాజ్యం భారతదేశమేనని సగర్వంగా చెప్పబడుతున్నది. మతం పేరుతో ఎవరైనా లబ్ధి పొందాలని చూసినప్పుడల్లా మహాత్మా గాంధీకి ఇష్టమైన 'రఘుపతి రాఘవ రాజారామ్/ పతీత పావన సీతారామ్/ ఈశ్వర అల్లా తేరే నామ్/సబ్‌కో సమ్మతి దే భగవాన్' గీతం గుర్తుకువస్తుంది. భక్తి ఉద్యమకారుడు, సామాజిక సంస్కర్త సంత్ కబీర్‌దాస్ 'మతం పేరిట సామరస్యం చెడగొట్టుకోవడం అవివేకం' అన్నది గుర్తుకువస్తుంది. మతం పేరున లేస్తున్న మంటలు వినాశనం వైపునకే తీసుకుపోతాయని చరిత్ర చెబుతున్నది. కబీర్ అన్న 'రామ్ రహీమ్ ఏక్‌హై' సూక్తి మత సామరస్యానికి గుర్తుగా నిలుస్తుంది. భద్రాద్రి రామునికి తానీషా ముత్యాల తలంబ్రాలు సమర్పించే సంప్రదాయం హిందూ ముస్లిం ఐక్యతకు సంకేతం. ఇందులో హిందువుల భక్తి సంప్రదాయాలు, ముస్లింల సూఫీతత్వం కలగలసి ఉన్నాయి. ఇంతకంటే మత సామరస్యానికి చిహ్నాలేముంటాయి? రాష్ట్ర అవతరణ తర్వాత చార్మినార్ సాక్షిగా ఒక్క మతఘర్షణ జరుగలేదు. కొందరు రెచ్చగొట్టే ప్రకటనలు చేసినా హైదరాబాద్ మతసామరస్య కేంద్రంగా నిలిచింది. ఈ సంస్కృతి బలంగా కొనసాగిస్తూ అభివృద్ధి దిశగా కేసీఆర్ అడుగులు వేస్తున్నారు. ఇది భవిష్యత్తుకు శుభసూచకం.

న్యూనతాభావనతో జీవించటం కంటే ఘోరమైనది మరొకటి ఉండదు. మనిషిని న్యూనతలోకి నెట్టి అస్తిత్వాన్ని ప్రశ్నిస్తే ప్రజ్వరిల్లే ఆగ్రహాన్ని అంచనా వేయలేం. జ్యోతిభా పూలే, అంబేద్కర్‌లు అన్నిరకాల వివక్షలకు వ్యతిరేకంగా పోరాడిన యోధులు. మనుషులు, మతాల మధ్య అడ్డుగోడలను కూల్చి భారతదేశం మానవీయ సమాజంగా ఉండాలని ఎందరెందరో కొట్లాడి భారత రాజ్యాంగం రాశారు. ఈ దేశంలో అణగదొక్కబడుతున్న మహా జనావళికి గొప్ప అండ భారత రాజ్యాంగం. జీవించే హక్కును, ఆత్మగౌరవంతో నిలిచే హక్కును కల్పించింది రాజ్యాంగం. 2020, మార్చి 3న అసెంబ్లీ సాక్షిగా 'సర్వమత సమభూమిలో మత వివక్షా?' అని గర్జించిన సీఎం కేసీఆర్ కంఠం విన్నాక ఒళ్లు పులకరించింది. సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా శాసనసభలో తీర్మానం పెట్టి వాటిని ఒప్పుకోమనగానే తెలంగాణ నేలంతా పరవశించింది. లౌకిక ప్రజాస్వామిక శక్తులంతా పరమానందంలో మునిగాయి.

అసెంబ్లీలో ముఖ్యమంత్రి మాట్లాడుతుంటే 1990లకు ముందు తెలుగునాట లేచిన అస్తిత్వ సాహిత్య ఉద్యమాల్లో వచ్చిన ప్రశ్నలు గుర్తుకువచ్చాయి. 'పాదముద్ర' దీర్ఘకవిత గుర్తుకువచ్చింది. ఇది అట్టడుగు బహుజనవర్గాల అస్తిత్వాలకు గుర్తుగా వచ్చింది. ఖాదర్ మొహియొద్దీన్ రాసిన 'పుట్టుమచ్చ' కవిత మొత్తం తెలుగు సమాజాన్ని ఆలోచింపజేసింది. ముస్లిం అస్తిత్వ కోణం నుంచి రాసిన ఈ కవితలో.. 'నేను పుట్టకముందే/నా పేరు దేశద్రోహుల జాబితాలో నమోదైంది..' అంటూ రాసిన కవిత భరతమాత బిడ్డలుగా ఈ మట్టి పాలు తాగి పెరిగిన నన్ను అనుమానంగా చూస్తున్నారా? అన్న ఖాదర్ వేదన కలచివేస్తుంది. తెలుగు సాహిత్యంలో ముందుకొచ్చిన అస్తిత్వ ఉద్యమాలన్నీ మనుషులను విడదీసేవిగా కాకుండా అందర్నీ ఐక్యం చేసేదిగా అస్తిత్వ సాహిత్యం వచ్చింది. స్త్రీ, దళిత, బహుజన, గిరిజన, బీసీ అస్తిత్వవాదాలతో వచ్చిన సాహిత్యమంతా సమాజంలో ఉన్న ఒడిదుడుకులన్నింటిని సరిచేసేందుకు వచ్చినవే. అందులో తెలంగాణ అస్తిత్వ ఉద్యమ సాహిత్యం ప్రపంచ అస్తిత్వ ఉద్యమసాహిత్యంలో విశిష్టమైనది. తెలంగాణ అస్తిత్వ సాహిత్య ఉద్యమం రాష్ట్ర సాధన ఉద్యమానికి అండదండగా నిలిచింది.

ఇప్పుడు ఈ దేశంలో ఉండాలంటే సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీలను ఒప్పుకోవాల్సిందే, లేకుంటే మీరు దేశద్రోహులే అనటం దేశంలో ఆలోచనాపరులందరినీ బాధకు గురిచేస్తున్నది. ఈ చారిత్రక సందర్భంలో కేసీఆర్ అసెంబ్లీలో చేసిన ప్రకటన ఈ రాష్ట్రంలో, ఈ దేశంలో మొత్తం లౌకిక ప్రజాస్వామిక శక్తులందరినీ ఒక్కటిచేస్తూ చేసిన చారిత్రక ప్రకటనగా నిలిచిపోతుంది. కేంద్రం రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్న తీరును కేసీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలందరి తరపున్నే కాకుండా దేశ ప్రజలందరి తరపున అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసినట్లయ్యింది. ఈ తీర్మానం ప్రజాస్వామిక విలువలకు పట్టం కట్టింది.

> ఈ దేశంలో ఉండాలంటే సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీలను ఒప్పుకోవాల్సిందే, లేకుంటే మీరు దేశద్రోహులే అనటం దేశంలో ఆలోచనాపరులందరినీ బాధకు గురిచేస్తున్నది. ఈ చారిత్రక సందర్భంలో కేసీఆర్ అసెంబ్లీలో చేసిన ప్రకటన ఈ రాష్ట్రంలో, ఈ దేశంలో మొత్తం లౌకిక ప్రజాస్వామిక శక్తులందరినీ ఒక్కటిచేస్తూ చేసిన చారిత్రక ప్రకటనగా నిలిచిపోతుంది.

మనది అందరినీ కలుపుకొనిపోయే సంస్కృతి. హైదరాబాద్ నగరాన్ని రెండుముక్కలు చేసి మంటలు లేపే సంస్కృతికి తెలంగాణ రాష్ట్రంలో కాలంచెల్లింది. ఈ నేలలో పీర్ల పండుగకు, బతుకమ్మ పండుగకు ఎన్నడూ పోటీపెట్టి చూడలేదు. శ్రీరామనవమి తీర్థాన్ని కలిసి తాగినం, రంజాన్ సేమియాలను కలిసి సేవించినం. క్రీస్తు పుట్టినరోజును కలిసి చేసుకున్నం. ఈ మహోన్నత మానవీయ సంబంధాల మీద ఎవరు దాడిచేసినా ఈ నేల ఒప్పుకోదు. తిప్పికొడుతదనటానికి 2020, మార్చి 3 అసెంబ్లీ తీర్మాన ప్రకటన రుజువుచేస్తున్నది.

యాభై మంది పౌరులు ఢిల్లీలో చనిపోయిన తీరు, ఆ అల్లర్ల వెనుక ఉన్న నేపథ్యం దారుణం. ఒక వ్యక్తిపై మరో వ్యక్తి, ఒక వర్గంపై మరో వర్గం ఆధిపత్యం చెలాయించే స్థితిని ఈ భరతభూమి ఏనాడూ ఒప్పుకోలేదు, భవిష్యత్తులో ఒప్పుకోదు. మత సామరస్యాన్ని వ్యతిరేకించేవాళ్లను దేశద్రోహులనే ముద్రవేసే స్థితి మంచిదికాదు. ఇది ప్రజాస్వామ్యానికి విఘాతం. దీన్ని తిప్పికొట్టవలసిందే.

నలభై ఏండ్ల కిందట మీరట్‌లో అల్లర్లు జరుగుతున్న సందర్భంలో భయం గొల్పేవిధంగా ఉన్న వార్తలను గడగడా చదివేసుకుంటూ పోతుంటే సంపాదకీయంలో కులదీప్ నయ్యర్ రాసిన వ్యాసాన్ని ఆసాంతం గుక్కబట్టినట్లుగా చదివేశాను. ఓ నలభై ఏండ్ల తర్వాత మళ్లీ కులదీప్ నయ్యర్ మతం మత్తు మందే కాదు కరోనా, గత్తర కంటే భయంకరమైనది. మనిషిని మనిషిగా చూడలేని తనం దుర్మార్గమైంది. మనుషులందరూ ఒక్కటేనని చల్లటి సంగీతం వినిపించే గానం భూగోళాన్నంతా చుట్టుకపోవాలి. విశ్వమానం గీతిక కావాలి.

ఆలోచనలు సంఘర్షించుకొని ఎన్నెన్ని రకాలుగా వికసించినా వికసించనివ్వండి. కానీ, ఒక వ్యక్తిపై మరో వ్యక్తి ఒక సమూహంపై మరో సమూహం మతం రంగు పులుముకొని దాడి చేయటం, ఆధిపత్యం చెలాయించడం అమానవీయ సంస్కృతికి అద్దం పడుతుంది. ఎవరి నమ్మకాలు వారికి ఉంటాయి. ఎవరి మత విశ్వాసాలు, అలవాట్లు, ఆచారాలు వారికి ఉంటాయి. ఉండవచ్చును కూడా.

**జనగళం**

## పరిశుభ్రతే రక్షణ

ఎవరికి దగ్గు వచ్చినా చేతిని అడ్డుపెట్టుకొని దగ్గటం, తుమ్ము వస్తే దోసిలిని అడ్డుపెట్టుకొని తుమ్మటం సాధారణం. అది సభ్యత అని అందరూ భావిస్తున్నారు. ఆ దగ్గినా లేదా తుమ్మినా చేతుల ద్వారా వ్యాధులను ఇతరులకు అంటిస్తున్నామని వారికి తెలియదు. అటువంటి చేతులతో ఏవైనా ముట్టుకున్నా, కరచాలనం చేసినా తుంపర్ల ద్వారా చేతికి చేరిన సూక్ష్మజీవులు ఇతరులకు చేరే ప్రమాదం ఉన్నది. కాబట్టి దస్తీ, టిష్యూ పేపర్ వంటివి చేతిలో పెట్టుకోవాలె. కానీ అవి ప్రతిసారి అందుబాటులో ఉండకపోవచ్చు. కనుక దగ్గేటప్పుడు, తుమ్మేటప్పుడు భుజానికి మోచేతికి మధ్య భాగంలో అంగి లేదా రవికపై ముక్కును నోటిని ఆనించాలె. ఇవేవీ కుదరకపోతే తలను నేలవైపు వంచి తుమ్మాలి, లేదా దగ్గాలి.

ఇక మాస్కుల గురించి ఆలోచిద్దాం. కోవిడ్-19 భయం నేపథ్యంలో పేదలకు మాస్కులను ఉచితంగా పంపిణీ చేయాలని తెలంగాణ హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది. మాస్కులను నిత్యావసర వస్తువుల చట్టం పరిధిలోకి తెచ్చింది. తుంపర్ల ద్వారా వ్యాపించే వ్యాధుల నుంచి మాస్కుల వల్ల ప్రాథమిక రక్షణ లభిస్తుంది. సాధారణ పరిస్థితుల్లో ఆరోగ్యవంతులు మాస్కులు ధరించవలసిన అవసరం లేదు. జలుబు, దగ్గు ఉన్నవారు మాత్రమే మాస్క్ ధరించి వ్యాధి ఇతరులకు సోకకుండా సామాజిక బాధ్యత వహించాలె. జన సమ్మర్థంలో ఉన్నప్పుడు, వాతావరణ కాలుష్యం ఉన్నప్పుడు, శ్వాససంబంధ, అంటువ్యాధులు ప్రబలినప్పుడు మాస్క్ ధరించడం అందరికీ మంచిది. అయితే ఈ మాస్కులు మెడికల్ షాప్‌లలో, దవాఖానల్లో లభించేవే కానవసరం లేదు. శుభ్రమైన గుడ్డతో కుట్టించుకొని కూడా కట్టుకోవచ్చు. దస్తీని కూడా ముక్కుకు, నోటికి అడ్డంగా కట్టుకోవచ్చు. గుడ్డ మాస్కులు, దస్తీలను ఉతుక్కొని మళ్లీ వాడుకోవచ్చు. స్కార్ఫ్‌తో ముక్కుకు నోటికి ముసుగు వలె కట్టుకొనే అలవాటున్న మహిళలు ప్రత్యేకించి మాస్కులు ధరించవలసిన అవసరం లేదు.

కళ్లు, ముక్కులు నలుపరాదు. నోట్లో వేళ్లు పెట్టరాదు. ఏదైనా అపరిశుభ్రమైనది ముట్టుకున్నప్పుడు వెంటనే చేతులు శుభ్రంగా కడుక్కోవాలె. చేతుల శుభ్రత ఒక అలవాటుగా మార్చుకోవాలె. శుభ్రతనే నేటి ఆరోగ్య సూత్రం. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలె.

**- డాక్టర్ రాపోలు సత్యనారాయణ, పాలకుర్తి**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 28,870 | 8,469 |
| 1710 | 498 |

ముడి చమురు (బ్రెంట్) 25.00 డాలర్లు

## వృద్ధి అంచనాల్లో కోత

**న్యూఢిల్లీ, మార్చి 18:** మూడీస్ భారత వృద్ధి అంచనాను తగ్గించిన మరుసటి రోజే ఎస్అండ్‌పీ, బ్యాంక్ ఆఫ్ అమెరికా సెక్యూరిటీస్ కూడా కోత విధించాయి. ప్రస్తుత సంవత్సరంలో 5.2 శాతం మాత్రమే వృద్ధిని నమోదవనున్నదని ఎస్అండ్‌పీ తాజాగా వెల్లడించింది. గతంలో 5.7 శాతంగా ఉంటుందని అంచనా విడుదల చేసింది. మరోవైపు వాల్ స్ట్రీట్ బ్రోకరేజ్ బ్యాంక్ ఆఫ్ అమెరికా సెక్యూరిటీ..మార్చితో ముగిసిన మూడు నెలల్లో భారత వృద్ధి 4 శాతానికి పరిమితంకానున్నదని తెలిపింది.




# చమురు వదులుతున్నది..

**18 ఏండ్ల కనిష్ఠానికి క్రూడ్ • 25 డాలర్లకు బ్యారెల్ ధర**

**లండన్, మార్చి 18:** కరోనా సెగ చమురు ధరలకు గట్టిగానే తాకుతున్నది. వరుసగా మూడోరోజు ధరలు భారీగా తగ్గడంతో 18 ఏండ్ల కనిష్ఠ స్థాయికి జారుకున్నట్లు అయింది. వైరస్ మరింత విజృంభిస్తుండటంతో చమురుకు డిమాండ్ పడిపోతుండటంతో అంతర్జాతీయ మార్కెట్లో ధరలు అంతకంతకు పడిపోతున్నాయి. అమెరికా మార్కెట్లో క్రూడాయిల్ ధర బుధవారం ఒకేరోజు 1.49 డాలర్లు లేదా 5.53 శాతం తగ్గి 25.46 డాలర్లకు జారుకున్నది. ఏప్రిల్ 2003 తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి ధరలు. బ్రెంట్ క్రూడాయిల్ ధరలు 84 సెంట్లు లేదా 3 శాతం తగ్గి 27.89 డాలర్లకు పడిపోయాయి. కరోనా వైరస్ 154 దేశాలకు విస్తరించడంతో చమురు డిమాండ్ అనూహ్యంగా పడిపోయిందని, దీంతో ధరలు భారీగా పతనమయ్యాయని గోల్డ్‌మన్ సాచ్స్ తెలిపింది. ప్రస్తుత నెలలో డిమాండ్ 80 లక్షల డాలర్లకు పడిపోనున్నట్లు అంచనావేస్తున్నది. ప్రస్తుతం 25 డాలర్ల స్థాయిలో కదలాడుతున్న ఇంధన ధరలు భవిష్యత్తులో 20 డాలర్లకు పడిపోయిన ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించింది.

## బీఎస్-6తో టీవీఎస్ ఎక్స్ఎల్



గరిష్ఠ ధర రూ. 45 వేలు

**హైదరాబాద్, మార్చి 18:** మోపెడ్ మార్కెట్లో చరిత్ర సృష్టించిన టీవీఎస్ మోటర్.. తాజాగా తన ఎక్స్ఎల్ 100ని బీఎస్-6 ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించి మార్కెట్లోకి విడుదల చేసింది. ఈటీఎఫ్ఐ టెక్నాలజీ కలిగిన ఈ వాహనం 15 శాతం అధిక మైలేజి, మొబైల్ చార్జర్, ఫ్యూయల్ రిజర్వ్ ఇండికేటర్ వంటి ఫీచర్స్ ఉన్నాయని కంపెనీ వెల్లడించింది. మూడు రకాల్లో లభించనున్న ఈ వాహనం రూ. 43,500 నుంచి రూ.45 వేల లోపు లభించనున్నది.

## ఫోక్స్‌వ్యాగన్ నుంచి టీ-రాక్

ధర రూ.20 లక్షలు




**న్యూఢిల్లీ, మార్చి 18:** దేశీయ మార్కెట్లోకి సరికొత్త ఎస్‌యూవీ టీ-రాక్ కారును విడుదల చేసింది ఫోక్స్‌వ్యాగన్ ఇండియా. ఢిల్లీ షోరూంలో ఈ కారు రూ.19.99 లక్షలకు లభించనున్నది. 1.5 లీటర్ల పెట్రోల్ ఇంజిన్ కలిగిన ఈ కారును ఏడు గేర్లు, స్పోర్ట్ డిజైన్, భద్రత ప్రమాణాలు, టెక్నాలజీ, నూతన డ్రైవింగ్ అనుభవం కల్పించడానికి పలు మార్పులు చేసినట్లు కంపెనీ డైరెక్టర్ స్టీఫెన్ క్నాప్ తెలిపారు. ఎస్‌యూవీ పరిధిని మరింత విస్తరించాలనే ఉద్దేశంతో ఈ కారును విడుదల చేసినట్లు, దీంట్లో ఆరు ఎయిర్ బ్యాగులు, యాంటీ-లాక్ బ్రేక్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ స్టేబిలిటీ కంట్రోల్, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, రివర్స్ కెమెరా వంటి ఫీచర్స్ ఉన్నాయి.

## నిలిచిపోనున్న విమానాలు!



**న్యూఢిల్లీ, మార్చి 18:** కరోనా వైరస్ సెగ దేశీయ విమానయాన సంస్థలకు చుట్టుకుంటున్నది. ప్రస్తుత సంవత్సరం తొలి త్రైమాసికంలో విమానయాన సంస్థలకు నష్టాలు తప్పవని హెచ్చరించిన ఒక సర్వే..ఈ వైరస్ దెబ్బకు 150 విమాన సర్వీసులు నిలిచిపోనున్నట్లు వెల్లడించింది. విమానయాన సలహా సంస్థ కాపా ఇండియా బుధవారం తాజా గా విడుదల చేసిన నివేదికలో ఎయిర్ ఇండియా తప్పా మిగతా విమానయాన సంస్థలకు 500 నుంచి 600 మిలియన్ డాలర్ల నష్టం రావచ్చునని తెలిపింది. ఇప్పటికే పలు విమానయాన సంస్థలు తాత్కాలికంగా సర్వీసులను నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. 2008లో చమురు ధరలు ఆకాశమే హద్దుగా దూసుకుపోయినప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విమానయాన సంస్థలు మళ్లీ ఇప్పుడు అంతే స్థాయిలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. దేశంలో ఆరు అతిపెద్ద విమానయాన సంస్థలకు సంబంధించిన 650 విమానాలు పలు ఎయిర్‌పోర్టుల్లో నిలిచిపోనున్నాయి. ఈ వైరస్ మరింత ముదురుతుండటంతో ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచనల నేపథ్యంలో విమానాలు ఎక్కడానికి ప్రజలు జంకుతున్నారు.

# పొదుపరి గోడు పట్టదా..!

## సేవింగ్స్‌పై తగ్గుతున్న వడ్డీరేట్లు

**చిన్న మొత్తాల పొదుపు పథకాలపై రేట్ల కోతకు అవకాశం**

**ప్రభుత్వ నిర్ణయంతో అదే బాటలో బ్యాంకర్లు? సమర్థిస్తున్న ఆర్బీఐ.. వ్యతిరేకిస్తున్న డిపాజిటర్లు**



**న్యూఢిల్లీ, మార్చి 18:**

చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీరేటును కేంద్ర ప్రభుత్వం తగ్గించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాబోయే త్రైమాసికానికిగాను కోతలు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఆర్బీఐ వడ్డీరేట్ల కోతలకు అనుగుణంగా బ్యాంకులు రుణాలపై వడ్డీరేట్లను తగ్గించకపోవడానికి కారణం ప్రభుత్వ పథకాల వడ్డీరేట్లతో బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ) వడ్డీరేట్లకున్న పోటీయేనని వాదన. ఎఫ్‌డీ ఒప్పందాలపై నిర్ణయించిన వడ్డీరేటు నేపథ్యంలోనే రుణాలపై వడ్డీరేట్ల కోతకు దిగలేకపోతున్నామని, తమకంటే ఆకర్షణీయంగా ప్రభుత్వ పథకాల్లో వడ్డీరేటు ఉంటే తాము డిపాజిట్లను నష్టపోతామన్న బ్యాంకర్ల భయం.. సగటు పొదుపరి ప్రయోజనాలను దెబ్బతీస్తున్నది. బ్యాంకర్ల ఆలోచనకు తగ్గట్లే పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్), నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ) వంటి వాటిపై వడ్డీరేట్లను కేంద్రం తగ్గించే వీలుందని తెలుస్తున్నది.

### సీనియర్ సిటిజన్స్‌కు నష్టం

సేవింగ్స్ డిపాజిట్లపై వడ్డీరేట్లను తగ్గిస్తే వయోవృద్ధులకే ఎక్కువ నష్టం వాటిల్లుతుంది. తమ కష్టార్జితాన్ని భవిష్యత్తు అవసరాల నిమిత్తం ఎటువంటి హాని లేని బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలోనే అత్యధిక సీనియర్ సిటిజన్స్ పెడుతున్నారు. వడ్డీరేట్లు తగ్గితే వీరందరి ఆదాయం పడిపోతుంది. ఇప్పటికే ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ తమ 2-3 ఏండ్ల ఎఫ్‌డీలపై గత నెల నుంచి 55 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ప్రస్తుతం 6.25 శాతం వడ్డీరేటును చెల్లిస్తున్నది. నిజానికి సేవింగ్స్ వడ్డీరేట్లు ఎక్కువగా ఉంటే.. ప్రభుత్వ నిధుల సమీకరణకూ ఉపయుక్తంగా ఉంటుంది. నగదు అవసరాల కోసం ఇతర మార్గాల వైపు చూడాల్సిన అవసరం ఉండదు. ద్రవ్యలోటు లక్ష్యాలూ నెరవేరుతాయి. అయితే బ్యాంకులు రుణాలపై వడ్డీరేట్లను తగ్గించకపోతే వ్యాపార, పారిశ్రామిక రంగాలకు కరెన్సీ కష్టాలు ఎదురవుతాయి. ఇది మొత్తం దేశ జీడీపీనే దెబ్బ తీస్తుందని సర్కారు ఆందోళన.

### ఇప్పటికే తగ్గిన పీఎఫ్ వడ్డీరేటు

**ఇటీవల** కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) సైతం డిపాజిట్లపై వడ్డీరేట్లను తగ్గించిన విషయం తెలిసిందే. ఐదేండ్ల కనిష్ఠాన్ని తాకేలా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను 8.5 శాతానికే కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ పరిమితం చేసింది. ఇది పొదుపు అవకాశాలను ఎంతగానో ప్రభావితం చేసిందని నిపుణులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో చిన్న మొత్తాల పొదుపు పథకాలపైనా వడ్డీరేట్లను కేంద్రం తగ్గిస్తే.. ఆర్బీఐ ఒత్తిడి, రెపో రేటు కోతలకు అనుగుణంగా బ్యాంకులూ తమ వద్దనున్న డిపాజిట్లపై వడ్డీరేట్లను తగ్గించేస్తాయి. ఇది పొదుపరులకు దెబ్బేనని విశ్లేషిస్తున్నారు.

### బంగారమే నయమా?

బ్యాంకుల్లో డిపాజిట్లపై వడ్డీరేట్లు తక్కువగా ఉండటంతో స్టాక్ మార్కెట్ల వైపు చూడలేని సామాన్య మదుపరులంతా బంగారంపైనే ఆశలు పెట్టుకున్నారు. ధరలు అంతకంతకూ పెరుగుతుండటంతో భవిష్యత్తు బంగారుమయం అవుతుందని కలలు కంటున్నారు. అక్కెర సమయంలో ఇట్టే నగదుగా మార్చుకునే సౌకర్యం ఉండటం కూడా బంగారంపై పెట్టుబడులను పెంచుతున్నది. మరోవైపు వివిధ రకాల పెట్టుబడుల్లో ఉన్న లాభాలు తెలియకపోవడం కూడా మధ్యతరగతివారిని నష్టపరుస్తున్నదని నిపుణులు అంటున్నారు. కాబట్టి నగదు రూపేణా పొదుపు అవకాశాలను పెంచేలా ప్రభుత్వ చర్యలు చేపట్టడం కూడా దేశ ఆర్థిక వ్యవస్థకు అవసరమేనని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**చిన్న మొత్తాల పొదుపు వడ్డీరేట్లు (శాతాల్లో)**

| | ఫిబ్రవరి 2019 | ప్రస్తుతం |
|---|---|---|
| పోస్టాఫీస్ ఐదేండ్ల డిపాజిట్ | 7.8 | 7.7 |
| వయోవృద్ధుల ఐదేండ్ల పొదుపు పథకం | 8.7 | 8.6 |
| ఐదేండ్ల ఎన్ఎస్‌సీ | 8.0 | 7.9 |
| పీపీఎఫ్ | 8.0 | 7.9 |
| కిసాన్ వికాస్ పత్ర (113 నెలల మెచ్యూరిటీ) | 7.7 | 7.6 |
| సుకన్య సమృద్ధి | 8.5 | 8.4 |

## ఆర్బీఐనే అడిగింది



చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీరేట్లను తగ్గించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కూడా కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. మందగించిన దేశ ఆర్థిక వ్యవస్థను తిరిగి పరుగులు పెట్టించడంలో భాగంగా మునుపెన్నడూ లేనివిధంగా రెపో రేటును నిరుడు ఫిబ్రవరి నుంచి 135 బేసిస్ పాయింట్లు ఆర్బీఐ కోత పెట్టిన విషయం తెలిసిందే. దీంతో రుణాలపై వడ్డీరేట్లు తగ్గి పెట్టుబడులకు అవకాశం ఉంటుందని, వ్యాపార, పారిశ్రామిక కార్యకలాపాలు పుంజుకుంటాయని సెంట్రల్ బ్యాంక్ భావించింది. కానీ అలా జరుగలేదు. స్వల్ప వడ్డీరేట్ల కోతలకే బ్యాంకర్లు పరిమితమైయ్యారు. ఇది ఆర్బీఐకి ఏమాత్రం రుచించలేదు. ప్రభుత్వ వడ్డీరేట్లు ఆకర్షణీయంగా ఉన్నప్పుడు తాము తగ్గిస్తే.. డిపాజిట్లను కోల్పోవాల్సి వస్తుందని బ్యాంకర్లు భయపడటంతో ఆర్బీఐ చిన్న మొత్తాల పొదుపు వడ్డీరేట్లను తగ్గించాలని గతేడాది డిసెంబర్‌లోనే కోరింది. అయినా ఫలితం లేకపోవడంతోనే డిసెంబర్, ఫిబ్రవరి ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్ల కోతలకు బ్రేక్ ఇచ్చినట్లు తెలుస్తున్నది. కరోనా వైరస్ ధాటికి ఎకానమీ మరింత ప్రమాదంలో పడటంతో ఏప్రిల్ ద్రవ్యసమీక్షలో తప్పక వడ్డీరేట్లు తగ్గాలని ప్రభుత్వం కోరుకుంటున్నది. ప్రస్తుత పరిస్థితుల తీవ్రత దృష్ట్యా ఆర్బీఐ ఈసారి వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలే ఉన్నప్పటికీ అందుకు మరింత వీలు కల్పించాలని మోదీ సర్కారు భావిస్తున్నది. దీంతో తమ చిన్న మొత్తాల వడ్డీరేట్ల కోతలతో బ్యాంకులు వడ్డీరేట్లను తగిస్తాయన్న నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నది.

## 5 నెలల్లో రూ.35

### పెరిగిన సబ్సిడీ వంటగ్యాస్ ధర

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడి



**న్యూఢిల్లీ, మార్చి 18:** గడిచిన ఐదు నెలల్లో సబ్సిడీ వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.35.55 చొప్పున పెంచినట్లు కేంద్ర చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పాలసీ ప్రకారం దేశవ్యాప్తంగా మార్కెట్ ధరకు అనుగుణంగా 14.2 కిలోల బరువు కలిగిన 12 సిలిండర్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. వీటిపై సబ్సిడీని ఖాతాదారుడి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నది. గతేడాది అక్టోబర్ నుంచి సబ్సిడీ వంటగ్యాస్ ధర రూ.35.55 వరకు పెంచినట్లు రాజ్యసభలో సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఆయన లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. గ్యాస్ ధరలు పెంచి సామాన్యుడిపై భారం మోపుతున్నట్లు విపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఆయన కొట్టిపారేశారు. అక్టోబర్ 1న రూ.538.95గా ఉన్న సిలిండర్ ధర ప్రస్తుతం రూ.574.50గా ఉన్నది. ధరలు ఎందుకు పెంచాల్సి వచ్చిందో మాత్రం ఆయన సమాధానం ఇవ్వడానికి నిరాకరించారు. అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా ప్రతినెల గ్యాస్ సిలిండర్ ధర రూ.4 చొప్పున పెంచుతున్నది. సబ్సిడియేతర సిలిండర్ ధర రూ.805.50గా ఉన్నది.

## యెస్ బ్యాంక్‌పై మారటోరియం ఎత్తివేత


### మళ్లీ మొదలైన సేవలు

**నేటి నుంచి మూడు రోజులపాటు పనివేళలు పొడిగింపు**

**ముంబై, మార్చి 18:** యెస్ బ్యాంక్‌పై మారటోరియం ఎత్తివేశారు. 13 రోజుల ఆంక్షలు ఎట్టకేలకు తొలగిపోయాయి. బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి బ్యాంక్ అన్ని సేవల్ని పునరుద్ధరించారు. గురువారం నుంచి మూడు రోజులపాటు బ్యాంకింగ్ సమయాన్ని కూడా పొడిగించారు. పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సంస్థ యెస్ బ్యాంక్‌పై ఈ నెల 5న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మారటోరియం విధించిన విషయం తెలిసిందే. నిరుడు డిసెంబర్ ఆఖరు నాటికి రూ.2.09 లక్షల కోట్లుగా ఉన్న బ్యాంక్ డిపాజిట్లు ఈ నెల 5 నాటికి రూ.72వేల కోట్ల పడిపోయి రూ.1.37 లక్షల కోట్లకు వచ్చాయి. దీంతో ఆర్బీఐ మారటోరియం తీసుకొచ్చింది. ఒక్కో ఖాతాదారుడు రూ.50వేలకు మించి నగదును ఉపసంహరించుకోరాదని స్పష్టం చేసింది. కాగా, 'మన బ్యాంక్ సేవలు మళ్లీ అందుబాటులోకి వచ్చాయి. మీరు మునుపటిలాగే బ్యాంక్ సేవలను వాడుకోవచ్చు. మీ ఓపిక.. మీ సహకారానికి కృతజ్ఞతలు' అని యెస్ బ్యాంక్ ట్వీట్ చేసింది. 'గురువారం నుంచి శనివారం వరకు ఉదయం 8:30 గంటలకే మా శాఖలు తెరుచుకుంటాయి. వయోవృద్ధులైన ఖాతాదారుల కోసం ఈ నెల 27 వరకు సాయంత్రం 5:30 గంటలదాకా పని వేళల్ని పొడిగిస్తున్నాం' అని తెలియజేసింది. మరోవైపు మారటోరియం ఎత్తివేసిన కొద్దిసేపటికి బ్యాంకింగ్ సేవలను అందుకోలేకపోతున్నామని కొందరు కస్టమర్లు సోషల్ మీడియా వేదికగా తమ ఆందోళనల్ని వెలిబుచ్చారు. ఇంటర్నెట్, మొబైల్ బ్యాంకింగ్ సేవలు పొందలేకపోతున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో బ్యాంక్ నుంచి డిపాజిట్ల ఉపసంహరణ కొన్ని త్రైమాసికాలపాటు కొనసాగవచ్చున్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. యెస్ బ్యాంక్ పునర్‌వ్యవస్థీకరణ పథకంలో భాగంగా ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ మరో 7 బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కలిసి దాదాపు రూ.10వేల కోట్లను పెట్టుబడిగా పెడుతున్నాయి. యెస్ బ్యాంక్‌లో మెజారిటీ పెట్టుబడిదారైన ఎస్బీఐకి 48.21 శాతం వాటా దక్కనున్నది.

## రూ.10వేల కోట్లు

**కరోనా వైరస్ నేపథ్యంలో రేపు మార్కెట్‌లోకి విడుదల చేయనున్న ఆర్బీఐ**



**ముంబై, మార్చి 18:** విశ్వ మానవాళికి చావు భయాన్ని.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు నష్ట భయాన్ని కలిగిస్తున్న కరోనా వైరస్.. దేశంలో విజృంభిస్తున్న వేళ ఆర్బీఐ అప్రమత్తమైంది. సుస్థిర ఆర్థిక వ్యవస్థ రక్షణార్థం శుక్రవారం బహిరంగ మార్కెట్ ద్వారా రూ.10,000 కోట్లను అందుబాటులోకి తేనున్నది. 'కోవిడ్-19 (కరోనా వైరస్) మహమ్మారితో ఆర్థిక మార్కెట్లకు ముప్పు పొంచి ఉన్నది. స్థిరత్వం లోపించకుండా, సాధారణంగా నడిచేందుకు కావాల్సిన చర్యలను తీసుకుంటున్నాం' అని ఓ ప్రకటనలో బుధవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తెలిపింది. బహుళ ధరల పద్ధతి వినియోగిస్తూ వేర్వేరు సెక్యూరిటీల వేలం ద్వారా రూ.10,000 కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీల కొనుగోలుకు దిగుతున్నట్లు ఆర్బీఐ వెల్లడించింది. ఫిబ్రవరి 15, 2022 మెచ్యూరిటీపై 8.20 శాతం, ఏప్రిల్ 16, 2023పై 7.37 శాతం, జనవరి 28, 2024పై 7.32 శాతం, మే 25, 2025 మెచ్యూరిటీపై 7.72 శాతం చొప్పున కూపన్ రేటుతో సెక్యూరిటీలను కొనుగోలు చేస్తామని వివరించింది. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ బలోపేతానికి ఈ నెల 16న 2 బిలియన్ డాలర్లను రూపాయి కొనుగోలు ద్వారా మార్కెట్‌కు అందించింది ఆర్బీఐ. 23న మరో విడుతలో ఇంకా 2 బిలియన్ డాలర్లను అమ్మనున్నది.

### కరోనా బాధిత రంగాల కోసం..


కరోనా వైరస్ వ్యాప్తితో దెబ్బతిన్న బ్యాంకులు, విమానయానం, హోటల్ తదితర రంగాలకు ఊరటనివ్వాలని అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు ఆర్బీఐ యోచిస్తున్నట్లు సమాచారం. ఇందులోభాగంగానే మొండి బకాయిల (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) వర్గీకరణ నిబంధనల్ని సడలించే అవకాశాలున్నట్లు తెలుస్తున్నది. ఓ రుణాన్ని మొండి బకాయిగా వర్గీకరించేందుకున్న సమయాన్ని 30 నుంచి 60 రోజులు పెంచాలన్నదానిపై చర్చిస్తున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది.

## అత్యంత విలువైన కంపెనీగా టీసీఎస్

**ముంబై, మార్చి 18:** దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్)..రిలయన్స్ ఇండస్ట్రీస్‌ను దాటి దేశంలో అత్యంత విలువైన కంపెనీగా అవతరించింది. బుధవారం స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి టీసీఎస్ మార్కెట్ క్యాపిటలైజేషన్(ఎం-క్యాప్) రూ.6,19,499.95 కోట్లకు చేరుకున్నది. ఇదే సమయంలో ఆర్ఐఎల్ రూ.6,14,179.93 కోట్ల కంటే రూ.5,320.02 కోట్లు అధికం. తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్న ఆర్ఐఎల్ షేరు ధర 3.97 శాతం తగి రూ.968.85 వద్ద నిలిచింది. ఇదే సమయంలో టీసీఎస్ షేరు కూడా స్వల్పంగా తగ్గి రూ.1,650.95 వద్ద ముగిసింది.

## పట్టుబిగిస్తున్న బేర్

**29 వేల దిగువకు సెన్సెక్స్ • 8,500 కిందికి పడిపోయిన నిఫ్టీ**




**ముంబై, మార్చి 18:** దేశీయ స్టాక్ మార్కెట్లో బేర్ పట్టుకొనసాగుతున్నది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలతో బుధవారం ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు వెనువెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. భారత్‌లో కరోనా వైరస్ బారిన పడుతున్నవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటంతో మదుపరుల్లో ఆందోళనను మరింత పెంచింది. దేశీయ వృద్ధి అంచనాన్ని తగ్గిస్తున్నట్లు అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఎస్ అండ్ పీ ప్రకటించడం, టెలికం సంస్థల ఏజీఆర్ బకాయిలపై మళ్లీ సమీక్షించే అవకాశం లేదని సుప్రీంకోర్టు స్పష్టంచేయడం పతనానికి ఆజ్యంపోసింది.

బీఎస్ఈ సెన్సెక్స్ ప్రధాన సూచీ సెన్సెక్స్ 29 వేల దిగువకు పడిపోగా, నిఫ్టీ కీలక స్థాయి 8,500 మార్క్ కిందకు పడిపోయింది. లాభాల్లో ప్రారంభమైన 30 షేర్ల ఇండెక్స్ సూచీ తీవ్ర ఊగిసలాటల మధ్య 2,488.72 పాయింట్ల శ్రేణిలో కదలాడి చివరకు 1,709.58 పాయింట్లు(5.59 శాతం) పతనం చెంది 28,869.51 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా 498.25 పాయింట్లు(5.56 శాతం) క్షీణించి 8,468.80కి చేరుకున్నది.

### మూడు రోజుల్లో 16 శాతం డౌన్

కరోనా వైరస్ భయాలు చుట్టుముట్టడంతో ఈవారం ప్రారంభం నుంచి సెన్సెక్స్, నిఫ్టీలు 15 శాతానికి పైగా పతనం చెందాయి. గత మూడు సెషన్లలో నిఫ్టీ 1,548 పాయింట్లు(15.55 శాతం), సెన్సెక్స్ 5,234 పాయింట్లు(16 శాతం) చొప్పున నష్టపోయాయి. దీంతో మదుపరులు రూ.15.72 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. గత మూడు రోజుల్లో బీఎస్ఈలో లిస్టైన కంపెనీలు రూ.15,72,913.52 కోట్లు కోల్పోయి రూ.1,13,53,329.30 కోట్లకు జారుకున్నది. కేవలం ఓఎన్జీసీ, ఐటీసీలు మాత్రమే లాభపడగా..మిగతా అన్ని సంస్థల షేర్లు కుదేలయ్యాయి. ఇండస్ఇండ్ బ్యాంక్ 24 శాతం పడిపోయి టాప్‌లూజర్‌గా నిలిచింది. పవర్ గ్రిడ్, కొటక్ బ్యాంక్, బజాజ్ ఫిన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హీరో మోటోకార్ప్, ఎన్టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, మహీంద్రా, టైటన్, నెస్లె, ఏషియన్ పెయింట్స్, ఎయిర్‌టెల్, ఎల్అండ్‌టీ, అల్ట్రాటెక్ సిమెంట్, మారుతి, బజాజ్ ఆటో, రిలయన్స్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, ఐసీఐసీఐ బ్యాంక్, టెక్ మహీంద్రా, సన్‌ఫార్మా, టీసీఎస్, ఎస్బీఐలు నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే బ్యాంకింగ్, టెలికం షేర్లు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి.

### టెలికం రంగ షేర్లకు సుప్రీం దెబ్బ

ఏజీఆర్ బకాయిలపై మళ్లీ సమీక్షించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టంచేయడంతో ఈ రంగ షేర్లు కుదేలయ్యాయి. వొడాఫోన్ ఐడియా అయితే ఏకంగా 34.85 శాతం పడిపోయి రూ.3.16కి జారుకోగా, భారతీ ఎయిర్‌టెల్ 6.14 శాతం తగ్గి రూ.426.20కి పడిపోయాయి. బీఎస్ఈ టెలికం ఇండెక్స్ 9.48 శాతం పతనం చెందింది.

# వృద్ధుల కరోనా వ్యథలు



ఈ కరోనా కాలంలో ఇంటి నుంచి బయట అడుగుపెట్టడానికి యువత కూడా భయపడుతున్నది. అలాంటిది వృద్ధాప్యంలో ఉన్నవారికి ఈ మహమ్మారి కరోనా వచ్చిందంటే వారి పరిస్థితి వర్ణనాతీతం. అందుకే వారి జాగ్రత్తల్లో వారు ఉంటూ ..ఇంటి పట్టునే కాలం గడుపుతారు. కానీ ఇంట్లో సరుకులు అయిపోవడంతో మార్కెట్‌కు వచ్చారు అమెరికాలోని ఒరెగాన్కు‌కు చెందిన 80 ఏండ్ల దంపతులు. అయితే కారు దిగి మార్కెట్లో అడుగు పెట్టాలంటే భయపడుతున్నారు. ఇంతలో రెబెకా మెహ్రా అనే అమ్మాయి అటుగా వచ్చింది. ఆమెను 'సరుకులు కొని తీసుకువస్తావా' అని దీనంగా అడిగారు. వారి కండ్లలో నీరు తిరుగుతుండడం గమనించిందా అమ్మాయి. సరేనని సరుకుల లిస్ట్ తీసుకొని కొనుగోలు చేసి వారికందించింది. మొత్తం వంద డాలర్లు బిల్లు అయింది. అమ్మాయికి వారు కృతజ్ఞతలు తెలుపుతూ ఒక మాట చెప్పారు. 'మేము మార్కెట్‌కి వచ్చి 45 నిమిషాలు అవుతున్నది. కానీ ఎవరిని అడగాలో అర్థం కాలేదు. నిన్ను చూడగానే మంచి అమ్మాయిలా కనిపించావు. అందుకే సాయం అడిగాం. చాలా థ్యాంక్స్ అమ్మా' అని మెహ్రాను ఆశీర్వదించారు. ఈ సంఘటనను మెహ్రా తన ట్విటర్‌లో పేర్కొన్నది. 'కరోనాకు భయపడుతున్న వృద్ధులకు సాయం చేసి మంచి పని చేశావ్' అంటూ మెహ్రాపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# ఆన్‌లైన్ యుద్ధం





**కరోనా. ఇప్పుడిది ప్రపంచాన్ని వణికిస్తున్న వైరస్. 'వందలాది మందిని బలిగొన్న ఈ వైరస్‌ను ఎక్కడికక్కడే అంతమొందిద్దాం' అంటున్నారు విద్యార్థులు. అందుకు ఆన్‌లైన్‌ను వేదికగా చేసుకున్నారు టీచర్లు. వారి కృషిని ఫేస్‌బుక్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సాండ్‌బర్గ్ సైతం ప్రశంసిస్తున్నారు.**

గుజరాత్‌లో టీచర్లు, విద్యార్థులు కరోనా కట్టడికి ఆన్‌లైన్ యుద్ధం చేపట్టారు. పాఠశాలల్లో కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకోవడానికి ఆన్‌లైన్‌లోనే పాఠాలు బోధిస్తున్నారు. 'చేతులు ఎలా కడుక్కోవాలి?. షేక్ హ్యాండ్ ఇవ్వొచ్చా లేదా? హ్యాండ్ శానిటైజర్ వాడకం ఎలా? దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు ఏం చేయాలి. మాస్కులు అవసరమా లేదా?' అనే విషయాల్ని బోధిస్తున్నారు. విద్యార్థులు సైతం షేక్ హ్యాండ్ వద్దంటూ వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నారు. విద్యార్థులు ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేసిన ఓ వీడియోను ఫేస్‌బుక్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సాండ్‌బర్గ్ షేర్ చేశారు. కరోనా వ్యాప్తిని ఆన్‌లైన్ సాధనాలు ఉపయోగించి అడ్డుకుంటున్న ఆ పిల్లల్ని ప్రశంసించారు.

## వంటింటి చిట్కాలు



- పాస్తా అతుక్కోకుండా రావాలంటే.. దాన్ని ఉడకబెట్టిన నీళ్లలో కొంచెం నూనె వేయాలి. ఉడికిన తర్వాత చన్నీళ్లతో కడిగి పెట్టుకోవాలి.
- తోడు లేకపోతే పాలను గోరువెచ్చగా చేసి, అందులో రెండు పచ్చిమిర్చీలు వేసి, మూత పెట్టి 12 గంటలపాటు ఉంచితే పెరుగు తోడుకుంటుంది.
- చాలామంది కూరల్లో వెల్లుల్లిని చిదిమి వేస్తుంటారు. దీనికంటే వెల్లుల్లిపేస్ట్ వేయడం మంచిది. దీని వల్ల రుచి, వాసన పెరుగుతుంది.
- టీ పెట్టిన తర్వాత ఆ పొడితో అద్దాలు, చెక్క వస్తువులు శుభ్రం చేసుకోవచ్చు.

# హాల్ ఆఫ్ నేషన్స్‌లో ఇండియన్ ట్రాన్స్



మన దేశానికి చెందిన ప్రముఖ ట్రాన్స్ ఉమెన్ నేసారా రాయ్ ప్రతిష్టాత్మక 'హాల్ ఆఫ్ నేషన్స్'లో చోటు సంపాదించారు. ఇది వాషింగ్టన్ డీసీలోని జాన్ ఎఫ్ కెన్నెడీ సెంటర్ ఫర్ ది పెర్ఫార్మింగ్ ఆర్ట్స్‌లో ఉన్నది. నేసారా 'ట్రాన్స్ జెండర్ ఇండియా' అనే పోర్టల్‌ను నిర్వహిస్తున్నారు. ఇది దేశవ్యాప్తంగా ట్రాన్స్‌జెండర్స్ ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపుతున్నది. లింగమార్పిడి చేయించుకున్నవారికి మార్గదర్శిగా ఉంటూ సలహాలు, సూచనలు అందిస్తున్నారు నేసారా. ఈనేపథ్యంలో హాల్ ఆఫ్ నేషన్స్‌లో చోటు సంపాదించారు. దీనితోపాటుగా మరో ఘనత కూడా సొంతం చేసుకున్నారు నేసారారాయ్. అమెరికాకు చెందిన 'వైటల్ వాయిసెస్' అనే సంస్థ.. యేటా వివిధ విభాగాల్లో పోరుసల్పుతున్న వందమంది శక్తిమంతులైన మహిళలను ఎంపిక చేసి, వారి రేఖా చిత్రాలను వేయిస్తుంటుంది. ఈ జాబితాలో నేసారా రాయ్ పేరు కూడా ఉన్నది. ఇందుతో మెలిండా గేట్స్, మలాలా యూసఫ్‌జాయ్, గ్రేటా థన్‌బెర్గ్, బెయోన్స్, సెరెనా విలియమ్స్ వంటి స్ఫూర్తిదాయక మహిళల ఇల్లిస్ట్రేషన్స్ ఉన్నాయి.

**2013 మార్చి, బాలానగర్, హైదరాబాద్**

**మధ్యాహ్నం కావొస్తున్నది. బాలానగర్‌లో ఎప్పటిలాగే పరిగెడుతున్న ట్రాఫిక్. ఓ వీధిలో నుంచి రోడ్డు మీదికి ఎక్కిందో బైక్. ఆ బైక్ వెనకాల కూర్చొనుంది 20 ఏండ్ల టెన్నిస్ ప్లేయర్ సత్యవేణి. బైక్ నడుపుతున్నది ఆమె సోదరుడే. కొద్దిసేపట్లో, ఎల్బీ స్టేడియంలో జరగాల్సిన టోర్నమెంట్‌కు వెళ్తున్నది సత్యవేణి. చిన్నప్పటి నుంచీ టెన్నిసే ప్రపంచంగా పెరిగిన యువతి ఆమె . స్పోర్ట్స్ కోటాలోనే కాలేజీ సీటు సాధించింది. జాతీయ స్థాయిలో 15వ ర్యాంక్ కలిగిన ప్లేయర్ కూడా. ఆమె ఆ రోజు ఎంతో ఆత్మవిశ్వాసంతో టెన్నిస్ పోటీలకు బయల్దేరింది.**

**ఏ ప్రమాదమూ జరగకపోతే సమయానికి అక్కడికి చేరుకొనేదే. టోర్నమెంట్‌లో పాల్గొనేదే.. కానీ అలా జరగలేదు!**



# ఈమె భయాన్ని జయించింది



## ఎన్జీవో..

బైక్ పెయింటింగ్‌లో రాణిస్తున్న సత్యవేణి తనలాంటి అమ్మాయిలకు ఆసరాగా హస్కీ కేపర్స్ అనే ఎన్జీవో ప్రారంభించింది. దీనిద్వారా ఆడపిల్లలకు బైక్ నేర్పుతుంది. సెల్ఫ్ డిఫెన్స్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నది. ఉపాధి మార్గాలు వెతుక్కుంటున్న వారికి, సొంత వ్యాపార ఆలోచనలతో ఉన్న వారికి తమ ఎన్జీవో సాయం చేస్తుందని సత్యవేణి చెప్తున్నది.

**కొన్ని నెలల తర్వాత**

సత్యవేణి ఇంట్లో ఒంటరిగా ఉంది. ఆ రోజు ఎల్బీ స్టేడియానికి వెళ్తున్నప్పుడు వేసుకున్న స్పోర్ట్స్ షూస్ ఆమె ఎదురుగా పడి ఉన్నాయి. విషాదం నిండిన ముఖం. సర్వస్వం కోల్పోయిన దు:ఖం. ఆమె ఎవరితో మాట్లాడడం లేదు. షూస్ వైపే చూస్తూ ఏడుస్తున్నది. మరుక్షణం ఆవేశంగా తీసి విసిరికొట్టింది. ముఖాన్ని దాచుకుంది. అరుస్తున్నది. తల్లి ఆమె దగ్గరకు వచ్చింది. ఎంత చెప్పినా సత్యవేణి వినిపించుకోవడం లేదు. రోజులు గడుస్తున్నాయి. సత్యవేణి గది నుంచి బయటకు రావడం లేదు. టెన్నిస్‌కు పూర్తిగా దూరమయ్యాననే తీవ్రమైన డిప్రెషన్‌తో తనను తాను నిర్బంధించుకుంది. బైక్ ప్రయాణం ఫోబియాగా మారిపోయిందామెకు. ఆ రోజు టెన్నిస్ టోర్నమెంట్‌కు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదం ఈ విషాదంలోకి నెట్టివేసింది. ఆ ప్రమాదంలో సత్యవేణి మోకాలి ఎముకను కోల్పోయింది. కానీ టెన్నిస్ మీద ప్రేమను మాత్రం కాదు.. సర్జరీ తర్వాత సత్యవేణి మళ్లీ టెన్నిస్ కోర్టులో అడుగుపెట్టింది. ఎక్కువ రోజులు ఆటకు దూరం ఉండడంతో ఆమె ర్యాంక్ పడిపోయింది. అయినా పట్టుదలతో మళ్లీ మంచి ర్యాంకు సాధించింది. ఐదారు నెలలు గడిచాయి. అంతా బాగుందనే అనుకుంది. కానీ మోకాలిలో నొప్పి మొదలైంది. డాక్టర్‌ను సంప్రదిస్తే సర్జరీ వికటించిందని చెప్పారు. రెండో సర్జరీతో నయం అవుతందనీ.. కానీ జాగ్రత్తలు అవసరమన్నారు. ఆ సర్జరీ తర్వాత కూడా టెన్నిస్ కోర్టులో అడుగుపెట్టింది. అయినా ఏదో ఫీలింగ్ వెంటాడింది. 'ఈ సర్జరీతో ఆమె ఎక్కువ కాలం టెన్నిస్ ఆడలేదు. ఎప్పుడో ఒకసారి నొప్పి భరించలేక ముగింపు ఇవ్వాల్సిందే' అని డాక్టర్లు చెప్పారు. ఈ విషయం ఆమెను తీవ్రంగా బాధించింది. కొద్ది రోజుల్లోనే టెన్నిస్ నుంచి అతికష్టంగా తప్పుకుంది. డిప్రెషన్‌కు గురైంది. ప్రమాదాన్ని తలుచుకుంటూ బైక్ అంటేనే వణికిపోయే స్థాయికి వెళ్లింది. కానీ ఇప్పుడామె ప్రొఫెషనల్ బైక్ రైడర్, ట్రెయినర్, బైక్ పెయింటర్. రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీతో కలిసి పని చేస్తున్నది. అవును! 'ఆమె భయాన్ని జయించింది'..

సత్యవేణి తీవ్రమైన డిప్రెషన్‌లో ఉన్న సమయం. తల్లి తన బిడ్డను అలా ఎంతోకాలం చూస్తూ ఉండదలుచుకోలేదు. జీవితాన్ని గెలవాలంటే ముందు భయాన్ని జయించాలి.. సత్యవేణికి బైక్ అంటే భయం. దాన్ని పోగ్గొట్టాలని నిర్ణయించుకుంది తల్లి. కూతురి కోసం రాయల్ ఎన్‌ఫీల్డ్ బండి కొనుక్కొచ్చింది. దాన్ని తీసుకెళ్లి నేర్పించాలన్నది ఆమె ఆలోచన. మొదట్లో సత్యవేణి సహకరించేది కాదు. 'ఇంట్లోనుంచి వెళ్లిపో, బైక్ నేర్చుకుంటేనే ఇంటికి రా' అని తల్లి కాస్త కటువుగానే చెప్పింది. దీంతో చేసేదేమీ లేక సోదరుని సాయంతో రాయల్ ఎన్‌ఫీల్డ్ నడపడం నేర్చుకుంది. కొద్ది రోజులకే రైడింగ్ మీద ఆసక్తి పెరిగింది. బైక్ అంటే భయం పోయింది. మళ్లీ సాధారణ మనిషి అయింది. అంతలోపే మనసు కళలవైపు లాగింది. చిన్నప్పుడు వేసిన పెయింటింగ్స్ గుర్తుకు వచ్చాయి. ఇంకేముంది బైక్, పెయింటింగ్స్ కలిపి కొట్టింది. ఓ వెలుగు రేఖ స్పష్టంగా కనిపించింది... సత్యవేణికి.







సత్యవేణి సోదరి సంగీత. యానిమేషన్‌లో నిపుణురాలు. ఆమె సాయంతో పెయింటింగ్ ప్రారంభించింది. ముఖ్యంగా సంగీత డిజైన్లను బైకు, హెల్మెట్స్ మీద త్రీడీ సత్యవేణి పెయింటింగ్స్ వేసింది. వాటిని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసింది. కొద్ది రోజుల్లోనే పాపులర్ అయ్యాయి. బైక్ ప్రేమికులు సత్యవేణిని సంప్రదించారు. అప్పుడే దీన్ని చిన్న వ్యాపారంగా మల్చుకోవాలనే ఆలోచన కలిగింది. Womeneoteric customs ప్రారంభించింది. దేశవ్యాప్తంగా ఈ పెయింటింగ్స్ పాపులర్ అయ్యాయి. ఆమె క్రియేటివిటీ పెద్ద కంపెనీలకూ తాకింది. వరల్డ్ ఎగ్జిబిషన్లలో సత్యవేణి బైక్, హెల్మెట్ పెయింటింగ్స్ ప్రదర్శనకు నిలిచాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీ ఈమెను సంప్రదించింది. తమ బైక్స్‌పైనా ఈ పెయింటింగ్స్ వేయాలని కోరింది. ప్రస్తుతం ఆ పనిని కూడా సత్యవేణి చేస్తున్నది. ముఖ్యంగా లైవ్ పెయింటింగ్‌లో ఆమెది అందె వేసిన చేయి. ఒక ప్రదేశానికి వెళ్లి అక్కడి వాతావరణాన్ని అచ్చంగా బైక్‌పై వేయడంలో ఆమెది అరుదైన శైలి. దేశంలోని పలు ప్రదేశాల నుంచి బైక్ ప్రియులు హెల్మెట్లను, పెట్రోల్ ట్యాంకులను సత్యవేణి చిరునామాకు కోరియర్ ద్వారా పంపుతారు. కస్టమర్ ఆలోచనకు తగ్గ పెయింటింగ్ వేస్తుంది. ఇప్పటి వరకూ సత్యవేణి మూడువందలకు పైగా హెల్మెట్స్, బైక్స్‌పై పెయింటింగ్స్ పూర్తి చేసింది.

### ఆ రోజు ఏం జరిగింది?

సత్యవేణి జీవితం మారిపోవడానికి కారణం ఓ రోడ్డు ప్రమాదం. సోదరునితో కలిసి వెళ్తున్న బైక్ ప్రమాదానికి గురైంది. దీనికి ఓ వ్యక్తి నిర్లక్ష్యం కారణం. ఎవరో అతను. పూర్తిగా మద్యం తాగి స్కూటర్‌ను రోడ్డు మీద పార్క్ చేశాడు. దాని పక్కనే తూలుతూ నిలబడ్డాడు. అటుగా బైక్‌మీద వస్తున్న సత్యవేణి, సోదరుడు దాన్ని హఠాత్తుగా గమనించాడు. బైక్‌ను నియంత్రించడానికి ప్రయత్నించాడు. కానీ సాధ్యం కాలేదు. ఎదురుగా ఉన్న స్కూటర్‌ను ఢీ కొట్టి అదుపుతప్పింది వీళ్ల బండి. సత్యవేణి మోకాలికి బలమైన దెబ్బ తగిలింది. సమస్య శస్త్రచికిత్స వరకూ వెళ్లింది. మద్యం తాగిన ఆ వ్యక్తి రోడ్డు మీద లేకపోయినా, అతను స్కూటర్‌ను నిర్లక్ష్యంగా రోడ్డు మీద పెట్టకపోయినా ఆ ప్రమాదం జరిగి ఉండేది కాదు. అనుకున్నట్టుగానే సత్యవేణి టెన్నిస్ టోర్నమెంట్‌కు హాజరై ఉండేది. పతకాల పంట పండించేది. అయినా ఏదైతేనేం.. ఆమె భయాన్ని జయించింది. కొత్త జీవితానికి దారులు వెతుక్కుంది.

...✍ వినోద్ మామిడాల

# ఇడ్లీ తిని.. పోటీ గెలిచి



మీరు ఇడ్లీ ప్రియులా? ఇష్టంగా తింటారా? అయినా సరే ఈ 60 ఏండ్ల మహిళ ముందు మీరు వెనక్కి తగ్గాల్సిందే. ఎందుకంటే ఈమె ఇడ్లీ పోటీల్లో విజేత. తను ఎలా విజయం సాధించిందో తెలిస్తే ఆశ్చర్యపోతారు. మైసూర్‌లో దసరా సందర్భంగా మహిళల కోసం ప్రత్యేకంగా ఇడ్లీ తినే పోటీలు నిర్వహించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. ఇందులో సరోజమ్మ అనే 60 ఏండ్ల మహిళ విజయం సాధించింది. కేవలం ఒక్క నిమిషంలో ఆరు ఇడ్లీలు లాగించి విజేతగా నిలిచింది. రాష్ట్ర అధికారిక పండుగ నేపథ్యంలో నిర్వహించిన పోటీల్లో సరోజమ్మ విజేత కావడంతో ఆమె పాపులర్ అవుతున్నది.



# సమీరా స్క్రబర్లు

**అశోక్, జై చిరంజీవ సినిమాల తర్వాత హిందీ పరిశ్రమకు వెళ్లింది సమీరా రెడ్డి. ఆ తర్వాత పెండ్లితో సినిమాలకు పూర్తిగా దూరమైంది. ఇప్పుడు ఇద్దరు పిల్లలతో బిజీబిజీ లైఫ్‌ని గడుపుతూ, మధ్యమధ్య సోషల్ మీడియా ద్వారా చిట్కాలు చెబుతున్నది.**

సోషల్ మీడియాలో ఇప్పుడు సమీరా ఒక సంచలనమనే చెప్పాలి. తన గురించి ఎవరు ఏమన్నా అస్సలు ఊరుకోదు. బాడీషేమింగ్ విషయంలో ఆమె ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నది. వాటికి చెంప పెట్టుగానే సమాధానాలు ఇచ్చింది. మేకప్ ఎలా చేసుకోవాలి, ఎలాంటి కన్సీలర్లు వాడాలి.. అనేవి ఇప్పుడు సోషల్‌మీడియా వేదికగా చెబుతూ వస్తున్నది. ప్రస్తుతం కరోనా ఎఫెక్ట్‌తో చాలామంది శానిటైజింగ్ కోసం వేలు పోసి మరీ శానిటైజర్లను వాడుతున్నారు. పైగా వ్యక్తిగత శుభ్రత కోసం స్క్రబర్లు ఉపయోగిస్తున్నారు. వీటిని కూడా ఇంట్లో దొరికే వస్తువులతో ఎలా తయారు చేసుకోవాలో చెప్పే వీడియో నెట్టింట వైరల్ అవుతున్నది. 'సబ్‌సే సస్తా' పేరుతో పోస్ట్ చేసిన ఈ వీడియోలో.. క్యాస్టర్ షుగర్, నిమ్మరసంతో పాటు కొన్ని ఎసెన్షియల్ ఆయిల్స్‌ని కలిపితే వండర్స్ జరుగుతాయని చెప్పింది. మరికొన్ని టిప్స్ కూడా ఈ వీడియోలో పొందుపరిచింది. ఈ హోమ్‌ట్యూషన్‌ని ఫాలో అయ్యే వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతూ ఉందంటే అతిశయోక్తి కాదేమో!

# పులి పిల్లల సంరక్షణలో లేడీ ఆఫీసర్



**సమర్థులైన ఆఫీసర్లు మనుషులే కాదు జంతువుల ప్రాణాలనూ రక్షించడంలో ముందుంటారు. 45 రోజుల పాటు ఓ అడవిలోని పులులను కాపాడేందుకు నేషనల్ టైగర్ కన్‌జర్వేషన్ ఆథారిటి ఒక టీమ్‌ను ఏర్పాటు చేసింది. అందులో ఒక లేడీ ఆఫీసర్ కూడా ఉన్నది.**




మహారాష్ట్రలో దాదాపు ఏడాదిన్నర క్రితం ఒక పులిని కాల్చి చంపారు. ఆ పులికి పిల్లలున్నాయి. వీటి వయసు పెరిగే కొద్దీ దగ్గర్లోని గ్రామాల ప్రజలపైకి దాడికి దిగవచ్చనీ, కొన్నిసార్లు వాటి ప్రాణానికే హాని కలుగవచ్చనీ అధికారులు అప్రమత్తం అయ్యారు. వాటిని సురక్షితంగా ఉంచేందుకు ఒక టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ టీమ్‌లో 28 ఏండ్ల జాతీయ వన్య సంరక్షణాధికారి సిదమ్ ప్రమీలా ఇస్టార్ల్ ఒకరు. పులులను సంరక్షించేందుకు 45 రోజుల గడువుంది. రాత్రులు, పగలు తేడా లేకుండా పూర్తి బాధ్యత వహించాలి. ఇందులో భాగంగా ప్రమీలా తెల్లవారు జామున 3 గంటలకే బాధ్యతలు చేపడుతుంది. 80 హెక్టార్ల విస్తీర్ణంలోని రేంజ్ పరిధిలో విధులు నిర్వహిస్తుంది. ఆ పులిపిల్లలు బతికే ఉన్నట్టు నిర్ధారించిన ఆమె వాటిని వెతికే పని మొదలు పెట్టారు. ఇలాంటి ఉద్యోగాలు ధైర్యంతో కూడుకున్నవనీ, ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తాయని అంటారామె. ఈ 45 రోజుల్లో ఏది ఏమైనా పులి పిల్లలను క్షేమంగా కనుగొంటానని సవాలు చేస్తున్నది ప్రమీలా.


రకుల్‌ప్రీత్‌సింగ్

## మాస్కులతో షూటింగ్

కరోనా వైరస్ కారణంగా తారలంతా తమ షూటింగ్‌లకు బ్రేక్ తీసుకున్నారు. రకుల్‌ప్రీత్‌సింగ్ మాత్రం ముందస్తు జాగ్రత్తలతో షూటింగ్‌లో పాల్గొన్నది.మాస్క్ ధరించి శానిటైజర్స్ బాటిల్స్‌ను చూపిస్తూ తన టీమ్‌తో కలిసి షూటింగ్ లొకేషన్‌లో దిగిన ఓ ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్‌చేసింది. 'ఈ రోజు షూటింగ్‌ను రద్దు చేయలేకపోయాం. యూనిట్ మొత్తం జాగ్రత్తలు పాటిస్తున్నాం. సానుకూలంగా ఆలోచిస్తూ చిరునవ్వుతో కరోనాను జయించండి' అంటూ వ్యాఖ్యానించింది రకుల్‌ప్రీత్‌సింగ్. షూటింగ్ అనంతరం స్వీయ నిర్బంధంలోకి వెళ్లిపోయింది రకుల్ ప్రీత్‌సింగ్. ఇంట్లోనే యోగా చేస్తూ కనిపించింది.

## అదే అతిపెద్ద పుట్టినరోజు కానుక


రామ్‌చరణ్

కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు తన పుట్టినరోజు వేడుకలను జరుపవద్దని అభిమానుల్ని కోరారు రామ్‌చరణ్. 'మీకు నా మీద ఉన్న ప్రేమ, నా పుట్టినరోజుని పండుగగా జరుపడానికి మీరు పడుతున్న కష్టాన్ని నేను అర్థం చేసుకోగలను. మనం ఉన్న ఈ అసాధారణ పరిస్థితులు మీకు తెలియనివి కాదు. ఇలాంటి సందర్భంలో మనం సాధ్యమైనంత వరకు జనసాంద్రత తక్కువగా ఉండేలా చూసుకోవడం మంచిది. ఈ సంవత్సరం నా పుట్టినరోజు వేడుకలను విరమించుకోవాల్సిందిగా నా మనవి. మీరంతా మన అధికారులకు సహకరించి కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టే విధానాలు ప్రజలకి అర్థమయ్యే విధంగా తెలియజేసి మీ వంతు సామాజిక బాధ్యతను నెరవేర్చితే అదే నాకు ఈ సంవత్సరం మీరు ఇచ్చే అతిపెద్ద పుట్టినరోజు కానుక' అని రామ్‌చరణ్ బుధవారం ప్రకటించారు.

# రాశీ తీన్‌మార్


రాశీఖన్నా

తెలుగు చిత్రసీమలో విజయవంతమైన జోడీగా పేరుతెచ్చుకున్నారు సాయితేజ్, రాశీఖన్నా. వీరిద్దరి కలయికలో వచ్చిన 'సుప్రీమ్', 'ప్రతిరోజూ పండగే' చిత్రాలు కమర్షియల్‌గా చక్కటి వసూళ్లను సాధించాయి. సాయితేజ్, రాశీఖన్నా మూడో సారి కలిసి ఓ సినిమా చేయబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. సాయితేజ్ కథానాయకుడిగా దేవా కట్టా దర్శకత్వంలో ఓ సినిమా రూపుదిద్దుకోనున్నది. ఇటీవలే పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ప్రారంభమైంది. ఇద్దరూ కథానాయికలకు చోటున్న ఈ సినిమాలో ఓ హీరోయిన్‌గా నివేథా పేతురాజ్‌ను చిత్రబృందం ఎంపికచేసింది. మరో నాయికగా రాశీఖన్నాను తీసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవలే దర్శకుడు దేవాకట్టా ఆమెను కలిసి కథను వినిపించినట్లు తెలిసింది. రాశీఖన్నా ఈసినిమాలో నటించడానికి సుముఖంగా ఉన్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం రాశీఖన్నా తమిళంలో 'అరాన్మణై-3'లో కథానాయికగా నటిస్తున్నది.

## 'విజయ' రహస్యం అదే


విజయ్ దేవరకొండ


అసమాన అభినయం, విలక్షణ వ్యక్తిత్వంతో అచిరకాలంలోనే తెలుగులో చిత్రసీమలో అగ్రకథానాయకుడిగా పేరుతెచ్చుకున్నారు విజయ్‌దేవరకొండ. విభిన్నమైన కథాంశాలతో సినిమాలు చేస్తూ యువతరంలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నారు. తాజాగా ఓ ఆంగ్ల వార్త పత్రిక నిర్వహించిన టాలీవుడ్ '30 మోస్ట్ డిజైరబుల్ మెన్ 2019' జాబితాలో విజయ్‌దేవరకొండ మొదటిస్థానంలో నిలిచారు. ఈ లిస్ట్‌లో నంబర్‌వన్ ర్యాంకును విజయ్ దేవరకొండ సొంతం చేసుకోవడం ఇది రెండోసారి. 2018లోనూ ఆయన మొదటిస్థానంలో నిలిచారు. రొటీన్‌కు భిన్నమైన ఇతివృత్తాల్ని ఎంపికచేసుకోవడం,పూర్తివిశ్వాసంతో ఎంచుకున్న రంగంలో శ్రమించడమే తన విజయరహస్యాలుగా భావిస్తానని విజయ్‌దేవరకొండ చెబుతున్నారు. ఫ్యాషన్స్ విషయంలో తన ఆలోచనే తాను ధరించే డ్రెస్సింగ్ స్టైల్‌ను నిర్ణయిస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియన్ చిత్రంలో నటిస్తున్నారు విజయ్‌దేవరకొండ. ఇటీవల ముంబాయిలో కీలక సన్నివేశాల్ని చిత్రీకరించారు.

## స్వీయ నిర్బంధంలో తారలు


ప్రగ్యాజైస్వాల్


అమితాబ్‌బచ్చన్


ప్రణీత


ప్రియదర్శి


శ్రద్ధాదాస్

కరోనా భయంతో ప్రజలంతా స్వీయనిర్బంధపు బాట పడుతున్నారు. బాహ్య ప్రపంచానికి దూరమవుతున్నారు. కొందరు సినీ తారలు ప్రస్తుతం స్వచ్ఛందంగా క్యారంటైన్‌ను అనుసరిస్తున్నారు. ప్రగ్యాజైస్వాల్ 'క్యారంటైన్ తొలి రోజు' అంటూ స్విమ్మింగ్‌పూల్‌లో సేదతీరుతున్న ఫొటోలనుపంచుకున్నది. ప్రణీత స్వీయ నిర్బంధపు సమయంలో వర్కవుట్స్‌కు మాత్రం దూరం కాలేదు. యోగా చేస్తూ కనిపించింది. యోగా రోగనిరోధకశక్తిని పెంచుతుందని ప్రణీత చెప్పిం ది. ప్రభాస్ సినిమా షూటింగ్ నిమిత్తం జార్జియా వెళ్లిన ప్రియదర్శి ఇటీవలే ఇండియా వచ్చారు. కరోనా స్క్రీనింగ్‌ను పూర్తిచేసుకున్న ఆయన తనకు తాను క్లీన్‌చీట్ ఇచ్చుకోవడం కోసం పధ్నాలుగు రోజులు ఇంట్లోనే ఉంటానని పేర్కొన్నారు. బాలీవుడ్ దిగ్గజం అమితాబ్‌బచ్చన్ తన చేతిపై హోమ్ క్వారంటైన్ ముద్ర ఉన్న ఫొటోను ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు. కరోనా లక్షణాలు గుర్తిస్తే బయటకు రాకండి , వైద్యులను సంప్రదించండి అని పిలుపునిచ్చారు. శ్రద్ధాదాస్ క్యారంటైన్‌లోనే ఉన్నానని పేర్కొన్నది.

## అసమానతలపై సమరం


కల్యాణి, శివకార్తికేయన్

'నేటి విద్యావ్యవస్థ పట్ల అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో తీసిన సినిమా ఇది. సామాజిక బాధ్యతతో తెరకెక్కించిన ఈ చిత్రం ప్రతి ఒక్కరిలో ఆలోచనను రేకెత్తిస్తుంది' అని అన్నారు కోటపాడి జె రాజేష్. ఆయన తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్న చిత్రం 'శక్తి'. శివకార్తికేయన్, కల్యాణి ప్రియదర్శన్ జంటగా నటిస్తున్నారు. పి.ఎస్ మిత్రన్ దర్శకుడు. ఈ నెల 20న విడుదలకానుంది. నిర్మాత మాట్లాడుతూ 'విద్యావ్యవస్థలోని లోతుపాతుల్ని ఆవిష్కరించే సందేశాత్మక చిత్రమిది. ఈ నెల 20న ఆంధ్రప్రదేశ్‌లో, 22వ తేదీన తెలంగాణ ఈ సినిమాను విడుదలచేయనున్నాం' అని తెలిపారు. అర్జున్, అభయ్‌డియోల్, ఇవానా ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.

## రూల్స్ పాటించండి


అనుష్క

కరోనాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'నిశ్శబ్దం' చిత్రబృందం ముందుకొచ్చింది. కరోనాను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వీడియో ద్వారా వివరించారు.'వరల్డ్‌హెల్త్ ఆర్గనైజేషన్‌తో పాటు మన ప్రభుత్వం చెప్పిన రూల్స్‌ను సీరియస్‌గా అనుసరించాలి. హైజీన్‌ను ఫాలో కావాలి. మన కుటుంబాల్ని, పిల్లల్ని, వృద్ధుల్ని కాపాడుకోవాలి. జాగ్రత్తగా ఉంటే కరోనాను కంట్రోల్ చేయొచ్చు' అని అనుష్క తెలిపింది.

## 'మహానటి' తర్వాత

'మహానటి' తర్వాత దుల్కర్ సల్మాన్ తెలుగులో ఓ స్ట్రెయిట్ సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. హను రాఘవపూడి ఈ చిత్రానికి దర్శకత్వం వహించబోతున్నట్లు చెబుతున్నారు. న్యూఏజ్ లవ్‌స్టోరీగా నవ్యమైన పాయింట్‌తో ఈసినిమా రూపుదిద్దుకోనున్నట్లు తెలిసింది. వైజయంతీ మూవీస్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనున్నట్లు సమాచారం. ఇటీవలే 'కనులు కనులను దోచాయంటే' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు దుల్కర్ సల్మాన్.

---

## కరోనా పడగ

### నేడు జాతినుద్దేశించి మోదీ ప్రసంగం!

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం రాత్రి ఎనిమిది గంటలకు జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్నారని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) బుధవారం ట్వీట్ చేసింది. కోవిడ్-19 నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ప్రధాని మోదీ బుధవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారని పేర్కొంది. వైరస్‌ను కట్టడి చేసేందుకు కృషి చేస్తున్న వారిని ప్రశంసించారు. ట్విట్టర్ వేదికగా ఆయన బుధవారం నెటిజన్ల ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

### గోవాలో 'హోం' క్వారంటైన్ స్టాంప్

**పనాజీ:** కరోనా వైరస్‌ను నియంత్రించేందుకు గోవా ప్రభుత్వం 'హోమ్' క్వారంటైన్ స్టాంప్ చేపట్టాలని నిర్ణయించింది. కరోనా ప్రభావిత దేశాలు, ప్రాంతాల నుంచి విమానాల్లో డబోలిం విమానాశ్రయానికి వచ్చే ప్రయాణికులకు 'హోం క్వారంటైన్' విధిస్తూ వారి చేతులపై స్టాంప్ వేస్తామని గోవా ఆరోగ్య మంత్రి విశ్వజిత్ రాణె చెప్పారు. గురువారం అర్ధరాత్రి రెండు గంటల నుంచి ఈ ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

### ఉత్తరాఖండ్‌లో సచివాలయం బంద్

**డెహ్రాడూన్:** ఉత్తరాఖండ్ సచివాలయాన్ని వారం పాటు మూసివేయనున్నారు. ఈ నెల 19 నుంచి 24 వరకు సచివాలయాన్ని మూసివేయాలని ఉత్తరాఖండ్ ప్రభుత్వం సూచించింది. శుక్రవారం నుంచి సిబ్బంది, అధికారులు ఇండ్ల వద్ద నుంచే పని చేయాలని ఆదేశించింది.


### 'కరోనా'లాగే రోడ్డు ప్రమాదాలను అరికట్టండి

- కేంద్రానికి ఐఆర్‌ఎఫ్ విజ్ఞప్తి

**న్యూఢిల్లీ:** 'కరోనా' తరహాలోనే రోడ్డుప్రమాదాలనూ అరికట్టాలని కేంద్రాన్ని ఐఆర్‌ఎఫ్ (అంతర్జాతీయ రోడ్డు ఫెడరేషన్) కోరింది. ప్రతిరోజు భారత్‌లో సగటున 417 మంది రోడ్డుప్రమాదాల్లో చనిపోతున్నారని పేర్కొన్నది. ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న రోడ్డుప్రమాదాల్లో 12 శాతం ఇక్కడే ఉన్నాయన్నది. రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్న వారి సంఖ్య.. కరోనా మరణాలకంటే తక్కువేం కాదని ఐఆర్‌ఎఫ్ అభిప్రాయపడింది. కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు భారత్ చేపట్టిన చర్యలను స్వాగతిస్తున్నామన్న ఐఆర్‌ఎఫ్.. అదేతరహాలో రోడ్డుప్రమాదాలనూ నిలువరించాలని కోరింది.

# రేపే ఉరి

- నిర్భయ దోషుల డమ్మీ ఉరి రిహార్సల్ పూర్తి
- తీహార్ జైలులో నిర్వహించిన తలారి పవన్ జల్లాద్
- శిక్ష నుంచి తప్పించుకునేందుకు దోషుల కొత్త ఎత్తుగడలు





**న్యూఢిల్లీ:** నిర్భయ కేసు దోషుల్ని శుక్రవారం ఉరి తీయనున్న నేపథ్యంలో ఉరితీతకు సంబంధించిన ముందస్తు డమ్మీ రిహార్సల్‌ను తీహార్ జైలులో తలారి పవన్ జల్లాద్ బుధవారం నిర్వహించారు.దోషుల్ని ఉరి తీసేందుకు వాడే మనీలా తాళ్లను రిహార్సల్‌లో భాగంగా జల్లాద్ పరీక్షించినట్టు జైలు అధికారులు పేర్కొన్నారు. ఒకే కేసులో నలుగురు దోషుల్ని ఒకేసారి ఉరి తీయడం తీహార్ జైలు చరిత్రలోనే తొలిసారని అధికారులు తెలిపారు. కాగా తన తాతయ్య కూడా ఇదివరకు పలువురు దోషుల్ని ఉరితీసినట్టు జల్లాద్ గతంలో పేర్కొన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య కేసు దోషులు సత్వంత్ సింగ్, కెహర్ సింగ్‌తో పాటు పేరుమోసిన నేరస్థులు బిల్లా, రంగాను తన తాతయ్య ఉరి తీసినట్టు వెల్లడించారు.

**కొత్త ఎత్తుగడలు**

ఉరి నుంచి తప్పించుకునేందుకు నిర్భయ దోషులు తమ ఎత్తుగడల్ని వీడటంలేదు. నిర్భయపై లైంగిక దాడి జరిగిన డిసెంబర్ 16, 2012న తాను ఢిల్లీలో లేనంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను ట్రయల్ కోర్టు కొట్టివేయడాన్ని సవాల్ చూస్తూ దోషుల్లో ఒకడైన ముఖేశ్ కుమార్ వేసిన పిటిషన్‌ను బుధవారం ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. ఇంకో వైపు, తమ ఉరితీతను నిలిపివేయాలని దోషులు అక్షయ్ కుమార్ సింగ్, వినయ్ శర్మ, పవన్ గుప్తా ఢిల్లీ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. తమలో ఇద్దరం రెండోసారి క్షమాభిక్షకు పిటిషన్ పెట్టుకున్నామని, అవి రాష్ట్రపతి ముందు ఇంకా పెండింగులోనే ఉన్నాయని కోర్టుకు తెలిపారు. దోషుల వాదనలు విన్న అదనపు సెషన్స్ జడ్జి ధర్మేందర్ రాణా తీహార్ జైలు అధికారులకు, ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేశారు. ఈ పిటిషన్‌పై గురువారం వాదనలు వింటామని చెప్పారు. ఉరితీతకు ఒక్కరోజు మాత్రమే ఉండగా ఈ పిటిషన్‌ను ఎందుకు వేశారని దోషుల తరుపు న్యాయవాది ఏపీ సింగ్‌ను జడ్జి ప్రశ్నించారు. దీనికి ఆయన జవాబిస్తూ.. ఇతర కోర్టుల్లో కేసులు పెండింగులు ఉండటంతో పని ఎక్కువగా ఉన్నదని చెప్పారు. కాగా, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఎదుట ఇద్దరు దోషులు రెండోసారి దాఖలు చేసిన క్షమాభిక్ష పిటిషన్లు పెండింగులో ఉండటం, దోషుల్లో ఒకడైన అక్షయ్ భార్య వేసిన విడాకుల పిటిషన్ పెండింగులో ఉండటం, ఒక కేసులో శిక్ష పడిన దోషులందర్నీ ఒకేసారి ఉరి తీయాలన్న నిబంధన నేపథ్యంలో.. ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడిన ఉరిశిక్ష.. ఈసారైనా అమలవుతుందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.


బుధవారం ఖైరతాబాద్‌లోని విద్యుత్‌సౌధ ఎదుట దీక్షచేస్తున్న తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు

## హోరెత్తిన విద్యుత్‌సౌధ

- రెండు రాష్ర్టాల ఉద్యోగుల ఆందోళన, తోపులాట
- సీఎండీ ప్రభాకర్‌రావు చొరవతో సద్దుమణిగిన వివాదం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** జస్టిస్ ధర్మాధికారి ఆదేశాలకు విరుద్ధంగా ఏపీ విద్యుత్ సంస్థల యాజమాన్యాలు విడుదలచేసిన 655 మంది ఆంధ్ర ఉద్యోగులను తెలంగాణలో చేర్చుకోవడాన్ని అడ్డుకొంటూ విద్యుత్ ఉద్యోగులు చేపట్టిన నిరసనలు మూడోరోజుకు చేరుకొన్నాయి. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జేఏసీ, తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ నేతృత్వంలో పోరుబాట పట్టిన ఉద్యోగులు.. వేర్వేరుగా దీక్షలు నిర్వహిస్తున్నారు. ఖైరతాబాద్‌లోని విద్యుత్ సౌధ, మింట్ కాంపౌండ్‌లోని టీఎస్‌ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట దీక్షలకు దిగి ఆందోళనలతో హోరెత్తించారు. విద్యుత్‌సౌధలోకి వస్తున్న ఆంధ్ర ఉద్యోగులను తెలంగాణ ఉద్యోగులు అడ్డుకొన్నారు. తెలంగాణ వదిలి వెళ్లిపోవాలని డిమాండ్ చేయడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు. విషయాన్ని సీఎండీ డీ ప్రభాకర్‌రావు దృష్టికి తీసుకెళ్లడంతో.. ఆయన ఆంధ్ర ఉద్యోగులతో మాట్లాడారు. జస్టిస్ ధర్మాధికారి మార్గదర్శకాలకు విరుద్ధంగా విడుదలచేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లో చేర్చుకోబోమని, ఇక్కడ అనవసర రాద్ధాంతం చేయొద్దని సూచించారు. దాంతో ఉద్రిక్త వాతావరణం సమసిపోయినట్లయింది.

### ఎన్పీఆర్ కోసం ఏ పత్రాలూ అడుగం!

**న్యూఢిల్లీ,:** జాతీయ పౌర పట్టిక (ఎన్పీఆర్) కోసం ప్రజల నుంచి వివరాలు సేకరించనున్నామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్‌రాయ్ చెప్పారు. అయితే ప్రజలను ఏ పత్రాలు కోరబోమన్నారు. దేశవ్యాప్తంగా ఎన్నార్సీ అమలుపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదని బుధవారం రాజ్యసభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక జవాబిచ్చారు. కాగా, రాజ్యసభకు 37 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారిలో ఎన్సీపీ అధినేత శరద్ పవార్, కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే తదితరులున్నారు.

### పవార్‌కు 'కొరేగావ్ భీమా' కమిషన్ సమన్లు

**పుణె:** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధినేత శరద్ పవార్‌కు కొరేగావ్ భీమా విచారణ కమిషన్ సమన్లు జారీచేసింది. 2018 నాటి హింస కేసులో సాక్ష్యం చెప్పాలని కోరినట్టు ప్యానెల్ న్యాయవాది ఆశిష్ సత్‌పుతె బుధవారం తెలిపారు. వచ్చేనెల 4న కమిషన్ ముందు పవార్ హాజరవుతారని మహారాష్ట్ర మంత్రి నవాబ్ మాలిక్ తెలిపారు.

# అవసరమైతే నేనే వెళ్తా!

**కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేల్ని కలిసేందుకు బెంగళూరుకు వెళ్తానన్న సీఎం కమల్‌నాథ్**



**భోపాల్ /బెంగళూరు:** బెంగళూరులోని ఓ రిసార్టులో మకాంవేసిన తమ 16 మంది రెబల్ ఎమ్మెల్యేల్ని కలుసుకునేందుకు అవసరమైతే తానే వెళ్తానని మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్ పేర్కొన్నారు. భోపాల్‌లో బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన ఓ ప్రశ్నకు ఈ విధంగా స్పందించారు. తాను బెంగళూరుకు వెళ్లాలనుకుంటున్న విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కర్ణాటక సీఎం యెడియురప్పకు ఫోన్ ద్వారా సమాచారం అందించేందుకు కమల్‌నాథ్ ప్రయత్నించారని, అయితే వాళ్లు అందుబాటులోకి రాలేదని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. అంతకుముందు.. తమ ఎమ్మెల్యేల్ని కలుసుకునేందుకు బుధవారం ఉదయం బెంగళూరులో వాళ్లున్న రిసార్టుకు వెళ్లిన కాంగ్రెస్ నేత దిగ్విజయ్‌సింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో వైపు, తమను ఎవ్వరూ బలవంతంగా నిర్బంధించలేదని, స్వచ్ఛందంగానే ఇక్కడికి వచ్చామని కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేలు తెలిపారు. రెబల్ ఎమ్మెల్యేలను జడ్జి చాంబర్‌లో ప్రవేశపెట్టేలా ఆదేశాలివ్వాలంటూ బీజేపీ నేత శివరాజ్ సింగ్ చౌహాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం నిరాకరించింది.

## రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ట్రంప్!

- డెమోక్రటిక్ పార్టీలో శాండర్స్‌పై బిడెన్ దూకుడు



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే దేశాధ్యక్ష ఎన్నికల్లో అధికార రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి కానున్నారు. ఆయన సొంత రాష్ట్రం ఫ్లోరిడాలో అభ్యర్థిత్వానికి అవసరమైన 122 మంది రిపబ్లికన్ పార్టీ డెలిగేట్ల మద్దతు పొందారు. జాతీయ స్థాయిలో ట్రంప్‌కు 1,330 మంది రిపబ్లికన్ పార్టీ ప్రతినిధుల మద్దతు లభించింది. రిపబ్లికన్ పార్టీలో అధ్యక్ష పదవికి పోటీ చేసే నేత 1,276 మం ది ప్రతినిధుల మద్దతు పొందాలి. వచ్చే ఆగస్టులో జరిగే రిపబ్లికన్ పార్టీ సదస్సు లో లాంఛనంగా ట్రంప్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించనున్నారు. కాగా, డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా ఆ దేశ మాజీ ఉపాధ్యక్షుడు జో బిడెన్ నిలిచేందుకు మార్గం సుగమమైంది. బిడెన్ 3 కీలక రాష్ర్టాల్లో సెనేటర్ శాండర్స్‌పై గెలుపొందారు. జాతీయంగా బిడెన్‌కు 1,121 డెమొక్రటిక్ పార్టీ ప్రతినిధుల మద్దతు, శాండర్స్‌కు 839 మంది ప్రతినిధుల మద్దతు లభించింది.

## ఏపీలో ఎన్నికల కోడ్ ఎత్తేయండి

- సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశం
- ప్రభుత్వంతో సంప్రదించాక ఎన్నికల తేదీ ప్రకటించాలని ఎస్‌ఈసీకి సూచన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీలో ఎన్నికల కోడ్ ఎత్తేయాలని బుధవారం సుప్రీం కోర్టు ఆదేశాలు జారీచేసింది. స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) వాయిదావేస్తూ జారీచేసిన నోటిఫికేషన్‌ను కొట్టేయాలని ఏపీ ప్రభుత్వం.. సుప్రీంకోర్టును ఆశ్రయించగా, దీనిపై సీజేఐ ఎస్‌ఏ బాబ్డే, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేయాలని ఎస్‌ఈసీ ఇప్పటికే నిర్ణయం తీసుకున్నందున ఆ విషయంలో జోక్యం చేసుకోలేమని తెలిపింది. అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయన్న ప్రభుత్వ వాదనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఎన్నికల కోడ్ ఎత్తేయాలని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపుల తర్వాతే మళ్లీ ఎన్నికల తేదీలను ప్రకటించాలని, ఆ తేదీలకు నాలుగువారాల ముందు మాత్రమే ఎన్నికల కోడ్ విధించాలని ఆదేశించింది. ఇప్పటికే ఉన్న అభివృద్ధి కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని, కొత్తవి చేపడితే ఎన్నికల సంఘం నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించింది. కరోనా కట్టడికి ప్రభుత్వం చేపట్టే చర్యలను అడ్డుకోవద్దని సూచించింది.

### సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం: సీపీఐ

స్థానిక ఎన్నికలపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్టు సీపీఐ జాతీ య కార్యదర్శి డాక్టర్ కే నారాయణ తెలి పారు. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో తెలియని నేపథ్యంలో కోడ్‌ను సడలించి.. కొత్త పథకాలను ప్రకటించకుండా పాతవి కొనసాగించడానికి అనుమతించడం మంచి పరిణామమన్నారు. ఒకవైపు కరోనా, మరోవైపు ఎన్నికల అక్రమాలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని చెప్పారు. ఎన్నికల కమిషన్ పరిధి, ముఖ్యమంత్రి హక్కులు తెలుసుకోలేని దీనావస్థ పరిస్థితిలో సీఎం జగన్ ఉండటం విచారకరమన్నారు.

### రక్షణ కల్పించాలని కేంద్రానికి రమేశ్‌కుమార్ లేఖ

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నెలకొన్న హింసాత్మక పరిస్థితుల దృష్ట్యా తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని ఏపీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేశ్‌కుమార్.. కేంద్ర హోంశాఖకు లేఖరాశారు. ఎన్నికల వాయిదా వేసినప్పటి నుంచి ప్రభుత్వం నుంచి తనపై మాటల దాడి జరుగుతున్నదని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సంతకంతో కూడిన ఓ లేఖ బయటకొచ్చింది.

నమస్తే తెలంగాణ
రైతుబడి
raithubadi@ntnews.com
[ కరీంనగర్ ]
గురువారం 19 మార్చి 2020

# రాళ్లల్లో రతనాల పంట

**గుట్టలపై కళకళలాడుతున్న పంటలు**

**రాయితీ పరికరాలతో అద్భుతమైన దిగుబడి**



**ఎత్తయిన** కొండలు. ఎటుచూసినా రాళ్లూ రప్పలు. ఎగుడు దిగుడు భూములు. చుక్క నీరు కూడా నిలువని స్థలంలో వ్యవసాయం చేస్తున్నారు గిరిజన రైతులు. వివరాల్లోకి వెళ్తే... సిర్పూర్(యు), కెరమెరి, జైనూర్ మండలాల రైతులు రాళ్లూ రప్పలతో నిండిన గుట్టలపై తుంపర సేద్యం చేస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. ఉద్యానవన శాఖ ద్వారా 75 శాతం రాయితీపై అందిస్తున్న స్ప్రింక్లర్ల సాయంతో గోధుమ, జొన్న, మక్క, పండ్లు, కూరగాయలు, పత్తి తదితర పంటలు పండిస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం రాయితీలు కల్పిసూ ప్రోత్సహిస్తుండటంతో బిందు సేద్యం వైపు ఆదివాసులు ఆసక్తి చూపుతున్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం 75 శాతం సబ్సిడీపై 148 మంది రైతులకు 18 లక్షల 50 వేల ఆర్థికసాయం అందించింది. దీంతో జిల్లాలో 340 ఎకరాల్లో గిరిజన రైతులు తుంపర సేద్యం చేస్తున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న 24 గంటల నిరంతర విద్యుత్‌తో 75 శాతం రాయితీపై అందిస్తున్న స్ప్రింక్లర్లను పొందుతూ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఇంతకాలం వానలపై ఆధారపడిన ఏజెన్సీ రైతులు మెలమెల్లగా ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం వైపు మళ్లుతున్నారు.

– జాడి హన్మయ్య, 9182777512
కుమ్రం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి



# తమలపాకు సాగు లాభాలు బాగు

బెంగాలీ క్యాంపులో కలకత్తా తమలపాకుల పెంపకం

చేతికొచ్చిన పంట.. వారానికి రెండుసార్లు విక్రయాలు

ఒక్కో ఆకుకు 50 పైసల చొప్పున లాభం





బెంగాలీ క్యాంపులో అమృత్ బిస్వాస్ కుటుంబం విభిన్న పంటలు సాగుచేస్తూ లాభాలు గడిస్తున్నది. కలకత్తా తమలపాకులు పెంచుతూ ఆదర్శంగా నిలుస్తున్నది. సుమారు 20 గుంటల్లో తమలపాకు పంట సాగు చేస్తున్నారు. వారానికి రెండు సార్లు ఆకులు తెంపుతూ, ఒక్కో తమలపాకును యాభై పైసల చొప్పన అమ్ముతున్నారు.



**బెంగాల్‌కు** చెందిన అమృత్‌బిస్వాస్ కుటుంబం కొన్నేండ్ల కిందట సిర్పూర్(టి) మండలం బెంగాలీ క్యాంప్‌నకు వచ్చి స్థిరపడింది. ప్రభుత్వం ఇచ్చిన నాలుగెకరాల భూమిలో పలు పంటలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నది.

అమృత్ బిస్వాస్ తనకున్న నాలుగెకరాల్లో వరి పండించేవాడు. నాలుగేండ్ల కిందట బిస్వాస్ కలకత్తాలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడ కలకత్తా తమలపాకులు పెంచుతున్న విధానాన్ని చూశాడు. తమలపాకులను సాగుచేసే విధానం, ఎలాంటి మందులు వాడాలి, ఏ కాలంలో సాగు చేయాలనే వివరాలు తెలుసుకున్నాడు. రూ.20తో తమలపాకుల నారు కొనుగోలు చేసి 20 గుంటల భూమిలో నాటాడు. తమలపాకుల తీగలను నేల మీద పారించకుండా నీడ కోసం ఈతచెట్ల కమ్మలు, మునగ (వెదురు) కర్రలతో పందిళ్లు వేసి మొక్కలను పందిళ్ల పైకి ఎక్కించాడు. తమలపాకుల దిగుబడి అధికంగా వచ్చి పెద్ద మొత్తంలో లాభాలు పొందుతున్నాడు. ఈ సారి ఐదు నెలల కిందట పంట వేయగా, ప్రస్తుతం తమలపాకులు కోతకొస్తున్నాయి. తమలపాకులను వారానికి రెండుసార్లు మార్కెట్లోకి తెస్తున్నాడు రైతు అమృత్ బిస్వాస్.

నేను కలకత్తా పోయినప్పుడు అక్కడ మసాలా ఆకుల, కలకత్తా తమలపాకుల సాగును చూసిన. అప్పుడే నాకున్న పొలంలో వేయాలనుకున్న. కలకత్తా నుంచి నారును కొనుక్కొచ్చి 20 గుంటల్లో నాటిన. వాటిని బతికించుకునేందుకు మస్తు తిప్పలైంది. తమలపాకులు చల్లటి వాతావరణంలోనే పెరుగుతాయి. అందుకే ఎండ తాకకుండా పందిళ్లు వేసిన. ఈ తమలపాకులకు మంచి గిరాకీ ఉన్నది. ఒక్కో ఆకు యాభై పైసలకు అమ్ముతున్న. వానకాలం అయితే రూపాయికొక్క ఆకు అమ్ముతా. ఇప్పుడు భాగాల, మసాలా ఆకులకు సంబంధించిన మొక్కలను కూడా పెంచుతున్నా.

– అమృత్ బిస్వాస్,
రైతు, బెంగాలీ క్యాంప్

– బొల్లు చిరంజీవి, 9505882766
కాగజ్‌నగర్ రూరల్

# చదివింది బీటెక్ పట్టింది నాగలి

ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగంలో ఇంజినీరింగ్ పూర్తిచేసిన సుభాష్‌రెడ్డికి న్యూజిలాండ్‌లోని ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. సుభాష్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. కానీ అది ఎన్నో రోజులు లేదు. నేను న్యూజిలాండ్ వెళ్లనంటే వెళ్లనని సుభాష్‌రెడ్డి కరాఖండీగా చెబితే ఆ తల్లిదండ్రులు విస్తుపోయారు. చివరికి సుభాష్‌రెడ్డి చెప్పిన సమాధానానికి సంతోషపడ్డారు. సుభాష్‌రెడ్డిని ఆ తల్లిదండ్రులు ఏం ప్రశ్నడిగారు.. సుభాష్‌రెడ్డి తల్లిదండ్రులకు ఏం సమాధానం చెప్పాడో ఇప్పుడు తెలుసుకుందాం..

## సాంకేతిక రంగం నుంచి సాగుబడిలోకి..

## పండ్ల తోటల సాగులో ఆదర్శంగా నిలుస్తున్న యువరైతు



**ఎకరాకు ఏడాదికి రూ.9 లక్షల ఆదాయం**

డ్రాగన్ ఫ్రూట్ పూత వచ్చిన 45 రోజుల్లో పండు తయారవుతుంది. నాటిన ఏడాదిలోనే దిగుబడి ప్రారంభం అవుతుంది. జూన్ మాసం నుంచి పూత రావడం ప్రారంభమై మూడవ సంవత్సరంలో ఆరు టన్నుల దిగుబడి లభిస్తుంది. పిలకలను కత్తిరించి నర్సరీలో మొక్కలు పెంచి రైతు అమ్ముకోవచ్చు. టన్ను ధర రూ. లక్షా 50 వేలు ఉంటుంది. ఒక సంవత్సరంలో వచ్చే ఆరు టన్నుల దిగుబడికి రూ.9 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది.

**'మిమ్మల్ని వదిలి** న్యూజిలాండ్ వెళ్లడం లేద'ని చెప్పిన సుభాష్‌రెడ్డిని ఆయన తల్లిదండ్రులు 'మరిక్కడేం చెస్తావ'ని ప్రశ్నించారు. 'మనకున్న ముప్పై ఎకరాల్లో వ్యవసాయం చేస్తా'నని సమాధానం చెప్పారు. ఆ సమాధానాన్ని స్వాగతించిన సుభాష్‌రెడ్డి తల్లిదండ్రులు బెస్ట్ ఆఫ్ లక్ చెప్పి తప్పుకున్నారు. అంతే వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాడు.

జగిత్యాల జిల్లా అంతర్గాం గ్రామానికి చెందిన ఈ యువరైతు పదేండ్ల కిందట సేద్యాన్ని ఆరంభించిన అందరిలాగే వరిని సాగుచేయడం మొదలుపెట్టాడు. అయితే అనుకున్న స్థాయిలో దిగుబడి రాలేదు. ఆహారపంటల కంటే, ఉద్యానవన పంటలకు మంచి భవిష్యత్తు ఉంటుందని గ్రహించాడు. ఉద్యానవనశాఖ అధికారులతో చర్చించి జామ పంటను ఎంచుకున్నాడు. సుభాష్‌రెడ్డి మూడేండ్ల కిందట ఐదెకరాల విస్తీర్ణంలో ఎకరానికి నాలుగు వందల చొప్పున మొత్తం రెండు వేల జామ మొక్కలను నాటాడు. 11 నెలల్లోనే తొలి జామపంట చేతికివచ్చింది. జామతోటను మొదట గుత్తేదారులకు అప్పగించిన సుభాష్‌రెడ్డి తర్వాత తానే స్వయంగా జామ సాగు చేశాడు. నవంబర్‌లో జామ సీజన్ ముగిసిపోయింది. ఇప్పుడు మరో సీజన్‌కు సుభాష్‌రెడ్డి జామ తోట సిద్ధమైంది. అంతేకాదు మూడు నెలల కిందట రెండెకరాల్లో సీతాఫలం మొక్కలను కూడా నాటాడు. శాస్త్రీయ పద్ధతిలో సాగుతున్న సీతాఫలం తోట ఈ ఏడాది అక్టోబర్ వరకు కాతకు వస్తుందని నమ్మకంగా చెబుతున్నాడు సుభాష్‌రెడ్డి. జామ, సీతాఫలంతో పాటు, పదిహేను ఎకరాల్లో మామిడి తోటను సాగు చేస్తున్నాడు. ఉద్యానవన పంటల్లో అధిక ఆదాయంతో పాటు, సంతోషం, తృప్తి కూడా ఉంటుదంటున్నాడు.

### ఉమ్మడి జిల్లాలో తొలిసారిగా డ్రాగన్‌ఫ్రూట్

డ్రాగన్‌ఫ్రూట్ విదేశాల్లో విరివిగా సాగవుతున్న ఉద్యానవన పంట. ఔషధ గుణాలు కలిగినదిగా గుర్తింపు పొందిన డ్రాగన్‌ఫ్రూట్ షుగర్‌ను తగ్గించడంతో పాటు కొవ్వును కరగిస్తుంది. రక్తకణాలను పెంపొందిస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు. డ్రాగన్ ఫ్రూట్ సాగుపై అధ్యయనం చేసిన సుభాష్‌రెడ్డి ఏడు నెలల కిందట రెండెకరాల్లో సాగు మొదలు పెట్టాడు. మరో నాలుగు మాసాల్లో డ్రాగన్‌ఫ్రూట్ తొలి పంట చేతికి రాబోతున్నది.

### డ్రాగన్‌ఫ్రూట్ ప్రత్యేకతలు

ఇది ఎడారి జాతికి చెందిన మొక్క కావడంతో పెద్దగా నీటి అవసరం ఉండదు. ఎడారిలో 50 సెంటీమీటర్ల వర్షం సరిపోతుంది. సేంద్రియ ఎరువులు వేస్తే మంచి దిగుబడి వస్తుంది. ఒక్కసారి డ్రాగన్ మొక్కను నాటినట్లయితే 20 నుంచి 30 ఏండ్ల వరకు దిగుబడి వస్తుంది. 15 రోజులకోసారి తేలికపాటి నీటి తడిని డ్రిప్ ద్వారా అందించాలి. నీరు నిలిచే బంక నేలలు మినహా అన్ని నేలలూ డ్రాగన్‌ఫ్రూట్ సాగుకు అనుకూలంగా ఉంటాయి.

### ఏడాది మొత్తం కాత వస్తుంది

సాధారణంగా డ్రాగన్ మొక్కలు తొలి కాత కాయడానికి రెండు నుంచి మూడేండ్ల సమయం పడుతుంది. కానీ డబుల్ గ్రాఫ్టింగ్ పద్ధతిని ఉపయోగించి పంట సాగు చేసినట్లయితే కేవలం ఎనిమిది నెలల్లోనే తొలి దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. సహజంగా డ్రాగన్



ఫ్రూట్ దిగుబడి కాలం జూన్-అక్టోబర్ మధ్యకాలం. కానీ నవంబర్-జనవరి మధ్యకాలంలో డ్రాగన్ మొక్కలకు విద్యుత్తు లైట్ల ద్వారా కాంతిని అందిస్తే, జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే మొక్కలు పూతకు వచ్చేలా చేయవచ్చు. ఇలా చేస్తే 30 శాతం అధిక దిగుబడి వస్తుంది.

ఇలా సుభాష్‌రెడ్డి చేసిన సాహసం రాష్ట్రంలోని పలువురు యువకులకు స్ఫూర్తినిస్తుందని వ్యవసాయాధికారులతో పాటు స్థానికులు అంటున్నారు.

– కొత్తూరి మహేశ్, 9182777507, జగిత్యాల ప్రతినిధి
– బానుక శ్రీనివాస్, 9490530001, జగిత్యాల టౌన్



# వరికి మెడవిరుపు

## యాసంగి పంటను ఆశిస్తున్న చీడ

## రైతులను అప్రమత్తం చేస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు

**రాష్ట్రంలో సాగు చేస్తున్న వరి పంటను చిరుపొట్ట దశ నుంచి గింజ గట్టిపడే దశలో ఎక్కువగా మెడవిరుపు తెగులు, కాండం తొలిచే పురుగు ఆశిస్తున్నది. ఈ తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే రైతులు ఈ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలి.**

**మెడవిరుపు తెగులు లక్షణాలు...**
వరి పంటలో అగ్గి తెగులు లక్షణాలు కణుపులు వెన్నులపైన కనిపిస్తాయి. వ్యాధి సోకిన మొక్కల కణుపులు గోధుమరంగు లేదా ముదురు గోధుమ రంగుకు మారి కుళ్లిపోతాయి. వెన్నులు వేసే దశలో ఈ శిలీంధ్రం ఆశించినట్లయితే తెగులు లక్షణాలు గొలుసుల మెడలపై కనిపిస్తాయి. నల్లటి మచ్చలు ఏర్పడి, ఆ తర్వాత ఎండిపోవడం వల్ల గొలుసులు విరిగి వేలాడుతూ ఉంటాయి. దీంతో గింజలు తాలుగా మారి పంట దిగుబడిలో తీవ్ర నష్టం జరుగుతుంది.

**ఆశించడానికి కారణాలు..**
ఫిబ్రవరి మాసంలో గాలిలో అధిక తేమ శాతం (90 శాతం), రాత్రి ఉష్ణోగ్రతల్లో తగ్గుదల (12 నుంచి 20 డిగ్రీల సెల్సియస్), కొన్ని ప్రాంతాల్లో మంచు కురువడం వల్ల అగ్గి తెగులు వ్యాప్తికి అనుకూలంగా ఉంటుంది. తెగులు కలుగజేసే శిలీంధ్రం పాథోటైప్‌లో అత్యంత శక్తివంతమైనదిగా వృద్ధి చెందుతుంది. బీపీటీ 5204, యం.టి.యు 1010 లేదా జేజీయల్ 1798 వంటి రకాలు అగ్గి తెగులుకు తట్టుకోలేవు. అగ్గి తెగులు శిలీంధ్ర నాశినిలను పిచికారీ చేస్తూనే మరోవైపు యూరియాను వేయడం వల్ల అగ్గితెగులు ఉధృతి ఎక్కువవుతుంది. 'ట్రైసైక్లోజోల్'ను ఒకే ప్రాంతంలో కొన్నేండ్లు వాడటం వల్ల శిలీంధ్రానికి తట్టుకొనే శక్తి పెరుగుతుంది. అందువల్ల శిలీంధ్ర నాశినులైన మందులను మార్చి కొట్టాల్సిన అవసరం ఉంటుంది.



### నివారణ చర్యలు

**తెగులు** నివారణకు ఐసోప్రోథయోలేన్ 1.5 మి.లీ/లీ, లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ/లీ, లేదా ట్రైసైక్లోజోల్, మాంకోజెట్ 2.5 గ్రా/లీటరు వాడాలి. కొత్త తెగుళ్ల మందులైన పికాక్సిస్ట్రాబిన్ 6.78+ప్రొఫికోనజోల్ 20.33 శాతం ఎస్.సి 2 మి.లీ/లీ, లేదా ప్రొపికోనజోల్ 10.7 శాతం+ట్రైసైక్లోజోల్ 34.2 శాతం ఎస్.ఇ.1మి.లీ, లేదా టెబుకోనజోల్ 50 శాతం+ట్రైఫ్లోక్సిస్ట్రాబిన్ 25 శాతం 0.4 గ్రా/లీటర్ నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుందని శాస్త్రవేత్తలు అంటున్నారు.

కాండం తొలిచే పురుగు చిరుపొట్ట దశలో ఆశించినట్లయితే కంకుల్లో గింజలు పాలుపోసుకోక తాలుగా మారుతాయి. చిరుపొట్ట దశలో ఉన్న వరి పైర్లలో కాండం తొలిచే పురుగు నివారణకు కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్.పి.2 గ్రా/లీటరు, లేదా క్లోరాంట్రానిల్‌ప్రోల్ 0.3 మి.లీ/ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రెండవ దశలో ఈగలు పొట్టలో ఉన్న కంకుల లోపలికి చేరి నష్టాన్ని కలుగజేయడం వల్ల గింజలు పూర్తిగా లేదా పాక్షికంగా తాలుగా మారుతాయి. గింజ తయారయ్యే దశలో ఫ్లవర్ థ్రిప్స్ (తామర పురుగులు) ఆశిస్తే గింజలపై అతి సన్నని రంధ్రం ఏర్పడుతుంది. దీన్ని గమనించి మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ/లీటరు పిచికారీ చేయాలని ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన విభాగం డైరెక్టర్ డాక్టర్ జగదీశ్ తెలిపారు.

– మజ్జిగపు శ్రీనివాస్‌రెడ్డి, 80966 77036

కరోనా ఖేల్


సైనా

## ప్లేయర్ల ప్రాణాలను గాలికొదిలారు

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ అంతకంతకు వ్యాపిస్తున్నా ఆర్థిక ప్రయోజనాల కోసం ప్లేయర్ల ప్రాణాలను గాలికి వదిలారని భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ ఆరోపించింది. ఓవైపు కొవిడ్-19 ప్రమాదకరంగా మారుతున్నా..బర్మింగ్‌హామ్‌లో ఆల్ ఇంగ్లండ్ టోర్నీని నిర్వహించడాన్ని సైనా ట్విట్టర్‌లో తప్పుబట్టింది. 'షట్లర్ల ఆరోగ్యాన్ని ఏ మాత్రం దృష్టిలో పెట్టుకోకుండా ఆల్ ఇంగ్లండ్ టోర్నీని నిర్వహించారు. మా కంటే వారికి ఆర్థిక అవసరాలే ఎక్కువయ్యాయి. అంతకుమించి వేరే కారణాలు ఏమిలేవు' అని సైనా ట్వీట్ చేసింది.



## టోక్యో బెర్త్‌పై ద్యుతీ ఆందోళన

**భువనేశ్వర్:** కరోనా వైరస్ ప్రభావంతో జర్మనీలో జరగాల్సిన పలు అథ్లెటిక్స్ పోటీలు రద్దవడంతో భారత అగ్రశ్రేణి స్ప్రింటర్ ద్యుతీ చంద్‌కు నిరాశ ఎదురైంది. విశ్వక్రీడలకు అర్హత సాధించాలన్న ఆమె లక్ష్యం ఇప్పటికి నిలిచిపోయింది. గతంలోనే వీసా మంజూరైనా కరోనా వైరస్ విజృంభిస్తుండడంతో జర్మనీకి వెళ్లేందుకు ద్యుతీకి అనుమతి లభించలేదు. 'వీసాతో పాటు జర్మనీకి వెళ్లేందుకు కావాల్సిన పత్రాలన్నీ సిద్ధంగా ఉన్నాయి. అయితే వైరస్ కారణంగా ఇక్కడికి వచ్చేందుకు వీల్లేదంటూ ఆ దేశంలోని ట్రైనింగ్ క్యాంప్ నుంచి సందేశం వచ్చింది. నేను చాలా నిరాశచెందా' అని ద్యుతీ చెప్పింది. 100మీటర్ల పోటీలో ఒలింపిక్స్ అర్హత 11.15సెకన్లు కాగా, ఈ మార్క్‌ను అందుకునే అవకాశం చేజారిందని ద్యుతీ నిరాశ వ్యక్తం చేసింది.

# చక్‌దే ఆదిలాబాద్

జాతీయ స్థాయి హాకీలో రాణిస్తున్న కొలాం క్రీడాకారులు

ఆశ్రమ పాఠశాల నుంచి అంచెలంచెలుగా

సాయ్ ఎంపికలోనూ సత్తా



ఆదిలాబాద్ అడవులకు ప్రసిద్ధి. దట్టమైన అరణ్యాలతో అలరారే తెలంగాణ కశ్మీరం అందాలకు నెలవు. అడవి బిడ్డలతో కళకళలాడే ఈ జిల్లా క్రీడల్లోనూ సై అంటున్నది. ఆదివాసీ జాతుల్లో ఒకటైన కొలాం కుర్రాళ్లు...హాకీలో కుమ్మేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల వేదికగా తమ ఆటకు మెరుగులు దిద్దుకుంటూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో అదరగొడుతున్నారు. టోర్నీ ఏదైనా పతకం పక్కా అన్న రీతిలో దూసుకెళుతూ హాకీకీ ఆదిలాబాద్‌ను అడ్డాగా మారుస్తున్నారు. జూనియర్, సీనియర్ స్థాయిలో సత్తాచాటుతూ జాతీస్థాయికి ఎదిగిన కొలాం హాకీ క్రీడాకారులపై ప్రత్యేక కథనం.

**ఆదిలాబాద్ రూరల్:** ఆదిలాబాద్ అంటేనే అడవుల జిల్లా. మిగతా తెలంగాణ జిల్లాలతో పోలిస్తే అటవీ విస్తీర్ణం ఇక్కడ ఎక్కువ. ఆదివాసీ తెగల్లో ఒకటైన కొలాం జాతి వాసుల పరిస్థితి మిగతావారి కంటే వెనుకబడి ఉంది. ఈ కారణంగా వీరిని పైకి తీసుకురావాలన్న ఉద్దేశంతో జిల్లా కేంద్రంలో కొలాం విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఓ పాఠశాల ఏర్పాటు చేశారు. ఇది వీరికి బాగా కలిసొచ్చింది. అడవుల్లో నిరంతరం సంచరిస్తుండటం వల్ల మిగతావారి కంటే వీరు సహజంగానే ధృడంగా ఉంటారు. వీరి శారీరక తత్వాన్ని దృష్టిలో పెట్టుకుని ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు కొలాం కుర్రాళ్లకు హాకీలో శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టారు.

### అంచెలంచెలుగా

కొలాం విద్యార్థుల సహజసిద్ధ లక్షణాలను గమనించిన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు హాకీలో వారిని సానబెట్టేందుకు సిద్ధమయ్యారు. అందుకు తగ్గట్లు మెరికల్లాంటి విద్యార్థులను గుర్తించి కఠోర శిక్షణ ఇచ్చారు. పాఠశాలకు చెందిన కొరెడ్డి పార్థసారథి.. విద్యార్థులను దగ్గరలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిరంతరం శిక్షణ ఇచ్చారు. రోజు రోజుకు తమ ప్రతిభకు పదును పెట్టుకుంటూ కొలాం విద్యార్థులు ముందుకు సాగారు. దీనికి తోడు జిల్లా, రాష్ట్ర స్థాయి టోర్నీల్లో పాల్గొంటూ ప్రత్యర్థి జట్లకు దీటైన పోటీనిస్తూ ముందుకు సాగుతున్నారు. పార్థసారథికి తోడు సీనియర్ క్రీడాకారులు డేవిడ్, జాదవ్ రవిందర్ హాకీలో శిక్షణనివ్వడం వీరికి బాగా కలిసొచ్చింది. అందుబాటులో ఉన్న సౌకర్యాలతో విద్యార్థులు అంచెలంచెలుగా ఎదిగారు.

### హాకీలో పతకాల పంట

కొలాం క్రీడాకారులు అనతి కాలంలోనే హాకీలో మెళకువలు నేర్చుకున్నారు. ప్రతి రోజు ఉపాధ్యాయుల సమక్షంలో గంటల తరబడి కఠోరంగా సాధన చేశారు. వీరు రాష్ట్ర స్థాయిలో ఏ పోటీకెళ్లినా..కచ్చితంగా ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. ఇలా టోర్నీ ఏదైనా..టైటిల్, పతకాలతో తిరిగి రావడం వీరికి పరిపాటిగా మారింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జరిగే అండర్-14, 17, 19 రాష్ట్ర స్థాయి టోర్నీల్లో వీరి బరిలోకి దిగుతున్నారంటే.. మిగతా జట్లకు దడపుడుతున్నది.

### సాయ్ సెంటర్‌కు ఎంపిక

కొలాం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తూ హాకీలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆడిన క్రీడాకారులు భారత క్రీడా ప్రాధికార సంస్థ(సాయ్)కు ఎంపికయ్యారు. సాయ్‌లో ఆదిలాబాద్ నుంచి ఎంపికైన ఏడుగురు ఈ పాఠశాలకు చెందిన వారే కావడం విశేషం. హైదరాబాద్ సాయ్ సెంటర్‌లో గజానన్, రాంకుమార్, నర్సింగ్, పరమేశ్వర్, నగేశ్ ఉన్నారు. సాయ్ మహబూబ్‌నగర్ సెంటర్‌లో భీంరావ్, కిరణ్ శిక్షణ తీసుకుంటున్నారు.


### అత్యుత్తమ ప్రదర్శన

- 2017 – ఆదిలాబాద్‌లో జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి పోటీలో ప్రథమ స్థానం
- 2019 – జూనియర్స్‌లో ద్వితీయ స్థానం
- 2019 – వనపర్తిలో జరిగిన అండర్-17 హాకీ పోటీల్లో ప్రథమ స్థానం
- 2019 – సబ్‌జూనియర్ హాకీ పోటీల్లో తృతీయ స్థానం.
- 2019 – స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్-17 టోర్నీలో ద్వితీయ స్థానం
- 2020 – హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సొసైటీ లీగ్ హాకీ పోటీల్లో ప్రథమ స్థానం.

### జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులు...

గజానన్ , రాంకుమార్, కుర్సెంగే నర్సింగ్, పరమేశ్వర్, నగేశ్, భీంరావ్, పెందూర్ కిరణ్, శ్రీహరి, జంగు, కిరణ్, వినోద్, జ్ఞానేశ్వర్, కొడప ప్రదీప్, శ్రీహరి, జంగు, రాథోడ్ లోకేష్, ముకుంద్‌రావ్, సూర్యారావు, సుదర్శన్, వినోద్, రామ్ జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు.

## జూలై-సెప్టెంబర్‌లో ఐపీఎల్!



**ముంబై:** ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ (కొవిడ్-19) వ్యాప్తి పెరుగుతున్నది. పూర్తిగా ఎప్పుడు నియంత్రణలోకి వస్తుందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 15నుంచి కూడా ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) 13వ సీజన్ జరిగే అవకాశాలు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో బీసీసీఐతో పాటు ఫ్రాంచైజీ యాజమాన్యాలు తర్జనభర్జన పడుతూ.. విభిన్న ఆప్షన్లను ఆలోచిస్తున్నాయి. ఈ క్రమంలో జూలై -సెప్టెంబర్ మధ్య ఈ ఏడాది ఐపీఎల్‌ను నిర్వహించాలన్న ప్రతిపాదనలు సైతం తెరమీదకు వచ్చినట్టు సమాచారం. ఆ సమయంలో ప్రధాన విదేశీ జట్లకు మేజర్ సిరీస్‌లు ఎక్కువగా లేకపోవడమే ఇందుకు కారణంగా ఉంది. ఐసీసీ భవిష్యత్ పర్యటనల ప్రణాళిక(ఎఫ్‌టీపీ) ప్రకారం యూఏఈలో ఈ ఏడాది సెప్టెంబర్‌లో టీ20 ఆసియాకప్ జరుగనుంది. అదే నెలలో పాకిస్థాన్.. ఇంగ్లండ్‌లో పర్యటించనుండగా.. ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డు వంద బంతుల క్రికెట్‌ను జూన్ -జూలై మధ్య నిర్వహించాలని యోచిస్తున్నది. మరోవైపు జూలై 20 నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో ఆస్ట్రేలియా, వెస్టిండీస్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ జట్లకు షెడ్యూల్ ప్రకారం ఏ పెద్ద సిరీస్‌లు లేవు. దీంతో ఇంగ్లండ్ మినహా మిగిలిన జట్ల ఆటగాళ్లు ఐపీఎల్‌కు అందుబాటులో ఉండే అవకాశం ఉంటుంది. ఆసియా కప్ కాకుండా టీ20 ప్రపంచకప్ కంటే ముందు ఆస్ట్రేలియాతో మూడు వన్డేలు, శ్రీలంకలో మూడు టీ20ల సిరీస్‌లను భారత్ ఆడాల్సి ఉంది. ఐపీఎల్ జూలై – సెప్టెంబర్‌లో జరిపితే ఈ సిరీస్‌లను తర్వాత నిర్వహించేలా సర్దుబాటు ఎలా చేయాలన్నది బీసీసీఐకి సవాలుగా మారే అవకాశం ఉంది.

### కొన్ని ఇక్కడ.. మరికొన్ని విదేశాల్లో..!

ఐపీఎల్‌ను ఆలస్యంగా ప్రారంభించినా కొన్ని మ్యాచ్‌లు స్వదేశంలో.. మరికొన్ని విదేశాల్లో నిర్వహించే చాన్స్ లేకపోలేదు. అయితే అప్పటికి కరోనా వైరస్ ప్రభావాన్ని బట్టి ఇక్కడే నిర్వహించాలా.. విదేశాల్లోనా అనేది తేలే అవకాశం ఉంటుంది.

## ప్రమాదంలోకి నెడుతున్నారు

కరోనా వైరస్ వ్యాపిస్తుంటే.. శిక్షణ ఎలా?.. ఐఓసీపై అథ్లెట్ల అసంతృప్తి



**టోక్యో:** కరోనా వైరస్(కొవిడ్-19) విజృంభిస్తున్నా షెడ్యూల్ ప్రకారమే టోక్యో విశ్వక్రీడలు నిర్వహించేందుకు కట్టుబడి ఉన్నామని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐఓసీ) ప్రకటించడంపై పలువురు అథ్లెట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అథ్లెట్ల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేలా ఒలింపిక్స్ నిర్వాహకులు మాట్లాడుతున్నారని ఒలింపిక్ పోల్‌వాల్ట్ చాంపియన్ క్యాథరీనా స్టెఫానిడి(గ్రీసు) బుధవారం అసంతృప్తి వ్యక్తం చేసింది. 'ఒలింపిక్స్ కోసం ప్రతిరోజు సన్నద్ధమవుతూ మాతో పాటు కుటుంబ సభ్యులు, ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టాలని ఐఓసీ అనుకుంటుందా? నాలుగు నెలల్లో కాదు.. ఐఓసీ ఇప్పుడే మా ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నది. ఇది నమ్మశక్యం కాకుండా ఉంది' అని స్టెఫానిడి ట్వీట్ చేసింది. 'కలిసి ప్రాక్టీస్ చేయాల్సిన టీమ్ విభాగం పోటీలకు ఎలా సన్నద్ధమవ్వాలి.. స్విమ్మింగ్ మాటేమిటి... అలాగే జిమ్నాస్టిక్స్ సాధనలో ఒకరు ముట్టుకున్న పరికరాలనే మరొకరు వినియోగించాల్సి ఉంటుంది' అని ఐఓసీని బ్రిటీష్ హెప్టాథ్లాన్ అథ్లెట్ జాన్సన్ థాంప్సన్ ప్రశ్నించింది. అయితే కరోనా సంక్షోభానికి ప్రస్తుతానికైతే తమ వద్ద ఎలాంటి ఉత్తమ పరిష్కారం లేదని ఐఓసీ తెలిపింది.


అశ్విన్

## భూమి సవాల్ విసురుతున్నది

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచిస్తూ టీమ్‌ఇండియా స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ బుధవారం ఆసక్తికర ట్వీట్ చేశాడు. 'మానవాళికి భూమి సవాల్ విసురుతున్నది. సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉండగలమా, ఎదుటివారి క్షేమం కోసం నిజాయితీగా మెలగగలమా, స్వీయ నిర్బంధం విధించుకోగలమా అని ప్రశ్నిస్తున్నది. సమాధానమిచ్చేందుకు ఇవి కఠినమైన ప్రశ్నలని ఆలోచిస్తున్నారా. సురక్షితంగా ఉండండి, సమాధానాలివ్వండి' అని అశ్విన్ ట్వీట్ చేశాడు.

## అన్ని మ్యాచ్‌లు వాయిదా: హెచ్‌సీఏ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** కరోనా వైరస్ ప్రభావంతో ఏ-3 డివిజన్ మ్యాచ్‌లతో పాటు నాకౌట్ లీగ్‌ను వాయిదా వేస్తున్నట్లు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) బుధవారం ప్రకటించింది. ఆటగాళ్లు, అధికారుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని హెచ్‌సీఏ ఒక ప్రకటనలో పేర్కొంది. దీనికి తోడు వైరస్ వ్యాప్తి కారణంగా బయోమెట్రిక్ హాజరు పద్ధతిని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు హెచ్‌సీఏ తెలిపింది.

## 'మంకీగేట్' మాయని మచ్చ


రికీ పాంటింగ్

**మెల్‌బోర్న్:** మంకీగేట్ వివాదం తన కెప్టెన్సీలో ఓ మాయని మచ్చ అని ఆస్ట్రేలియా మాజీ సారథి రికీ పాంటింగ్ అన్నాడు. ఆ ఘటన జరిగినప్పుడు పరిస్థితులు తన నియంత్రణలో లేకుండా పోయాయని బుధవారం ఓ కార్యక్రమంలో చెప్పాడు. 2008 ఆస్ట్రేలియా పర్యటనలో సిడ్నీ వేదికగా జరిగిన రెండో టెస్టులో భారత ఆఫ్ స్పిన్నర్ హర్భజన్ సింగ్... ఆసీస్ ఆల్‌రౌండర్ ఆండ్రూ సైమండ్స్ మధ్య మాటల యుద్ధం సాగింది. సైమండ్స్ భజ్జీ జాతివివక్షాపూరిత వ్యాఖ్యలు చేశాడని ఆసీస్ ప్లేయర్లు ఆరోపించారు. భారత ప్లేయర్లంతా హర్భజన్‌కు మద్దతుగా నిలువగా.. విచారణ తర్వాత అతడు నిర్దోషిగా తేలాడు. దీనిపై రికీ దాదాపు పుష్కరం తర్వాత స్పందించాడు. 'మంకీగేట్ వివాదం నా కెప్టెన్సీలో అత్యంత దుర్భరమైన సమయం. 2005లో యాషెస్ సిరీస్ కోల్పోయినా పూర్తి నియంత్రణలో ఉన్నా. కానీ ఆ వివాదం సమయంలో జరిగిన పరిణామాల పట్ల నియంత్రణ కోల్పోయా. మంకీగేట్ వివాదం చాలా కాలం సాగడంతో కెప్టెన్సీలో కిందిస్థాయికి వెళ్లిపోయినట్టు అనిపించింది' అని రికీ చెప్పాడు. మంకీగేట్ వివాదం తర్వాత భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య అంతరం విపరీతంగా పెరిగింది. పర్యటన మధ్యలోనే వైదొలగాలని టీమ్‌ఇండియా ఆటగాళ్లు ఓ దశలో నిశ్చయించుకున్నా ఐసీసీ జోక్యంతో వెనక్కితగ్గారు.

## ఫోన్లు బంద్ చేయాలి


బౌచర్

**జొహాన్నెస్‌బర్గ్:** కరోనా వైరస్ కారణంగా ప్రపంచం చాలా శాతం మూతబడినా మొబైల్ ఫోన్ల వాడకం తగ్గలేదని దక్షిణాఫ్రికా కోచ్ మార్క్ బౌచర్ అభిప్రాయపడ్డాడు. రెండు వారాల పాటు ఫోన్లను స్విచ్చాఫ్ చేస్తే బాగుంటుందని సూచించాడు. 'గ్లోబల్ లాక్ డౌన్‌లో సెల్‌ఫోన్ వాడకం అంశం ఒక్కటి మిస్ అయింది. రెండు వారాల పాటు ఫోన్లు స్విచ్చాఫ్ చేసే అంశంపై ఏమంటారు' అని బౌచర్ బుధవారం ట్వీట్ చేశాడు.

### స్వీయ నిర్బంధంలో సఫారీలు

భారత్‌తో వన్డే సిరీస్‌ను అర్ధాంతరంగా ముగించుకుని స్వదేశానికి చేరుకున్న దక్షిణాఫ్రికా క్రికెటర్లు స్వీయ నిర్బంధంలోకి వెళ్లనున్నారు. కరోనా వైరస్ మరింతగా వ్యాప్తి చెందకుండా ఉండేందుకు గాను 14 రోజుల పాటు క్రికెటర్లు క్వారంటైన్‌లోకి వెళుతారని క్రికెట్ దక్షిణాఫ్రికా చీఫ్ మెడికల్ ఆఫీసర్ బుధవారం పేర్కొన్నాడు.